శ్రీమతే రామానుజాయ నమః



# సహస్రనామ రామాయణమ్,
# శ్రీరామాయణ సుధానిధి

(కాంచీ మహావిద్వాన్ ప్రతివాది భయంకరమ్
అణ్ణంగరాచార్య స్వామివారి ద్రావిడ గ్రంథాలకు
ఆంధ్రానువాదం)


అనువక్త

**డా॥ శ్రీమాన్ ఈ.ఏ. శింగరాచార్య స్వామి**



శ్రీమతి దాసరి గృహలక్ష్మి, శ్రీమాన్ దాసరి రామకృష్ణ
పుణ్యదంపతుల పవిత్ర స్మృతి జ్ఞాపిక

**2013**

# సహస్రనామ రామాయణమ్,
# శ్రీరామాయణ సుధానిధి

( కాంచీ ప్రతివాది భయంకరమ్ అణ్ణంగరాచార్య
స్వామివారి ద్రావిడ గ్రంథాలకు ఆంధ్రానువాదం )

**అనువక్త – డా॥ శ్రీమాన్ ఈ.ఓ. శింగరాచార్య స్వామి**

ప్రతులు : 500

హక్కులు : అనువాదకునివే

ఈ గ్రంథం, శ్రీమతి దాసరి గృహలక్ష్మి, శ్రీమాన్ రామకృష్ణ పుణ్యదంపతుల పవిత్ర స్మృత్యర్థం, వారి కుమారుడు, కోడలు శ్రీమాన్ దాసరి సుబ్రహ్మణ్యం, శ్రీమతి పద్మప్రియ దంపతులు సమర్పించిన ద్రవ్యంతో ముద్రింపబడింది.

ప్రతులకు : 1.శ్రీమాన్ డి. సుబ్రహ్మణ్యం
శ్రీలక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్,
శ్రీధనలక్ష్మీ ఫెర్టిలైజర్స్
కోల్లబజారు, విజయనగరం
తిరుపతి-517 507
ఫోన్ : 94401 93863

2. శ్రీ డి.నాగేంద్రకుమార్
శ్రీలక్ష్మీ జ్యూయలరీస్
ఎం.జి. రోడ్
విజయనగరం
సెల్:94403 06484

డి.టి.పి. : శ్రీమతి జయలక్ష్మి & శ్రీ చంద్రశేఖర్

ప్రింటింగ్ : సి.ఎన్. ప్రింటర్స్, ప్రకాశంరోడ్, తిరుపతి



# అభినందనం

**"వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే, వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాత్ రామాయణాత్మనా"** - పరమాత్మదశరథుని కుమారుడైన శ్రీరాముడై అవతరించగా, ఆ పరమపురుషుని వైభవాన్ని కీర్తించే వేదం శ్రీరామాయణంగా అవతరించింది - అని పెద్దల సూక్తి. శ్రీరామాయణానికి గల ప్రశస్తి అసాధారణమైనది. మనదేశంలోనే కాక ఇతర దేశాలలోకూడా రామకథ పలు విధాలుగా వ్యాప్తంకావడం దీనికి ఒక చిన్న తార్కాణం. ప్రత్యేకించి, శ్రీవైష్ణవ సంప్రదాయంలో, శ్రీరామాయణానికి గల గౌరవం, ప్రాధాన్యం చాలా గొప్పది. పూర్వాచార్యులు అందరూ దీనిని పరమ ప్రమాణంగా పలుచోట్ల, పలు సందర్భాలలో స్వీకరించారు, వ్యాఖ్యానించారు. తమ అసాధారణమైన ప్రతిభావ్యుత్పత్తు లతో రామాయణ శ్లోకాలలోని అపూర్వాలైన, రసగుళికలవంటి అర్థాలను వెలువరించారు.

గత శతాబ్దిలో ఆసేతుహిమాచలం శ్రీవైష్ణవ సంప్రదాయాన్ని, శ్రీరామానుజ సిద్ధాంతాన్ని అద్వితీయంగా ప్రచారం చేసిన మహానుభావులు, కాంచీ మహావిద్వాన్ ప్రతివాదిభయంకరమ్ అణ్ణంగరాచార్యస్వామివారు. వీరు, వేయికి మించిన సంఖ్యలో పలు భాషలలో గ్రంథాలను రచించిన అసాధారణమైన సామర్థ్యాన్ని కలవారు. శ్రీరామాయణాన్ని గూర్చి అపూర్వరామాయణమ్, సహస్రనామ రామాయణమ్, శ్రీరామాయణ సుధానిధి వంటి పలు గ్రంథాలను ద్రావిడభాషలో రచించారు. ఇవి అన్నీ శ్రీరామాయణంలోని అపూర్వాలైన అర్థాలను వెలువరించే కృతిరత్నాలు. సహస్రనామరామాయణం అనే గ్రంథంలో శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రంలో శ్రీరామావతార వైభవాన్ని తెలిపే పదహారు నామాల వివరణం శ్రీ పరాశరభట్టర్ భాష్యాన్ని అనుసరించి, శ్రీరామాయణాన్ని అనుసరించి చేయబడినది. ఈ కృతి ఇంతకుముందే ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో హైదరాబాద్‌లోని శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామివారి ఆశ్రమంలో జరిగిన ఉభయ వేదాంతపండితసభలలో ఆవిష్కరింపబడింది. అపుడు దీనిని హైదరాబాద్ వాస్తవ్యులు, మిత్రులు, శ్రీమాన్ గోపాలకృష్ణ గారి ద్రవ్యసహాయంతో ముద్రించడం జరిగింది. ఇపుడు రెండవ మారు ముద్రింపబడుతున్నది. ఇక, శ్రీరామాయణ సుధానిధి అనే ఇంకొక గ్రంథంలో, సంక్షేపరామాయణంలోని కొన్ని శ్లోకాలకు పూర్వాచార్య వ్యాఖ్యానాలను అనుసరించి మధురమైన వివరణం చేయబడింది. ఇవి ద్రావిడభాషలో ఉన్నందున, వీటిని ఆంధ్రపాఠక జనానికి ఆస్వాద్యం అయే రీతిలో ఆంధ్రీకరించవలసిన ఆవశ్యకత ఉన్నది. ప్రస్తుతం, సహస్రనామ రామాయణం, శ్రీరామాయణ సుధానిధి

- అనే రెండు లఘుగ్రంథాలు ఆంధ్రీకరింపబడి ప్రకటింపబడు తున్నాయి. వీటిని ఆంధ్రీకరించి ప్రకటించడాన్ని అనుమతిని ఉదారంగా ఇచ్చిన శ్రీఅణ్ణంగరాచార్య స్వామివారి మనుమలు ఉ.వే. శ్రీమాన్ పి.బి.రాజహంసం స్వామివారికి, వారి కుటుంబ సభ్యులకు అనేక కృతజ్ఞతలను, దాసోహాలను సమర్పించుకొంటున్నాను.

విజయనగరంలో భగవద్రామానుజ సంప్రదాయాన్ని అసాధారణమైన రీతిలో ప్రచారం చేసిన మహనీయులు ఉ.వే. శ్రీమన్ కందాళ వేంకటాచార్యస్వామివారు. వీరి అనుగ్రహాన్ని పొందిన శిష్యులు ఎంతమందో ఉన్నారు. వారిలో, శ్రీమాన్ దాసరి రామకృష్ణ గారు ఒకరు. వీరికి శ్రీరామాయణమన్నా, శ్రీరామచంద్రుడన్నా ఇంత అని చెప్పలేనంత భక్తి. వీరు, 108 సార్లు శ్రీరామ పట్టాభిషేకాన్ని నిర్వహించడమే దీనికొక చిన్న నిదర్శనం. ఆచార్య అనుగ్రహాన్ని పూర్ణంగా పొందినవారు వీరు. వీరి ధర్మపత్ని శ్రీమతి గృహలక్ష్మి గారు కూడా ఎంతో ఆస్తిక్యాన్ని, ఆచార్య భక్తిని, శ్రీరాముని పట్ల, శ్రీ రామాయణం పట్ల భక్తిని కల్గినవారు.

ఈ పుణ్యదంపతుల పవిత్ర స్మృతిరూపంగా వీరి కుమారుడు శ్రీ దాసరి సుబ్రహ్మణ్యం, కోడలు శ్రీమతి పద్మప్రియ దంపతులు కలసి సహస్రనామ రామాయణం, శ్రీరామాయణ సుధానిధి - అనే ఈ రెండు గ్రంథాల ఆంధ్రాను వాదాన్ని ముద్రింప చేయడం చాలా అభినందనీయం. తమ తల్లిదండ్రుల పట్ల వీరు ఈ విధంగా తమ భక్తిప్రపత్తులను ప్రకటించుకోవడం శ్రీరాముని సరస్వంగా భావించిన, తమ ఆచార్యులైన శ్రీమాన్ కందాళ వేంకటాచార్య స్వామి వారికి అభిమతమైన కైంకర్యంగా, భాగవత కైంకర్యంగా పర్యవసిస్తున్నది. ఈ దంపతులను ఇద్దరినీ నేను మనసారా అభినందిస్తూ, వీరికి, వీరి కుటుంబానికి అంతటికి సమస్త సన్మంగళాలు శ్రీనివాస ప్రభువు అనుగ్రహంవల్ల లభించాలని మంగళాశాసనం చేస్తున్నాను. ఈ గ్రంథ ముద్రణలో సహకరించిన శ్రీచంద్రశేఖర్, శ్రీమతి జయలక్ష్మి గార్లకు, శ్రీ హర్షవర్ధన్ గారికి అనేక కృతజ్ఞతలు.

సహస్రనామ రామాయణమ్, శ్రీరామాయణ సుధానిధి - అనే రెండు గ్రంథాలతో పాటు, పారాయణకు అనువుగా సంక్షేప రామాయణం, శ్రీరామావతార సర్గ, శ్రీ సీతా కల్యాణ సర్గ, పట్టాభిషేక సర్గలు కూడా అనుబంధంగా ఇందులో చేర్చబడ్డాయి. ఈ గ్రంథాన్ని ఆస్తిక పాఠకులు ఆదరించి, సద్వినియోగం చేసుకోవలసినదిగా కోరుతూ, - స్వస్తి.

భాగవత విధేయుడు

**ఈ. ఏ. శింగరాచార్యులు**



జై శ్రీరామ్

శ్రీమతే రామానుజాయ నమః

# పాదాభివందనములు

మా నాన్నగారు **దాసరి రామకృష్ణగారు** మంచికి మరొక పేరు. తాను మంచి తనంతో అందరికీ దగ్గరై మాకందరికీ మంచిని నేర్పిన గొప్ప వ్యక్తి. స్వార్థం లేకుండా జీవితాన్ని గడిపి, దైవభక్తితో, మంచి ప్రవృత్తితో అందరికే ఆత్మీయులైనారు. సదా శ్రీరామచంద్రుడినే రక్షకుడని నమ్మి, రామభక్తులై, శ్రీరాముని అనుగ్రహాన్ని పొందేరు. రాముడన్నా, రామాయణమన్నా ఆయనకు చాలా ఇష్టం. నిత్యం రామాయణ పారాయణం చేసుకుంటూ చాలా సంతోషంగా జీవితాన్ని గడిపేరు. శ్రీరామాయణం లోని సుందరకాండను 108 సార్లు ఎంతో నియమనిష్ఠలతో పారాయణం చేసుకున్నారు. మా అమ్మగారు **గృహలక్ష్మిగారు** పేరుకు తగినట్లుగానే గృహలక్ష్మి గానే ఉండేవారు. వారిద్దరిదీ అన్యోన్యదాంపత్యం. ఆమె పుణ్యస్త్రీగా పరమపదించిన ధన్యజీవి. మేము వారి పిల్లలుగా పుట్టడం మా అదృష్టము. మేము ఇద్దరు అన్నదమ్ములం. ఒక అక్క చెల్లెలు. మా అందరికీ మంచి సంస్కారాన్ని నేర్పి హాయిగా జీవించేటట్లుగ తీర్చిదిద్దిన పుణ్యదంపతులు, వారు. వారికి మనసారా పాదాభివందనం చేసుకుంటున్నాము.

వారు పరమపదించినా, మా మనస్సులలో జీవించే ఉన్నారు. వారి దివ్య స్మరణగా ఒక మంచి పని చేయాలని కోరిక కలిగింది. వారి పేరుతో ఒక పుస్తకం వేయిస్తే, శాశ్వతంగా వారికి సేవచేసినట్లు ఉంటుందని పెద్దలు చెప్పేరు. మాకందరికీ ఉపకారకులు, సదాచార్యులు అయిన శ్రీమాన్ కందాళ వేంకటాచార్య స్వామివారికి మానాన్నగారంటే ప్రత్యేకమైన అభిమానం. ఆచార్యుల ఆశీర్వచనాన్ని పూర్తిగా పొందేరు, మానాన్నగారు. మా ఆచార్యులకు కూడా రాముడే కులదైవం. రామాయణమే సర్వం. అదే సంస్కారం ఉన్న మానాన్నగారంటే వేంకటాచార్యస్వామి వారికి చాలా ఇష్టంగా ఉండేది. వారిని ప్రోత్సహించి 108 పట్టాభిషేకములు చేయగలిగే శక్తినిచ్చి, ఆ సందర్భంలో ప్రత్యక్షంగా ఆశీర్వదించేరు. మానాన్నగారు చాలా ఆనందించేరు.

మా నాన్నగారి పేరున పుస్తకం వేయిస్తామని అంటే, మా ఆచార్యుల కుమార్తె శ్రీమతి జానకమ్మగారు రామాయణానికి సంబంధించినదైతే చాలా బాగుంటుందని

సూచించేరు. ఆమెపైనే ఆ బాధ్యతను పెట్టేము. పెద్దలు శ్రీమాన్ ఈ. ఏ. శింగరాచార్య స్వామివారితో మాట్లాడి ఈ గ్రంథాన్ని ముద్రింపజేసే అవకాశాన్ని కలిగించేరు. ఈ విషయంలో సహృదయంతో సహకరించిన శింగరాచార్యస్వామివారికి మా పాదాభివందనములు.

మంచి పుస్తకాన్ని మా తండ్రిగారి పేరుతో వేయించి, ఈవిధంగా వారి ఋణాన్ని తీర్చుకుంటూ సంప్రదాయసేవకూడా చేయగలుగుతున్నాము. ఈ పని మా తల్లిదండ్రులను చాలా ఆనందాన్ని కలిగిస్తుందని భావిస్తున్నాను. పరమపద వాసిని, **మా అక్కయ్య శ్రీమతి మంచుకొండ లక్ష్మీకుమారికి** కూడా ఈ పని చాలా ఆనందాన్ని కలిగిస్తుంది. ఆమె, మా తండ్రిగారి పేరున ఒక పుస్తకాన్ని వేయించమని మాకు ఎన్నోసార్లు చెప్పేవారు. ఈ నాటికీ అది నెరవేరింది. మా తల్లిదండ్రులు, పెద్దలు, ఆచార్యులు, భాగవతులు, రామానుజులు, రామచంద్రుడు- అందరూ నన్ను (దాసరి సుబ్రహ్మణ్యం), నా భార్య పద్మప్రియను, మా సోదరుడు కోడలు నాగేంద్ర కుమార్, అర్చన దంపతులను, మా మనుమడు చి॥ నాగకృతిక్‌ను, నా కుమార్తె, అల్లుడు చి॥ మంచుకొండ శ్రీరామ్, శ్రీ ఫణిదంపతులను, వారి పిల్లలను, నా సోదరుడు, శ్రీబాలసుబ్రహ్మణ్యం, భార్య వల్లిదంపతులను, వారి పిల్లలను, నా సోదరి భర్త, మా బావగారు, శ్రీమంచుకొండ అప్పలరాజుగారిని - అందరినీ ఆశీర్వదించమని ప్రార్థిస్తూ, వారికి పాదాభినందనాలు చేసుకుంటున్నాను. మా తండ్రిగారు చూపించిన మంచి మార్గంలో నడుస్తూ, మా జీవితాలను ఆనందంగా గడిపేటట్లు సహృదయులైన మీరంతా ఆశీస్సులను అందించాలని ప్రార్థిస్తున్నాను.

ఇట్లు

**దాపరి సుబ్రహ్మణ్యం,**

**పద్మప్రియ**



**శ్రీమతే రామచంద్రాయ నమః**

**శ్రీమతే రామానుజాయ నమః**

# సహస్రనామ రామాయణమ్

శ్రీరామావతారవిషయంలో పరాశరభట్టర్ చాలా అభినివేశాన్ని కల్గినవారు- అనేవిషయం మన పూర్వాచార్యగోష్ఠిలో సుప్రసిద్ధం. శ్రీరామపక్షపాతి అయిన భట్టర్ భగవద్గుణ దర్పణమనే తమ విష్ణుసహస్రనామభాష్యంలో **"రామో విరామో విరజః"** ఇత్యాది పదహాఱు నామాలను వ్యాఖ్యానిస్తూ, ముందుగా **"పరర్ధిః"** అనే నామాన్ని వ్యాఖ్యానించే సందర్భంలో, **"అమృతసంజీవనం రామచరితమ్"**అని అనుగ్రహించారు. **"పరర్ధిః"** అనే తిరునామంనుండి మృతసంజీవని అయిన (చనిపోయిన వారిని తిరిగి బతికించే ఔషధం) రామకథ చెప్పబడుతున్నదని దీని భావం. **(1) పరర్ధిః, (2) పరమస్పష్టః, (3) తుష్టః, (4) పుష్టః, (5) శుభేక్షణః, (6) రామః, (7) విరామః, (8) విరజః, (9) మార్గః, (10) నేయః, (11) నయః, (12) అనయః, (13) వీరః, (14) శక్తిమతాం శ్రేష్ఠః, (15) ధర్మః, (16) ధర్మవిదుత్తమః** - అనే పదహాఱు తిరునామాలు శ్రీరామచరిత్రలను తెలుపుతున్నవని భట్టర్ అభిప్రాయం. ఈ తిరునామాలను వివరించడంద్వారా శ్రీరామగుణానుభవాన్ని పొందుదాం. అందువల్ల ఈ వ్యాసానికి **"సహస్రనామరామాయణమ్"** అనే మకుటం పెట్టబడింది.

**1. పరర్ధి** - **"పరా బుద్ధిః యస్మిన్ సః - పరర్ధిః"**. బుద్ధి అంటే - సమృద్ధి. మిక్కిలి సమృద్ధిని కలవాడని అర్థం. సంపద నిండుగా ఉండేవాడని తాత్పర్యం. ఆళ్వార్లు పలుసందర్భాలలో **"శెల్వమ్ మల్కు కుడిత్తిరువిణ్ణగర్"** (కల్యాణగుణాలను నిండుగా కల్గినవాని దివ్యదేశం తిరువిణ్ణగర్), **"శెల్వమ్ మల్కి యవన్ కిడన్ద తిరుక్కోళూర్"** (కల్యాణ గుణాలు నిండుగా ఉండేవాడు పరుండి యుండే తిరుక్కోళూర్), **"శెల్వమ్ మల్కు తన్ తిరుక్కుడన్దై"** (కల్యాణ గుణాలను నిండుగా కల్గినవాని తిరుక్కుడన్దై) అని ఈ విధంగా అనుగ్రహించారు. ఈ సందర్భంలో కల్యాణగుణాల సమృద్ధియే ముఖ్యమైన సంపదగా వ్యాఖ్యాతలు వ్యాఖ్యానించారు. **"భవాన్ సర్వత్రైవ త్వగణిత మహామంగళ గుణః"** (నీవు అంతటా

లెక్కలేనన్ని గొప్పగుణాలను కల్గినవాడవు.) అని కూరేశులు పల్కిన రీతిలో భగవానుని రూపాలన్నిటిలో గుణపూర్తి ఏ కొఱత లేకుండా ఉన్నప్పటికీ, ఒక్క శ్రీరామావతారంలో మాత్రమే గుణపాక్ష్కల్యాన్ని విశేషించి దర్శించదగినదిగా ఉంటుంది. శ్రీరామాయణంలో ఎక్కడ చూచినా అక్కడ అంతా గుణకీర్తనం ప్రచురంగానే కన్పిస్తుంది. శ్రీరామాయణంలో ఉపక్రమమే (ఆరంభమే) గుణాలను గూర్చిన ప్రశ్న; దానికి సమాధానం కన్పిస్తుంది. దశరథ చక్రవర్తి తనకుమారుడైన రామునకు పట్టాభిషేకం చేసి, తాను తపస్సు చేసికోవడంకోసం నిశ్చయించుకొని, మహాసభను ఏర్పాటుచేసి, ప్రజల అభిప్రాయాన్ని గూర్చి అడిగినపుడు, వారు **"అనేకవర్షసాహస్రో వృద్ధస్త్వమసి పార్థివ!"** (ఓ ముసలివాడా! సింహాసనాన్ని విడిచి పో. ముసలివాడా! విడిచిపో) అని అన్నారు. అపుడు దశరథుడు ప్రజలను చూచి "మిమ్ములను అడుగకుండానే నేను వశిష్ఠాదులతోమాత్రం కలసి నిర్ణయించుకోవచ్చు. అయినా, మీకు ఈ విషయంలో ప్రాధాన్యాన్ని, ప్రాముఖ్యాన్ని ఇవ్వాలనే అభిప్రాయంతో మిమ్ములను అడిగాను. మీరుకూడా దానికి తగిన రీతిలోనే గౌరవంగానే సమాధానాన్ని పల్కి ఉండవచ్చు. "నీకు ఇష్టమైన రీతిలో చేయి" అని చాలా వినయంగా బదులు ఇచ్చి ఉండవచ్చు. ఆ విధంగా కాకుండా, ఇంతవరకు నేను అధర్మంగా పరిపాలించినట్లు, మీరు నన్ను విడిచితొలగిపోవడానికి తగిన సమయంకోసం వేచి ఉన్నట్లుగా ప్రవర్తిస్తూ, నా పట్ల మీకు చాలా వ్యతిరేకత, వెగటు ఉన్నట్లుగా పలికారే! నేను చేసిన అపరాధం ఏమి?" అని అంటూ ప్రజలను ప్రశ్నించాడు. అపుడు ప్రజలు పల్కిన బదులు ఏమి అంటే - **"బహవో నృప! కల్యాణగుణాః పుత్రస్య సంతి తే"** - (రాజా! నీపుత్రునకు అనేక కల్యాణగుణాలు ఉన్నాయి) మహాప్రభూ! నీ విషయంలో ఏవిధమైన దోషం లేదు నీలో లోపాలను చూచి మేము ఈవిధంగా పలుకలేదు. నీవు కన్న కుమారుడైన శ్రీరాముడు **"గుణానామాకరో మహాన్"** (గుణాలకు గొప్ప ఆశ్రయం) అనే రీతిలో ఉన్నందున, అతని పరిపాలనలో మేము జీవించాలి - అనే ఆశ తప్ప వేఱొకటి లేదు" - అనేది ప్రజలు పల్కిన సమాధానం. ప్రజలు శ్రీరామగుణాలను నోరార పల్కి పల్కి కన్నీరు మున్నీరు అయ్యారు. ఈ విషయాన్ని అయోధ్యాకాండలోని రెండవ సర్గలో గమనించవచ్చు. ఈ రీతిలో ప్రతికాండలోను శ్రీరాముని గుణాలు సర్గాల తరబడి ఒక్కొక్కరిద్వారా వెల్లడి అయినందున ఇటువంటి గుణసమృద్ధిని పురస్కరించుకొని **"పరర్ధిః"** అని అనబడింది. ఇక, **"పరేషామ్ బుద్ధి రేవ (స్వస్య) బుద్ధిః యస్య"** అనే విగ్రహాన్ని గ్రహించి, పరసమృద్ధియే తన సమృద్ధిగా తలచేవాడు శ్రీరాముడు - అనే అర్థాన్ని



చెప్పవచ్చు. "విభీషణ, సుగ్రీవాదులకు పట్టాభిషేకాన్ని చేయకుండా, నేను కిరీట ధారణను చేయను" అనే రీతిలో శ్రీరాముడు ఉన్నందువల్ల ఈ కల్యాణగుణం అతనిలో స్పష్టంగా ప్రకాశిస్తున్నది. **"త్వయి కించిత్ సమాపన్నే కిం కార్యం సీతయా మమ"** (నీకు ఏ కొంచెమైనా ఆపద కలిగితే ఇక సీతతో నాకేమి పని?) అనే సూక్తి పరసమృద్ధినే కోరేవాడు శ్రీరాముడు - అనే విషయానికి ప్రమాణం. లంకాద్వారంలో శ్రీరాముడు నిలచి ఉన్న సమయంలో రావణుడు గోపురశిఖరం పైకి ఎక్కి కన్పించగానే "రాజద్రోహి అయిన ఈ నీచుడు శ్రీరాముని ముందు నిలచి ఉన్నాడే!" అని సుగ్రీవమహారాజు అతనిపైకి ఎగిరి లంఘించి, అతనిని జయించివచ్చినపుడు శ్రీరాముడు **"ఏవం సాహసయుక్తాని న కుర్వంతి జనేశ్వరాః"** - (ఇటువంటి సాహస కార్యాలను ప్రభువులు చేయరు.) ఎవరిపైకి అయినా దండెత్తాలి అని అంటే ముందుగా సైన్యాన్నికదా వారిపైకి పంపాలి. నాయకుడైనవాడు ముందుగా వెళ్ళడు కదా! **"త్వయి కించిత్ సమాపన్నే కింకార్యం సీతయా మమ?"** - సీతాదేవిని తిరిగి పొందడంకోసమేకదా నేను ఇన్ని పాట్లు పడుతున్నాను. నీ గొప్పతనానికి ఏదయినా ఒక అపాయం కల్గితే, ఇక నాకు ఆ సీతతో మాత్రం ఏమి పని?" అని ఈవిధంగా శ్రీరాముడు పరసమృద్ధికి ఏవిధమైన విరోధం లేని రీతిలోనే స్వసమృద్ధిని అభిలషించేవాడు - అనే అర్థం స్ఫుటమవుతున్నది - ఈ నామార్థాన్ని ఇంకా వివరించవచ్చు. ప్రస్తుతానికి ఇంతటితో చాలు.

**2. పరమస్పష్టః** - **"న చక్షుషా పశ్యతి కశ్చనైనమ్"** (ఎవరూ ఇతనిని బాహ్యనేత్రంతో చూడడం లేదు), **"న మాంసచక్షుభి రభివీక్షతే తమ్"** (ఆ పరమాత్మను మాంసచక్షువులతో ఎవరూ చూడడం లేదు), **"ఎన్టేనుమ్ కట్కణ్ణుల్ కాణాద అవ్వురు"** (ఏనాడూ ఆ పరమాత్మ రూపం బాహ్యనేత్రాలకు కన్పించనిది) ఇత్యాది క్రమంలో ఎవరి మాంసచక్షువునకు గోచరం కాని రూపాన్ని అందఱు చూచి ఆనందించే టట్లుగా చాలా స్పష్టంగా చేసి అనుగ్రహించినవాడని ఈ నామభావం. కూరేశులు అతిమానుషస్తవంలో - **"క్షోదీయసోఽపి హి జనస్య కృతే కృతీ త్వ మత్రావతీర్య నను లోచనగోచరోఽభూః"** (క్షుద్రులైనవారికోసంకదా! నీవు ఈలోకంలో అవతరించి అందరికంటికి కన్పించావు) అని పల్కిన సూక్తి ఇక్కడ అనుసంధేయం. **"పరమ స్పష్టః"** అనే నామానికి పరమత్వం స్పష్టంగా కల్గినవాడనే అర్థం పరాశరభట్టర్ భాష్యంలో తెలుపబడింది. పరత్వాన్ని మఱుగుపరచుకొని వచ్చి అవతరించినా, అది కొందఱికి స్పష్టంగా ప్రకాశించింది - అనే విషయం శ్రీరామాయణంలో గమనించ

వచ్చు. శ్రీరాముని వనవాసప్రసంగంలో క్లేశపడే కౌసల్యాదేవిని సమాశ్వాస పఱచే సుమిత్రాదేవి- **"సూర్యస్యాపి భవేత్ సూర్యః... దైవతం దేవతానాం చ"** (సూర్యునకు కూడా సూర్యునివంటివాడు.... దైవాలకుకూడా దైవం) ఇత్యాదిగా శ్రీరాముని పరత్వాన్ని తాను స్వయంగా దర్శించి తెలిసి పల్కింది. రావణుడు మరణించిన తరువాత, ప్రేతభూమికి వచ్చి శోకించే మండోదరి **"వ్యక్త ఏష మహాయోగీ పరమాత్మా సనాతనః, అనాదిమధ్యనిధనః.... తమసః పరమో ధాతా శంఖచక్రగదాధరః, శ్రీవత్సవక్షాః నిత్యశ్రీ రజయ్యః శాశ్వతో ధ్రువః, మానుషం రూపమాస్థాయ విష్ణుః సత్యపరాక్రమః"** (ఈ శ్రీరాముడు, మహాయోగి, పరమాత్మ, సనాతనుడు, ఆది-మధ్య-అంతాలను లేనివాడు, తమోగుణానికి అతీతుడు, లోకాలకు తండ్రి, శంఖచక్రగదాధరుడు, శ్రీవత్సాన్ని వక్షంలో కలవాడు, నిత్యమైన లక్ష్మీసంబంధాన్ని కలవాడు, ఎవరికీ జయింపరానివాడు, నిత్యుడు, సత్యపరాక్రముడైన విష్ణువే ఈ రూపాన్ని ధరించి వచ్చాడని వ్యక్తమైనది.) ఇత్యాదిగా శ్రీరాముని పరత్వాన్ని అతిస్ఫుటంగా దర్శించి పల్కింది. పంపాతీరంలో మొట్ట మొదటగా శ్రీరాముని దర్శించాలని వచ్చిన హనుమానుడు **"ఆయతాశ్చ సుపృత్తాశ్చ బాహవః పరిఘోపమాః సర్వభూషణభూషార్హాః కిమర్థం న విభూషితాః"** (విశాలమైనవి, గుండ్రనివి, పరిఘులవంటివి, అన్ని ఆభరణాలచే అలంకరింపదగినవి అయిన బాహువులు ఎందువల్ల అలంకరింపబడలేదు?) అని ప్రశ్నించాడు. ఇక్కడ **"ఆయతౌ చ సుపృత్తౌచ బాహూతే పరిఘోపమౌ"** అని ద్వివచనంలో శ్లోకం చెప్పే అవకాశం ఉన్నా, బహువచనాన్ని ప్రయోగిస్తూ పల్కడాన్నిగూర్చి గోవిందరాజీయవ్యాఖ్యాన కారులు వివరిస్తూ - **"హనుమతో భక్తత్వేన తస్య చతుర్భుజవేషేణ దృశ్యోఽభవత్"** (హనుమానుడు భక్తుడు కనుక అతనికి చతుర్భుజరూపంలో కన్పించాడు) అని అన్నారు. అంటే - పరమభక్తుడు కనుక, హనుమానునకు చతుర్భుజాలను కల తన నిజరూపాన్ని శ్రీరాముడు దర్శింపజేశాడని భావం. ఇంతేకాక, సముద్రశరణాగతి ప్రకరణంలో శ్రీరాముడు తనకు తలదిండుగా చేసికొన్న బాహువును వర్ణించే వాల్మీకి మహర్షి - **"భుజైః పరమనారీణా మభిమృష్ట మనేకథా"** (దివ్యదేవేరులైన శ్రీదేవి, భూదేవి, నీళాదేవులచే పలుమార్పు స్పృశింపబడినవి.) అని అన్నారు. ఇక్కడ **"పరమనారీణామ్"** అని అనడం శ్రీదేవి, భూదేవి, నీళాదేవులను ఉద్దేశించి - అని వ్యాఖ్యానించబడింది. ఈ విధంగా వాల్మీకిమహర్షి శ్రీరాముని పరత్వవేషాన్ని స్పష్టంగా దర్శించారు - అని తెలుస్తున్నది. దీనినిబట్టి శ్రీరాముని పరమస్పష్టత్వం నిరూపితమైనది.



**3. తుష్టః** - **"తుష్టః"** అంటే **"సంతుష్టః"** అని అర్థం. శ్రీరాముని అవతారాన్ని గూర్చి పలికే నమ్మాళ్వార్లు **"నాట్టిల్ పిఱన్దు పడాదనపట్టు మనిశర్క్కాయ్"** (ఈలోకంలో జన్మించి, మానవులకోసం పడరాని పాట్లు పడి ) అని అన్నారు. **"కర్మవశ్యరాన సంసారికళుమ్ పడాదకష్టజ్ఞళైయెల్లామ్ పట్టు"** (కర్మవశ్యులైన సంసారులుకూడ పడని కష్టాలు అన్నీ పడి) అని అన్నారు వ్యాఖ్యాతలు. "దుఃఖ సంవేదనాయైవ రామే చైతన్యమాహితమ్" (దుఃఖాన్ని అనుభవించడం కోసమే రాముడు చైతన్యాన్నికల్గిఉన్నాడు.) (ఉత్తరరామచరితమ్) అని శ్రీరాముడే స్వయంగా పల్కినట్లుగా భవభూతి అంటాడు. వీటివల్ల శ్రీరాముని మనస్సు సంతోషం లేనిది - అని భావించే అవకాశం ఉన్నది. కాని, వాస్తవం ఆ విధమైనది కాదు. "సంసారుల సముజ్జీవనార్థంగా ఈ లోకంలోకి వచ్చి సంతోషించేవాడు. కిరీటాన్ని ధరించి, రాజ్యాన్ని పాలించబోయే సమయంలో జటలను పేని, నారబట్టలను కట్టి అరణ్యానికి వెళ్ళవలసిన నియమనాన్ని పొందినపుడు ఎంతో దుఃఖాన్ని పొందేటట్లుగాకదా ఉంటుంది - అని పలువురు భావించవచ్చు. అపుడు కూడా శ్రీరాముడు పరమ సంతోషాన్నే పొందాడు. **"రాజ్యం వా వనవాసో వా వనవాసో మహోదయః"** (రాజ్యం, వనవాసాలలో వనవాసమే గొప్పది) అని కదా శ్రీరాముడు అన్నాడు. ఈ సందర్భంలో కంబుని వాక్కు చాలా అద్భుతమైనది. **"ఇప్పొళుదుతెమ్మనోరాల్ ఇయమ్బాద ఱ్ఱెళిదో? యారుమ్ శెప్పరుఙ్గణత్తిరామన్ తిరుముక చ్చెవ్వి నోక్కిన్, ఒప్పదే మున్ను పిన్ను అవ్వాశక మురైక్క క్కేట్ట అప్పొళుదు అలర్న్ద శెన్దామరైయిళై వెన్ఱదమ్మా"** అనేది కంబుని ఆశ్చర్యకరమైన పాశురం. వనవాసాజ్ఞను పొందడానికి ముందు శ్రీరాముని తిరుముఖమండలం తామరపూవువలె ఉన్నదట. ఆ ఆజ్ఞను పొందగానే ఆ తిరుముఖం అపుడే విరిసిన కెందామరను జయించినదట. కఠినమైన అరణ్యానికి వెళ్ళవలసివచ్చినదికదా! అని కొంచెం కూడా శోకించకుండా, పుణ్య తీర్థాలలో స్నానమాడడానికి, పుణ్యపురుషులను కొలువడానికి తగిన అవకాశం దొరికినందుకు పరమసంతోషాన్ని పొందాడని భావం. **"ఉత్సవేషు చ సర్వేషు పితేవ పరితుష్యతి"** (అన్ని ఉత్సవాలలో తండ్రివలె ఆనందిస్తాడు) అని పౌరజనులు సాక్షాత్తు దర్శించి పల్కిన రీతిలోనే తన రాజ్యంలో ఉండేవారికి కలిగే సంతోషాన్ని తన సంతోషంగా తలచి ఆనందించేవాడు. **"అభిషిచ్య చ లంకాయాం రాక్షసేంద్రం విభీషణమ్... విజ్వరః ప్రముమోద హ"** (రాక్షసప్రభువైన విభీషణుని లంకకు రాజుగా అభిషేకించి, తాపాన్ని తీరినవాడై ఆనందించాడు) అనే రీతిలో భక్తులను సంతోష పెట్టినపుడే సంతోషాతిశయాన్ని పొందేవాడు.

**4.పుష్టః -** పూర్వం **"తుష్టః"** అనే తిరునామంవల్ల తెలుపబడిన సంతుష్టియే బాగా ద్రఢీకరిస్తున్నది, ఈ తిరునామం. తాను పొందే సంతోషం తన దేహంలో దర్శించదగినట్లుగా ఉండేవాడని ఈ నామభావం. "మనస్సులోని ఆనందం దేహంలో తెలుస్తుంది" **("ఉళ్ళత్తిల్ మకిళ్ందిచ్చి ఉడలిలే తెటియుమ్")** అనే లోకోక్తి రీతిలో హృదయగతమైన సంతోషాతిశయాన్ని తిరుమేని సుస్పష్టం చేయగల్గినదిగా ఉంటుంది. వనవాసవాజ్ఞను పొందగానే, **"వనవాసో మహోదయః"** (వనవాసం గొప్ప అదృష్టం) అని పల్కినది కృత్రిమమని భావించకూడని రీతిలో తిరుమేని ప్రకాశిస్తూ దర్శనమిస్తుందని భావం. వనవాసాన్ని పొందడం పరమసంతోషంకోసమే హేవు - అని పల్కిన వచనాన్ని కొంచెంగానే గమనించినపుడు, అది అహృదయోక్తి తప్ప సహృదయోక్తి కాదు - అని నిర్ణయించు కొనేటట్లు ఉంటుంది. ఏవిధంగా అంటే- తరువాత ఆరణ్యకాండంలో సీతావియోగాన్ని పొందినపుడు దుఃఖపరవశుడై ఆక్రందించే శ్రీరాముడు **"రాజ్యాత్ భ్రంశో వనే వాసో నష్టా సీతా హతో ద్విజః, ఈదృశీయం మమాలక్ష్మీః నిర్దహేదపి పావకమ్"** (రాజ్యాన్ని వీడి రావడం, వనంలో నివశించడం, సీతను కోల్పోవడం, జటాయువు మరణించడం - ఇటువంటి ఈ నా దురదృష్టం అగ్నిని కూడా దహిస్తుంది) అని పల్కి రోదించాడు. "అయ్యో! రాజ్యాన్ని కోల్పోయానే అరణ్యంలోకి వచ్చి నివసించవలసి వచ్చిందే!" అని అనడం **"వనవాసో మహోదయః"** అనే దానికి నేరుగా విరుద్ధంకదా! వనవాసం సంతోషకరమై ఉంటే, **"రాజ్యాత్ భ్రంశః"** అని, **"వనే వాసః"** అని పల్కదగినట్లుగా ఉంటుందా? **"ఈదృశీయం మమాలక్ష్మీః"** అని రాజ్యభ్రంశవనవాసాలను దౌర్భాగ్యాలనికదా శ్రీరాముడు అన్నాడు. ఇవి పాసగే రీతి ఏది? అనే విచికిత్సను కొందరు చేస్తారు. దీనికి నంబిళ్ళై పలికిన సమాధానాన్ని గమనించండి.

**"రాజ్యనాశోఽపకర్షతి - వనవాసో మహోదయః" "ఎన్దుశొల్లి పోస్దవర్గళై ఇప్పోదు అనర్థమాక చ్చొల్లుకిఱదెన్? ఎన్నిల్, ఆశ్రితసంశ్లేషత్తుక్కుమ్ ఋషికళై నోక్కుకైక్కుమ్ మెన్దిదే పోన్దదు. అత్తోడే విరోధిక్కైయాలే శొల్లుకిఱార్. పిరాట్టియై ప్పిరికైయాలుమ్, పెరియవుడైయారై ఇళ్ందక్కైయాలుమ్, ఇవర్గళుక్కు అడియాన వైయుమ్ ఇప్పోదు అనర్థమాక తోన్ఱినపడి" ("రాజ్యనాశోఽపకర్షతి - వనవాసో మహోదయః"** అని పల్కిన వానిని ఇపుడు అనర్థాలుగా ఎందుకు పల్కుతున్నారు? అంటే- ఆశ్రిత సంశ్లేషానికి, ఋషులను దర్శించడానికి అరణ్యానికి పోయాడు. దానితో విరోధించి నందున ఈవిధంగా అంటున్నాడు. పిరాట్టిని విశ్లేషించినందువల్ల, జటాయువును కోల్పోయినందువల్ల వీటికి మూలమైనవి ఇపుడు అనర్థాలుగా



తోచాయి") అనేది నమ్బిళ్ళై శ్రీసూక్తి. దీనిని కొంచెం వివరిస్తాను. వనానికి బయలు దేరినపుడు ఎందువల్ల సంతోషం కల్గింది? అంటే - సీతాదేవితో ఏకాంతవాసం చేయగల్గుతున్నాను; పరమ భాగవతులతో సహవాసం చేయబోతున్నాము." అని ఈ విధంగా ఆశపడినందువల్ల సంతోషడ్డాడు. ఆశపడిన రీతిలో ప్రయోజనం కొంతకాలం కల్గింది. **"వైదేహి! రమసే కచ్చిత్! చిత్రకూటే మయా సహ"** (వైదేహీ! నాతోపాటు చిత్రకూటంలో ఆనందిస్తున్నావు కదా!) అని నోరు తెరచి పలికే రీతిలో సీతాదేవితో కలసి ఆనందించడం జరిగింది. **"ఇహ వత్స్యామి సౌమిత్రే! సార్ధ మేతేన పక్షిణా"** (లక్ష్మణా! ఈ జటాయువుతో కలసి నేను ఇక్కడ నివసిస్తాను) అని జటాయుమహారాజు సమీపంలో కాలక్షేపం చేయడం కూడా సిద్ధించింది. ఈదశలో **"హా హంత! హంత! నళినీం గజ ఉజ్జహార"** (అయ్యో! అయ్యో! ఏనుగు సరస్సు నుండి పద్మాన్ని పెరికి బయటకు పారవేసింది) అనే రీతిలో సీతాదేవివిశ్లేషం, జటాయు మహారాజును కోల్పోవడం సంభవించాయి. ఈ దుఃఖాన్ని తెలిపేమాటయే కదా **"రాజ్యాత్ భ్రంశో వనే వాసః"** (రాజ్యంనుండి భ్రంశం, అరణ్యవాసం) అనేమాట. దీనివల్ల అరణ్యానికి బయలుదేరేటపుడే సంతోషం లేకుండా బాధపడుతూ బయలు దేరినట్లుగా భావించవచ్చునా? పరమ కుతూహలంతో బ్రహ్మోత్సవాన్ని సేవించడం కోసం శ్రీవేంకటాచలానికి పోయినవారు అక్కడ నివసించే చోటు, అన్నం, నీరు పొందలేక, స్వామి సేవను పొందలేక ఎండలో వానలో, పరితపించడం సంభవించింది - అని భావించండి. అపుడు ఎందుకోసం ఇంటిని విడచి ఇక్కడకు వచ్చి బాధపడు తున్నాను" అని తల్లడిల్లితే, దీనివల్ల ఊరును విడచి బయలుదేరేటపుడు ఉండే కుతూహలం లేదు- అని అనగలమా! లంకకు పోయిన హనుమానుడు అశోకవనంలో సీతాదేవిని చూడగానే **"అనయా హీనః ప్రభుః ధారయతి ఆత్మనో దేహం న శోకేనావసీదతి"** (ఈ సీతను కోల్పోయిన ప్రభువైన రాముడు నిలువగల్గి ఉన్నాడు. తనదేహాన్ని దుఃఖంవల్ల కోల్పోలేదు) అని అనడం శ్రీరాముని గర్హించినట్లుగా పైకి కన్పించినా, **"పుష్టః"** అనే ఈ నామాన్ని వ్యాఖ్యానించేటట్లుగా ఉన్నది. వాడకుండా, కృశించకుండా పుష్టిగానే శ్రీరాముడు ఉన్నాడు" అని తెల్పిన రీతిలో గ్రహించవచ్చు. లేకపోతే **"జీవతి"** అని మూడక్షరాలతోనే ముగించవచ్చును కదా! **"ధారయతి ఆత్మనో దేహమ్"** అని వివరణం దేహపుష్టిని అంతరంగంగా తెల్పుతున్నది- అని చెప్పవచ్చు.

**5. శుభేక్షణః -** శ్రీరాముని తిరునేత్ర సౌందర్యంలో అభినివేశాన్ని పొందినవారు దశరథచక్రవర్తి, శబరి, హనుమానుడు. "నా యజ్ఞాన్ని రక్షించడంకోసం నీ కుమారుని నాతో పంపు" అని విశ్వామిత్రమహర్షి అడిగినపుడు, **"ఊనషోడశవర్షో మే రామో**

**రాజీవలోచనః"** (తామరలవంటి నేత్రాలను గల నా రాముడు పదహారు సంవత్సరాల కంటే తక్కువ వయస్సును కలవాడు) అని బదులు పల్కిన చక్రవర్తి మాటలలో పలు భావాలున్నాయి. వాటిలో - ఈ నేత్రసౌందర్యాన్ని విడచిపెట్టి ఏవిధంగా జీవించగలను? అనేది ఒక భావం. శబరి తన ఆశ్రమానికి వేంచేసిన శ్రీరాముని దర్శించగానే **"చక్షుషా తవ సౌమ్యేన పూతాస్మి రఘునందన!"** (శ్రీరామా! నీ చల్లని చూపుతో నేను పవిత్రురాలను అయ్యాను) అని అతని నేత్రసౌందర్యంలో తాను అభినివేశాన్ని పొందిన విషయాన్ని తెలియజేసింది. వీటికి మించినది, హనుమానుని మాట. అది ఏమంటే- **"రామః కమలపత్రాక్షః సర్వసత్త్వమనోహరః"** (శ్రీరాముడు తామరపూల రేకులవంటి నేత్రాలను కలవాడు, ప్రాణులందరి మనస్సులను హరించేవాడు) అనేది. హనుమానునితో సంభాషించే సీతాదేవి **"యాని రామస్య చిహ్నాని తాని భూయః సమాచక్ష్వ న మాం శోకః ప్రధక్ష్యతి"** (శ్రీరాముని చిహ్నాలను నాకు మాటిమాటికి తెలియజేయి. దానివల్ల నన్ను శోకం బాధించదు) అని శ్రీరాముని చిహ్నాలనుగూర్చి చెప్పమని అడిగిన వెంటనే, మును ముందుగా - **"రామః కమలపత్రాక్షః"** (శ్రీరాముడు తామలపూలవంటి నేత్రాలను కలవాడు) అని అన్నాడు. ఆ నేత్రసౌందర్యం చేసే పని ఏమి? అని అంటే, **("సర్వసత్త్వ మనోహరః")** - ప్రాణులనే పేరును కల్గిన అందటి మనస్సులను కొల్లగొట్టేదిగా ఉంటుంది. ఆ నేత్రసౌందర్యం అని హనుమానుడు అన్నాడు. ఇక్కడ కొంచెం విమర్శించాలి. హనుమానుడు శ్రీరాముని నేత్రసౌందర్యాన్ని ఒక గొప్ప నగరంలో దర్శించినవాడు కాడు. నిర్జనమైన ఒక వనంలో ఒక మూలలోనే దర్శించి **"సర్వసత్త్వమనోహరః"** అని దేనినిబట్టి పలికాడు?- అని పరిశీలించాలి. ఇక్కడ నంబిళ్ళై అనుగ్రహించిన వ్యాఖ్యాన శ్రీసూక్తి - **"తిర్యక్ జాతీయనాయ్ పణ్ణైయోడు పణ్ణై తిరికిఱ ఎన్నుడైయ నెఞ్చముమ్ అపహరిత్తదే"** (తిర్యక్‌జాతికి చెందినవాడనై, ఒక కొమ్మనుండి ఇంకొక కొమ్మకు తిరిగే చంచలుడను అయిన నా మనస్సును కూడా అపహరించినదే!) అని దీనివల్ల శ్రీరాముని నేత్రసౌందర్యం సర్వసత్త్వ మనోహరమనే విషయం కైముతిక న్యాయసిద్ధమని భావం. దీనిని గొప్పగా భావించిన కంబ మహాకవి - **"కోలమేనియే! మకళిర్ క్కెల్లామ్ నెఞ్చైన త్తున్నైయవాకి నళిరిరుమ్బునిక్కు త్తేమ్బాక కఞ్చమొత్తవర్న్ద కణ్ణ!"** అని హనుమానుడు పల్కినట్లుగా పాశురాన్ని రచించాడు. **"శుభేక్షణః"** అనే ఈ నామానికి భాష్యాన్ని అనుగ్రహించిన భట్టర్ **"స్వకర్తృకం స్వకర్మకం చ దర్శనమ్ అతిశుభమస్య"** అనే ఒక అర్థాన్ని అనుగ్రహించారు. శ్రీరాముని ఇతరులు దర్శించడం మధురం. శ్రీరాముడు



ఇతరులను కటాక్షించడం మధురం - అని దీని తాత్పర్యం. **"ఈక్షణ"** శబ్దం కన్ను అనే అర్థాన్ని, చూడడం - అనే అర్థాన్ని కూడా ఇస్తుంది. ఇపుడు చూడడం- అనే అర్థాన్ని గ్రహించి వ్యాఖ్యానిస్తాను. **"యశ్చ రామం న పశ్యేత్తు యం చ రామో న పశ్యతి, నిందిత స్స వసేల్లోకే స్వాత్మాప్యేనం విగర్హతే"** (శ్రీరామా-అయో-17-14) (ఎవడు శ్రీరాముని చూడలేదో, ఎవనిని శ్రీరాముడు చూడలేదో, అతడు లోకంలో నిందింపబడుతున్నాడు. తనను తాను నిందించుకొంటున్నాడు కూడా!) శ్రీరాముని దర్శించినవాడు, శ్రీరామునిచే కటాక్షింపబడని వాడు లోకంలో నిందింపబడేవాడు కాగలడు. లోకం అతనిని నిందించేమాట అటు ఉండనీ. తనను తానే నిందించుకోవలసి వస్తుంది - అని దీనిభావం. దీనివల్ల శ్రీరాముని దర్శించేటట్లే, శ్రీరామునిచే కటాక్షింపబడడం కూడా పురుషార్థమని అనడం వల్ల "శుభేక్షణః'' అనే దానికి రెండు విధాలైన అర్థాలను గ్రహించడం చాలా రస్యం. ఈ శుభేక్షణ మహార్థ ప్రస్తావంలో అశోవనంలో శోకించే సీతాదేవి **"తం పద్మదళపత్రాక్షం సింహమాతంగ గామినమ్, ధన్యాః పశ్యంతి మే నాథం కృతజ్ఞం ప్రియవాదినమ్"** (తామరపూల రేకులవంటి నేత్రాలను కలవాడు, సింహంవలె, ఏనుగువలె నడిచేవాడు, కృతజ్ఞుడు, మధురంగా పలికేవాడు అయిన నా ప్రభువును అదృష్టవంతులు దర్శిస్తున్నారు) అని పల్కిన ఈ శ్లోకం స్మరణీయం. ఇందులో **"పద్మదళపత్రాక్ష"**మనే పదం ఉన్నది. ఇక్కడ **"పద్మదళ"**మని కాని, **"పద్మపత్ర"** మని కాని - ఏదో ఒకటి పల్కినా చాలు. **"పత్రం పలాశం ఛదనం దళం పర్ణం ఛదః పుమాన్"** అనే అమరకోశవచనానుసారం **"దళమ్"**, **"పత్రమ్"** అనేవి పర్యాయపదాలే కనుక, **"దళపత్రాక్ష"** మని రెండిటిని కలిపి పల్కడం పునరుక్తం కాదా? అని కొందరు సందేహించవచ్చు. శంక యుక్తమైనదే. అయితే ఇక్కడ పెద్దలు చెప్పే సమాధానం చాలా రసవంతమైనది. సంస్కృతభాషలో **"అక్ష"**మనే పదానికి **"అక్షమింద్రియకాయయోః"** అనే నిఘంటువచనాన్నిబట్టి కన్ను అని, రూపమని రెండు అర్థాలు ఉండడం ప్రసిద్ధం. **"ఇరట్టిఱమొళిత్తల్"** అనే ద్రావిడభాషా మర్యాదానుసారం **"పద్మదళపత్రాక్ష"**మనే ఈ సందర్భంలో అక్షపదానికి ఈ రెండు అర్థాలను గ్రహించి, పద్మదళంవంటి విశాలమైన నేత్రసౌందర్యాన్ని కలవాడు, పద్మపత్రంవంటి (తామర ఆకువంటి పచ్చని వర్ణాన్ని కల) తిరుమేనిని కలవాడు - అనే అర్థాన్ని గ్రహించాలి. నమ్మాళ్వార్ తిరువాయ్‌మొళిలో- **"శెక్కమలత్తలర్ పోలుమ్ కణ్‌కై కాల్ శెఞ్చి వాయ్ అక్కమలత్తిలై పోలుమ్ తిరుమేని"** (ఎఱ్ఱని తామరపూలవంటివి నేత్రాలు, హస్తాలు,

పాదాలు, ఎఱ్ఱని దొండపండువంటివి పెదవి, తామర రేకులవంటిది తిరుమేని) అని పల్కడం పూర్వం వివరించిన అర్థాన్ని దృష్టిలో పెట్టుకొనియే.

**6. రామః - "రమతే ఇతి రామః" - "రము - క్రీడాయామ్"** అనే ధాతువునుండి పుట్టినందువల్ల, క్రీడించేవాడు అనే అర్థాన్ని ఈ పదం ఇస్తుంది. **"త్వం న్యం చద్భిరుదంచద్భిః కర్మసూత్రోపపాదితైః, హరే! విహరసి క్రీడాకందుకైరివ జంతుభిః"** (హరీ నీవు కర్మలనే ధారాలతో కట్టబడినవారు, అధోగతిని, ఊర్ధ్వగతిని కలవారు అయిన ప్రాణులతో, కిందకు పైకి ఎగిరే బంతితో ఆడుకొన్నట్లుగా, క్రీడిస్తున్నావు) అని నారదముని పల్కినట్లుగా, బాలకులు బంతులతో ఆడుకొనే రీతిలోనే, భగవానుడు జీవులతో క్రీడిస్తాడు. బంతి తెలుపు, ఎఱుపు, నలుపు దారాలతో నిర్మింపబడేటట్లే, ప్రాణులు కూడా సత్త్వరజస్తమోగుణాలనే మూడు గుణాలతో నిర్మింపబడతారు. బంతి విహారకాలంలో పైకి పోవడం, కిందికి పడడం జరిగేటట్లే, ప్రాణులు కూడా **"తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి"** (ఆ జీవులు విశాలమైన ఆ స్వర్గలోకాన్ని అనుభవించి, పుణ్యం క్షీణించగానే తిరిగి మానవలోకంలోకి ప్రవేశిస్తున్నారు) అనే రీతిలో పైకి పోతూ, క్రిందకు పడుతూ ఉంటారు ఈ విధంగా క్రీడించే పరమపురుషుడు శ్రీరామునిగా అవతరించి, **"రామస్తు సీతయా సార్ధం విజహార బహూన్ ఋతూన్"** (శ్రీరాముడు సీతతోపాటు పలుఋతువులు విహరించాడు) అని వాల్మీకి పల్కినట్లుగా సీతాదేవి ఒక్కతెతోనే క్రీడించాడు. **"రామః స సీతయా సార్ధమ్"** అని అనకుండా **"రామస్తు"** అని అనడం సాభిప్రాయం. **(తు)-** అనే అవ్యయం వ్యావృత్తిని తెల్పుతుంది. ఇంతవరకు శ్రీరాముడు పితృశుశ్రూషలోను, ధర్మప్రదర్శనలోను, దేవతాసమారాధన లోను లగ్నచిత్తుడై కీర్తిని పొందాడు. ఇపుడు సీతతో చేరగానే వేఱు అయ్యాడు. శృంగార విలాసాలలో పరమరసికుడు- అనే కీర్తిని పొందాడు- అనే అర్థాన్ని ఈ అవ్యయం స్ఫురింపజేస్తున్నది.

లేక, **"రామః- రమతే"** అనే వ్యుత్పత్తికి మనస్సులో ఆనందించేవాడు - అనే అర్థంకూడా ఉన్నందువల్ల,ఆ అర్థాన్ని పురస్కరించుకొని వివరించడంకూడా సరసం. భక్తులతో కలసి, ఆ భక్తుల కార్యాలను నిర్వహించి పూర్తి చేసి మనస్సులో ఆనందించే వాడు, శ్రీరాముడు. **(గుహేన సహితో రామః)** శ్రీరాముడు గుహునితో కలిశాడు- అని సూత్రం దీనికి అర్థం కాదు. **"గుహేన సహిత స్సన్ రామః"**- గుహునితో చేరిన తరువాత రాముడయ్యాడు- అనే అర్థాన్నే పూర్వాచార్యులు తెలియజేశారు. గుహునితో



చేరి మనస్సులో చాలా సంతోషించాడని భావం. ఇంకొక సందర్భాన్నికూడా గమనించవచ్చు. **(కృతకృత్య స్తదా రామః)- "అభిషిచ్య చ లంకాయాం రాక్షసేంద్రం విభీషణమ్, కృతకృత్య స్తదా రామః"** విభీషణునకు పట్టాభిషేకాన్ని చేసి తన కార్యం సఫలమైనట్లుగా తలచి, (తదా రామః) - అపుడే ఆనందాన్ని రాముడయ్యాడు'' అని దీని భావం. శ్రీరాముడు చేసిన ఒక్కొక్క కార్యం అతని మనస్సును ఆనందపఱుచ గల్గినది అయినది. గుహసుగ్రీవమారుతి విభీషణాదులపట్ల చూపిన అనుగ్రహ విశేషంవల్ల మనస్సు చల్లబడినట్లే, తాటకాతాటకేయ విరాధదూషణ రావణాదుపట్ల చూపిన నిగ్రహంవల్ల కూడా ఆశ్రితవిరోధులను నిరసించగలిగాను- అని మనస్సులో ఆనందించడంలో ఏ కొఱత లేదు. అందువల్ల **"రమతే ఇతి రామః"** అనే వ్యుత్పత్తివల్ల శ్రీరామాయణంలోని పలు సందర్భాలు సంగృహీతాలు.

లేక, **"రామః- రమయతీతి రామః"** అనే వ్యుత్పత్తికూడా పొసగుతుంది. తనను దర్శించేవారిని, తన చరిత్రలను ఆలకించేవారిని ఆనందింపజేసేవాడు, శ్రీరాముడు. లోకంలో అధికారులు వేఱు వేఱుగా ఉంటారు కనుక ఒకే గుణంతో అందఱితో ఒకే రీతిలో ఆనందింపజేయడం వీలుకాదు. **"సత్యేన లోకాన్ జయతి దీనాన్ దానేన రాఘవః, గురూన్ శుశ్రూషయా వీరః, ధనుషా యుధి శాత్రవాన్"** (వీరుడైన రాముడు సత్యమనే గుణంతో లోకాలను జయిస్తున్నాడు, దీనులను దానగుణంతో వశంచేసు కొంటున్నాడు, గురువులను శుశ్రూషతో, శత్రువులను ధనుస్సుతో జయిస్తున్నాడు) అనే రీతిలో ఒక్కొక్కరి విషయంలో ఒక్కొక్క గుణాన్ని ప్రదర్శించి ఆనందింప జేయడం శ్రీరామాయణంలో ప్రసిద్ధం. సౌశీల్యం, సౌలభ్యం, సౌందర్యం, క్షమ, దయ, వాత్సల్యం, వీర్యం - అనే మొదలైన పలు కల్యాణగుణాలకు సముద్రమై ఉండే శ్రీరాముడు పరమపదంలో విలువ లేని (ప్రకాశించని) కల్యాణగుణాలను ప్రకాశింప జేయడం కోసమే ఈ భూలోకంలోకి వచ్చి అవతరించినందువల్ల, ఆ కల్యాణ గుణాలతో వారిని అభినివేశాన్ని పొందించి ఆనందింపజేస్తాడని ప్రత్యేకంగా చెప్పాలా? గుహుని సౌశీల్యంతో ఆనందింపజేశాడు. సౌశీల్యమని, శీలమని పర్యాయపదాలు. తన పరత్వాన్ని లెక్కించకుండా చాలా తక్కువవారితోకూడా కలసి వర్తించడం శీలగుణకార్యం. ఈ గుణం కార్యకరమైన సందర్భాలు శ్రీరామాయణంలో అధికం. సౌందర్య - సౌకుమార్యాలతో దండకారణ్యనివాసులైన మహర్షులను అభినివిష్టులను చేయడం గొప్పకాదు. చెవి, ముక్కు ఖండింపబడి ఏడ్చి గగ్గోలుపెడుతూ ఖరదూషణులవద్దకు పోయిన శూర్పణఖ **"తరుణౌ రూపసంపన్నౌ సుకుమారౌ మహాబలౌ, పుండరీకవిశాలాక్షౌ చీరకృష్ణాజినాంబరౌ, గంధర్వరాజప్రతిమౌ పార్థివవ్యం**

**జనాన్వితా"** (యువకులు, అందమైనవారు, సుకుమారమైనవారు, గొప్ప బలాన్ని కలవారు, తామరపూలవలె విశాలమైన నేత్రాలను కలవారు, నారబట్టలను, నల్లజింక చర్మాన్ని కట్టినవారు, గంధర్వప్రభువువంటివారు,రాజలక్షణాలను కలవారు) అని పలు విధాలుగా పలికేటట్లుగా చేయడమే గొప్ప. ఈ రీతిలో ఒక్కొక్క గుణాన్ని చూపి ఒక్కొక్కరిని ఆనందింపజేయడాన్ని వివరిస్తే మహా భారతమే కాగలదు.

**7. విరామః -** **"రమయతీతి రామః"** అనే సందర్భంలోవలె **"విరమయతీతి విరామః"** అనే వ్యుత్పత్తిని చెప్పాలి. విరామం అంటే విరతి- విశ్రాంతి. 1. ఇతరుల శౌర్యవీర్యపరాక్రమాలకు విశ్రాంతిని కల్గించేవాడు, (2) ఇతరుల వాదాన్ని విరమింప జేసేవాడు - అనే రెండు అర్థాలను గ్రహించవచ్చు. మొదటి వివరణాన్ని గూర్చి విశేషంగా వివరించ వలసినది ఉన్నదా? **"బ్రహ్మా స్వయంభూశ్చతురాననో వా రుద్ర స్త్రినేత్ర స్త్రిపురాంతకో వా, ఇంద్రో మహేంద్ర స్సురనాయకో వా త్రాతుం సమర్థా యుధి రామవధ్యమ్"** (స్వయంభువు, నాలుగు ముఖాలను కలవాడు) అయిన బ్రహ్మగాని, మూడు నేత్రాలను కలవాడు, త్రిపురాలను దహించినవాడు అయిన రుద్రుడుగాని, దేవతలకు ప్రభువు, మహేంద్రుడు అయిన ఇంద్రుడు గాని, రాముడు చంపదలచినవానిని రక్షింపలేరు అనే హనుమానుని మాట ఒకటే చాలు. ఇతరుల వాదాన్ని విరమింపజేసేవాడు- అనే రెండవ అర్థానికి తగినట్లు కొన్ని సందర్భాలు చూపబడుతున్నాయి. ఆరణ్యకాండ- ఆఱవసర్గలోని దండకారణ్యవాసులైన మునులు రాక్షసులవల్ల తమకు కల్గిన కష్టాలను శ్రీరామునివద్ద విజ్ఞాపించి శరణు పొందినపుడు, శ్రీరాముడు ఆ మునులకు అభయాన్ని ఇచ్చిన వృత్తాంతం వర్ణింపబడింది. తరువాత తొమ్మిదవ సర్గలో, సీతాదేవి శ్రీరాముని చూచి తర్కిస్తూ పల్కింది. ఆ మాటలు ఏమి? అంటే- "నీవు మునివేషాన్ని వేసికొని అరణ్యానికి వచ్చావు. పుణ్యతీర్థాలలో స్నానమాడి, సుఖంగా అయోధ్యకు పోయి చేరడమే తగినది. కర్తవ్యం ఆ విధంగా ఉండగా, నీవు మునుల సమక్షంలో పరహింసను చేస్తానని ప్రతిజ్ఞ చేయడం నాకు కొంచెం కూడా రుచించలేదు. క్షత్రియులకు ఇది ధర్మమైనా, ఇపుడు నీవు క్షత్రియధర్మాన్ని రక్షించవలసిన స్థితిలో లేనందువల్ల **"తాళిరుమ్ శడైకళ్ తాజ్గి త్తాజ్గరున్తవమ్ మేఱ్కొండు"** అరణ్యానికి వచ్చినా, ఆయుధాలతో చేసే పని నీవు మనస్సుతోకూడా భావించడం తగదు. నీకు తెలియని విషయం ఏదీ లేదు. నీకు నేను ధర్మం ఉపదేశించాలని వచ్చానని అనుకోవద్దు. నీ తమ్మునితో కూడా ఆలోచించి యుక్తమైన దానిని చేయి" అని అన్నది. దీనిని విన్న శ్రీరాముడు (పదవ సర్గలో) - ఆ సీతాదేవి వాదాలను నిర్వీర్యం చేసిన రీతిని గమనించవచ్చు. అందులో



సారమైన విషయం ఇంతమాత్రమే. **"అప్యహం జీవితం జహ్యాం త్వాం వా సీతే! సలక్ష్మణామ్, న హి ప్రతిజ్ఞాం సంశ్రుత్య బ్రాహ్మణేభ్యో విశేషతః"** (నేను నా ప్రాణాలను, చివరకు లక్ష్మణునితోపాటు నిన్నుకూడా త్యజిస్తాను. కాని చేసిన ప్రతిజ్ఞను, అందులోను, బ్రాహ్మణులకు ఇచ్చిన మాటను మాత్రం విడువను.) ఇత్యాది వచనాలను పల్కి సీతాదేవివాదాన్ని విరమింపజేశాడు. వాలి **"అరక్కరోడ్ పుశెయ్దు కడ్ వరేల్ అదఱ్కు వేఱోర్ కురక్కినత్తరశై క్కొల్ల మునుతెఱి కూఱిర్ నీ యార్?"** అనే రీతిలో కొన్ని వాదాలను చేస్తూ పల్కినపుడు శ్రీరాముడు అతని నోటితోనే క్షమను అర్థించే రీతిలో చేసి, అతనిని విరమింపజేశాడు. ఈ విధంగా పలు సందర్భాలను గమనించ వచ్చు.

**8. విరజః -** తన సమీచీన వాదాలతో ఇతరుల వాదాలను విరామం పొందేటట్లు చేసే సామర్థ్యం **"విరామః"** అనే గడచిన తిరునామంలో అనుభవింపబడింది. ఇతరుల సమీచీనాలైన వాదాలతో తాను విరామాన్ని పొందడం, వితండావాదానికి వైదేశికుడైన శ్రీరామునితో కన్పడుతుంది. తాము వాదించేదే పిడివాదంగా ఉండకుండా, **"యుక్తి యుక్తం వచో గ్రాహ్యమ్"** (యుక్తితో కూడుకొన్నమాట గ్రహింపదగినది) అనే రీతిలో తన వాదానికి విశ్రాంతిని ఇచ్చేవాడు శ్రీరాముడు. లేక, కారణవిశేషంచేత తాను నిగ్రహించాలని ప్రయత్నించినా, వెంటనే దయను చూపి, నిగ్రహంనుండి విరతుడై అనుగ్రహోన్ముఖుడు కాగలడు" అనే అర్థాన్ని కూడా గ్రహించవచ్చు. ఈ రెండు అర్థాలను క్రమంగా వివరిస్తాను. అయోధ్యాకాండ ఇరవై ఆఱవ సర్గలో శ్రీరాముడు తల్లిదండ్రులు చెప్పిన రీతిలో అరణ్యానికి వెళ్ళవలసి వచ్చిన విషయాన్ని సీతాదేవితో పల్కి, ఆమెను నగరంలోనే నివసించమని చెప్పగా (27వ సర్గ), దానికి సీతాదేవి తననుకూడా వెంట తీసికొనవ పొమ్మని పల్కుతూ నిర్బంధించింది (28వ సర్గ). అపుడు శ్రీరాముడు అరణ్యంలోని క్లేశాలనుగూర్చి పల్కి "నీవు అరణ్యానికి రావడం సుతరాం తగదు" అని బలంగా వాదించాడు. ఆ తరువాత సీతాదేవి (29వ, 30వ సర్గలలో) ప్రణయ రోషం తల ఎత్తి- "రామా! నీ దగ్గర సౌందర్యం మాత్రమే ఉన్నది. దానిని చూచి అందఱు భ్రాంతి పొందుతున్నారు. నీకు మగతనం అనేది కొంచెంకూడా లేదు. నన్ను ఒక్కతెను రక్షించ లేక, నన్ను నిలిపి నీవు అరణ్యాలకు వెళ్ళావు - అని మాతండ్రి వింటే, "అయ్యో! పురుషవేషాన్ని వేసికొనివచ్చిన ఒక ఆడుదానికి కదా నా కుమార్తెను ఇచ్చాను!" అని చాలా మనస్సులో ఖేదాన్ని పొందుతాడు. నన్ను అరణ్యంలో రక్షించలేని కాపురుషుడవా నీవు?" - అని ఈవిధంగా

పలుమాటలను పల్కి వాదించగా, శ్రీరాముడు తాను పిడివాదాన్ని వాదించకుండా విరతుడయ్యాడు. ఆమెను తనతో తీసికొని పోవడానికి సమ్మతించాడు.

కారణవిశేషంవల్ల నిగ్రహించాలని ప్రయత్నించి, ఆ నిగ్రహప్రయత్నం నుండి విరమించిన రీతినికూడా రెండు సందర్భాలతో చూపిస్తాను. కిష్కింధాకాండలో (20వ సర్గ) సుగ్రీవమహారాజు వర్షాకాలంలో శ్రీరాముడు విశ్రాంతిని ఇచ్చిన కారణాన్ని పురస్కరించుకొని, లౌకికభోగాలలో నిమగ్నుడై ఉండి, వర్షాకాలం గడచినా, తన సైన్యాలను సమీకరించి, తీసికొని రాకపోవడాన్ని చూచిన శ్రీరాముడు అతనిపై చాలా కోపించి అతనిని నిగ్రహించాలని మనస్సులో భావించాడు. ఈ విషయాన్ని లక్ష్మణునిద్వారా సుగ్రీవునకు తెలియజేయదలచి, **"న చ సంకుచితః పంథాः యేన వాలీ హతో గతః"** (వాలిపోయిన మార్గం ఇంకా మూసికొనిపోలేదు), **"మా వాలి పథమన్వగాः"** (వాలిపోయిన మార్గాన్ని అనుసరించకు), **"హనిష్యామి సబాంధవమ్"** (బంధువులతో పాటుగా వధిస్తాను) ఇత్యాదులను పల్కి భయాన్ని కల్గించాడు. సుగ్రీవుడు కుటుంబంతో మరణించాడు- అనే భావించే రీతిలో ఆ సందర్భం ఏర్పడింది. ఈ ప్రబలమైన నిగ్రహ సంకల్పం ఏమయినది? **"రామసుగ్రీవయోరైక్యం దేవ్యేవం సమజాయత"** (రామునకు సుగ్రీవునకు మధ్య ఐక్యం ఈవిధంగా సంభవించింది) అని పిరాట్టి దగ్గర హనుమానుడు పలికే రీతిలో కదా సంభవించింది. **"వానరాణాం నరాణాం చ కథ మాసీత్ సమాగమః"** (వానరులకు, నరులకు మధ్య ఏవిధంగా కలయిక సంభవించింది) అని సీతాదేవి హనుమానుని ప్రశ్నించింది. "ఒక కొమ్మనుండి ఇంకొక కొమ్మకు తిరిగే వానరులకు, పురుషోత్తములకును మధ్య సమాగమం ఏవిధంగా ఏర్పడింది?" అని అడిగింది. దానికి హనుమానుడు పల్కిన సమాధానం ఏమి? అంటే- "అది కేవలం సమాగమం కాదు. శ్రీరాముడు, సుగ్రీవుడు ఏకతత్త్వం అనే రీతిలోకదా కలిసి పోయారు" అని. ఈవిధంగా శ్రీరాముడు నుండి నిగ్రహం విరమించినందువల్ల విరతుడని అనడం పొసగుతుంది. ఇంకొక సందర్భం ఏమంటే- యుద్ధకాండలోని సముద్రశరణాగతి. **"బాహుం భుజగభోగాభ ముపధాయారినిషూదనः, అంజలిం ప్రాఙ్ముఖం కృత్వా ప్రతిశిశ్యే మహోదధేः"** (పాము శరీరంవలె గుండ్రని భుజాన్ని తలదిండుగా చేసికొని, శత్రువులను సంహరించేవాడైన శ్రీరాముడు తూర్పుముఖంగా సముద్రానికి అభిముఖంగా శయనించాడు) అనే రీతిలో సముద్రరాజును మార్గంకోసం ప్రార్థించి, మూడు దినాలపాటు భూమిపై శయనించి శ్రీరాముడు ప్రాయోపవేశం చేశాడు. కాని, సముద్రుడు తన ముఖాన్ని చూపించలేదు. **"చాప మానయ సౌమిత్రే! శరాంశ్చాశీవిషోపమాన్, సాగరం**



**శోషయిష్యామి పద్భ్యాం యాంతు ప్లవంగమాः"** (లక్ష్మణా! ధనుస్సును, సర్పాల విషంవలె తీవ్రమైన బాణాలను తీసికొని రా. సముద్రాన్ని ఇంకింపజేస్తాను. వానరులు పాదచారులై వెళ్ళనీ) అని పలుమాటలు పల్కి లోకంలో జలతత్త్వం అనేదానిని లేని రీతిలో చేస్తాను- అని, ఆగ్రహానికి పరమావధిలో నిలచాడు శ్రీరాముడు. కాని, తరువాత ఏమయినది? ఆ సముద్రరాజు కొంచెం ఆభిముఖ్యాన్ని చూపించగానే "సముద్రరాజా! ఈ బాణం నీ కోసం సంధించినది కాదు. నీ శత్రువులను చూపించు" అని పల్కి అతను చూపిన ద్రుమకుల్యమనే ప్రదేశంలోకి బాణాన్ని విడచి, అనుగ్రహశీలుడై, నిగ్రహంనుండి విరతుడయ్యాడు. (యుద్ధకాండ (22వ సర్గ) తరువాత, రావణునితో తుములసంగ్రామం జరిగినపుడు అతడు **"చచాల చాపం చ ముమోచ వీరः"** (మిక్కిలి చలించాడు, ధనస్సును కూడా విడిచాడు) అనేటట్లు నిర్వీర్యుడై నిలచినపుడు **"గచ్ఛ అనుజానామి"** (అనుమతిస్తున్నాను పో!) అని పల్కి అనుమతిని ఇచ్చి పంపి, తాత్కాలికంగా యుద్ధంలో నుండి విరతుడయ్యాడు, శ్రీరాముడు- అనే ఈ సందర్భంకూడా ఇక్కడ **"విరతः"** అనే తిరునామానికి అర్థంగా గ్రహించవచ్చు.

**9. మార్గः - "మార్గ్యతే ఇతి మార్గः"** మార్గం - అంటే - అన్వేషించడం. అన్వేషించబడేవాడని మార్గనామానికి అర్థం. అన్వేషించేవాడు - అనే అర్థంకూడా దీనికి పొసగుతుంది. అన్వేషింపబడేవాడు - అనే అర్థాన్ని ముందు వివరిస్తాను. వేదాంతాలలో **"సోన్వేష్టవ్యः"** అని అధ్యయనం చేయబడుతున్నది. భగవానుడు అన్వేషింపబడేవాడని దీని అర్థం. ఈ అర్థాన్ని అనుసరించియే తిరుమజ్జైయాళ్వార్లు **"నాన్మఱైకళ్ తేడియోడుమ్ శెల్వన్"** (నాల్గు వేదాలు అన్వేషిస్తూ పరుగుతీసే శ్రీమంతుడు,) అని, **"నాన్మఱైకళ్ తేడి యెట్టుమ్ కాణమాట్టా చ్చెల్వన్"** (నాల్గు వేదాలు అన్వేషించినా, ఏనాటికీ కన్పించని శ్రీమంతుడు) అని, అనుగ్రహించారు. ఉత్తరశ్రీరామాయణంలో శంబూకవధ అని ఒక సందర్భం ఉన్నది. తపస్సును చేసే యోగ్యత లేని జాతిలో పుట్టినవాడొకడు దండకారణ్యంలో తీవ్ర తపస్సును చేసినందున అయోధ్యానగరంలో ఒక బ్రాహ్మణుని బాలుడు మరణించగా, ఆ శూద్రతపస్విని వధిస్తే తప్ప, ఈ బ్రాహ్మణ బాలుడు ప్రాణాలను తిరిగి పొందడు - అని గ్రహించిన శ్రీరాముడు అతనిని వధించాలని తలచి, చేతిలో ఖడ్గాన్ని దాల్చి దండకారణ్యానికి వెళ్ళాడు. (పెరుమాళ్ తిరుమొళిలో **"శెఱితవ చ్చమ్బుకన్తన్నై చ్చెన్ఱు కొన్ఱు శెఱుమత్తైయోనుయిర్మీట్టు"** (గొప్ప తపస్సును చేసే శంబూకుని వధించి, బ్రాహ్మణ బాలుని ప్రాణాలను తిరిగి తీసికొనివచ్చి) అని అనుసంధింపబడిన

వృత్తాంతమే ఇది) అరణ్యానికి పోవాలని బయలుదేరిన శ్రీరాముడు "శంబూకుడనే శూద్రుడు తపస్సు చేస్తున్నాడట కదా! అతడు ఎక్కడ ఉన్నాడు? ఎక్కడ ఉన్నాడు?" అని ప్రశ్నిస్తూ అతనిని అన్వేషిస్తూ వెళ్ళాడు. అన్వేషించి అతనిని వద్దకు పోయినపుడు ఆ శంబూకుడు ఈ విధంగా అన్నాడు- **"అన్వేష్టవ్యో యదసి భువనైः లోకనాథः శరణ్యः మామన్విష్యన్"** (లోకాలచే అన్వేషింపబడే లోకనాథుడవు, అందరికీ గొప్ప శరణం అయిన నీవు నన్ను అన్వేషిస్తూ వచ్చావు) (ఉత్తరామచరితమ్- భవభూతి) అని అన్నాడు. "లోకంలోని వారిచేత అన్వేషింపబడదగినవాడవుగా వేదాలలో చెప్పబడే ఓ మహాప్రభూ! నీవు నన్ను వెదకుతూ వచ్చావే! నేను ఎంతటి భాగ్యశాలిని!" అని అన్నాడు. ఇక్కడ మార్గశబ్దంయొక్క కర్తరివ్యుత్పత్తి అర్థం, కర్మణివ్యుత్పత్తి అర్థం- అనే రెండిటియొక్క అర్థాన్ని గమనించవచ్చు. మారీచ మాయామృగాన్ని వధించి తిరిగి వచ్చిన తరువాత పర్ణశాలలో సీతాదేవిని చూడలేక, ఆమె వెదకుతూ తిరగడం, కబంధుని మాటను అనుసరించి శబరిని, సుగ్రీవుని వెదకుతూ పోవడం - అనే వీటిని అన్నిటినీ గ్రహించ వచ్చు. **"మార్గः"** అనే నామానికి మార్గమై ఉండేవాడు, మార్గాన్ని చూపించేవాడు- అనే అర్థాలను కూడా గ్రహించవచ్చు. **"వழி"** అని అన్నా, **"నెఱి"** అని అన్నా రెండూ పర్యాయపదాలే. నమ్మాழ్వార్లు పెరియ తిరువన్దాదిలో **"నెఱి కాట్టి నీక్కుదియో?"** (అన్య మార్గాలను చూపించి నన్ను దూరం చేస్తావా?) అనే పాశురంలో ఉపాయమనే అర్థంలో **"నెఱి"** అనే పదాన్ని ప్రయోగించినందువల్ల **"మార్గः"** అనే సంస్కృతపదం కూడా ఉపాయవాచకంగా గ్రహించడంలో లోటు లేదు. ముకుందమాలలోని **"కరచరణసరోజే కాంతిమన్నేత్రమీనే శ్రమముషి భుజవీచివ్యాకులేగాధమార్గే హరిసరసి విగాహ్య"** (చేతులు, పాదాలు అనే పద్మాలను కల్గినది, కాంతిని కల్గిన నేత్రాలనే చేపలను కల్గినది, భుజాలనే కెరటాలతో నిండినది, లోతైన మార్గాన్ని కల్గినది, శ్రమను తీర్చేది అయిన విష్ణువనే సరస్సులో అవగాహించి) అనే శ్లోకంలో **"అగాధమార్గే"** అనే చోట మార్గశబ్దం ఉపాయార్థంగానే ప్రయోగింప బడింది. **"ఉపాయోపేయత్వే తదిహ తత్త్వం న తు గుణౌ"** (ఉపాయమై, ఉపేయమై ఉండడం నీకు స్వభావమే తప్ప గుణాలుకావు.) అని శ్రీరంగరాజస్తవంలో భట్టర్ అనుగ్రహించిన రీతిలో భగవానునకు ఉపాయత్వం స్వరూపం కనుక, ఉపేయ భూతుడైన తానే ఉపాయంగా ఉండే రీతి తెలుపబడింది. రావణవధ జరిగిన తరువాత బ్రహ్మ చేసిన స్తుతిలో **"శరణ్యం శరణం చ త్వామాహుः దివ్యా మహర్షయుः"** (దివ్యులైన మహర్షిలు నిన్ను ఆశ్రయింపదగినవారిలో గొప్ప శరణంగా పల్కు తున్నారు) అని అన్నందువల్ల ఈ



అర్థం మఱింత సుస్థాపితమైనది కదా! ఇక, దారిని చూపేవాడు- అనే అర్థానికి సమన్వయాన్ని జటాయువు విషయంలో గమనించవచ్చు. **"మయా త్వం సమనుజ్ఞాతः గచ్ఛ లోకాననుత్తమాన్"** (నేను నిన్ను అనుమతిస్తున్నాను. ఉత్తమ లోకాలకు పో!) అని పల్కి జటాయువునకు వైకుంఠానికి పోయే దారిని చూపినవాడుకదా శ్రీరాముడు. **"యా గతిర్యజ్ఞశీలానామ్"** ఇత్యాదిగా పల్కిన శ్రీరామునివాక్యంలో **"గతిः"** అనే పదానికి మార్గమని కదా అర్థం. భగవద్గీతలో (8-26) **"శుక్లకృష్ణగతీ హ్యేతే"** అనే చోట **"గతి"** శబ్దార్థంకూడా మార్గమనియేకదా! ఇక, తరువాతి నామాన్ని గమనిద్దాం.

**10. నేయుः -** నాయకుడనే అర్థాన్ని ఇచ్చే **"నేతా"** అనే పదానికి వ్యతిరేకపదం **"నేయుः"** అనేది. ఆజ్ఞను ఇచ్చేవాడు నేత. అని - ఆజ్ఞాపింపబడేవాడు నేయుः అని అనబడుతున్నారు. **"యస్య విశ్వ ఉపాసతే ప్రవిషమ్ యస్య దేవాः"** అని వేదంలో చెప్పబడిన రీతిని, **"ఆణై మెయ్ పెఱ నడాయ దెయ్వమ్ మూవరిల్ ముదల్వనాకి"** (ఆజ్ఞను చెల్లుబాటు చేసుకునే ముగ్గురు దేవతలలో ప్రధానుడై ) (తిరువాశిరియమ్)- అని ఆழ్వార్లు అనుగ్రహించిన రీతిని **"మనిశర్క్కు దేవర్పోల దేవర్క్కుమ్ దేవన్"** (మానవులకు దేవతల వలె, దేవతలకు దేవుడు) అయిన తాను సకల దేవతలను ఆజ్ఞాపించేటట్లుగా శ్రీరామావ తారాన్ని ఎత్తాడు. విశ్వామిత్రముని తాను ఒక యాగాన్ని చేయాలని ప్రయత్నించి, దానిని నిర్విఘ్నంగా నెఱవేర్చడంకోసం దశరథచక్రవర్తి వద్దకు వచ్చి శ్రీరాముని తనతో పంపమని అడిగాడు. దానికి చక్రవర్తి అంగీకరించలేదు. "రాక్షసులతో యుద్ధాన్ని చేయదగిన పరువం లేకుండా, చాలా చిన్నవాడైన నాబాలుని నేను మీతో పంపలేను" అని అన్నాడు. అపుడు ఆ ముని దశరథ చక్రవర్తిని చూచి, "శ్రీరాముని గొప్పతనాన్ని నీవు తెలియలేదు. చాలా గొప్పవాడైన ఇతనిని చాలా చిన్నవాడని అనుకుంటున్నావు, అంతే. **"వేదాహమేతం పురుషం మహాంతమ్"** (ఈ పురుషుని నేను గొప్పవాడని తెలుసుకుంటున్నాను) అని వేదం పల్కిన గొప్పతనాన్ని కల్గిన మహాపురుషుడుకదా ఇతడు ఉండే రీతిని నేను తెలియగలను. నేను మాత్రమే కాదు. ఇదిగో! నీ ఎదురుగా వేంచేసి ఉండే మహాతపోధనులైనవారు కూడా చక్కగా తెలియగలరు" అని ఈ రీతిలో పలు మాటలను పల్కి శ్రీరామలక్ష్మణులను తీసికొని పోయాడు. తండ్రివద్ద ఈ విధంగా పల్కిన మాటలను అన్నిటిని ఏకాంతంగా వింటున్న శ్రీరాముడు "శేషభూతుడనై, పరతంత్రుడనై జన్మించాలి" అని ఆశపడి ఇక్కడకు వచ్చి జన్మించిన నన్ను పరమాత్మ అని ఈ ముని వ్యక్తం చేశాడే! ఇది నా అభిప్రాయానికి తగనిదికదా! ఇంకా

ఈవిశ్వామిత్రముని ఇంతవరకు ఎన్నో అరుదైన గొప్ప యాగాలను, తపస్సులను చేశాడు. ఎపుడు ఇంకొకరిని సహాయంగా కోరేవాడు కాడు. ఇపుడు ఇతడు చేయబోయే చాలా చిన్నదైన ఆఱు దినాల వ్యవధిని కల్గిన ఈ యాగానికి నా సహాయాన్ని కోరి రావడం ఊరికే కాదు. మనతండ్రి చతురంగబలంతో వెళ్ళి అవలీలగా మనస్సులో యాగాన్ని రక్షించాలని కోరి ఉండవచ్చు. దానిని చేయకుండా నన్నే కోరి వచ్చిన ఈ మునివరునకు మనస్సులో ఏదో విశేషమైన ఒక అభిప్రాయం ఉండి ఉండాలి. నన్ను ఆజ్ఞాపించి కార్యాన్ని నిర్వహించదలచే (అంటే - నేను ఆశపడిన శేషత్వాన్ని లోకానికి తెలిసేటట్లుగా చేయాలని తలచే) నన్నుకోరాలని వచ్చినట్లున్నాడు.'' అని విశ్వామిత్రముని మనస్సులోని మర్మాన్ని తెలిసికొని, శ్రీరాముడు ఆమునికి చేతులను జోడించి నమస్కరించి ఒక మాటను విన్నపించాడు. **"ఇమౌ స్మ మునిశార్దూల! కింకరౌ సముపస్థితౌ, ఆజ్ఞాపయ యథేష్టం వై శాసనం కరవావ కిమ్"** అని అన్నాడు. దీని అర్థం ఏమంటే- "ముని సార్వభౌమా! నేను, నాతమ్ముడైన లక్ష్మణుడు నీ ఆజ్ఞానుసారం నడచుకోవడంకోసం వచ్చినవారం. ఎల్లప్పుడు నీ సమీపంలోనే ఉండి, నీవు నియమించే కైంకర్యాలను చేయాలని మేమిద్దరం వేచి ఉన్నాము. నీవు సందేహించకుండా మమ్ములను ఏ విధమైన రీతిలో అయినా ఆజ్ఞాపించవచ్చు. నీకు ఏ కైంకర్యాన్ని చేయగలము? అని ఎదురు చూస్తున్నాము'' అని అన్నాడు. అందువల్ల, ఆజ్ఞాపించేవాడైన తాను ఆజ్ఞాపించబడేవాడుగా కావాలని ఆశపడడం **"నేయః"** అనే నామం ద్వారా తెలుపబడింది.

**11. నయః -** **"అన్యాన్ సర్వాన్ స్వయం నయతీతి నయః"** - ఇతరుల ఆజ్ఞను ఎదురు చూచి, ఆరీతిలోనే నడచుకొంటాడని పూర్వనామం తెలిపింది. **"పతిం విశ్వస్యాత్మేశ్వరమ్"** అని అధ్యయనం చేయబడే భగవానునకు నేయత్వం (ఆజ్ఞాప్యత్వమ్)- స్వేచ్ఛవల్ల ఏర్పడినది. భగవానునకు నిరుపాధికంగా ఉండే స్వభావాన్నిగూర్చి చెప్పే సందర్భంలో సర్వనిర్వాహకత్వమేకదా అసాధారణంగా చెప్పబడుతున్నది. శ్రీరాముడు తననుగూర్చి తన మాటలలో చెప్పుకొనేటపుడు **"ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజమ్"** (నన్ను నేను మానవునిగా, దశరథుని కుమారుగా భావిస్తున్నాను) ఇత్యాదిగా సర్వత్ర పల్కినా, ఇతరులు పలికేటపుడు అతని గొప్పతనాన్ని విస్తృతంగా చెప్పారుకదా! **"శరణ్యం శరణం చ త్వామ్"** ఇత్యాదిగా కదా బ్రహ్మ పలికాడు. అందువల్ల-**"నేయః"** అనే గత తిరునామానికి వ్యతిరేకమైన **"నేతా"** అనే తిరునామం యొక్క అర్థమే **"నయః"**



అనే తిరునామంలో కూడా ఉన్నదని భావించవచ్చు. లేక, **"నయతీతి నయః"** అనే వ్యుత్పత్తిని గ్రహించి తీసికొనిపోయేవాడు - అని అర్థాన్ని చెప్పవచ్చు. శ్రీరాముడు పరమపదానికి తిరిగి వెళ్ళేటపుడు తాను ఒక్కడే వెళ్ళలేదు కదా! **"అన్ఱు శరాశరజ్గళై వైకున్దత్తైక్ కొణ్డు"** (ఆనాడు చరాచరాలను వైకుంఠానికి తీసుకొనిపోయి) అని శ్రీకులశేఖరప్పెరుమాళ్ అనుగ్రహించిన రీతిలోనే చరాచరాలను తనతో తీసికొని పోయాడుకదా. (దీనిని కొంచెం వివరిస్తాను.) **"మునివన్ వేణ్డి త్తిఱల్ విళఙ్గుమ్ ఇలక్కుమనై ప్పిరిన్దాన్తన్నై"** (దూర్వాసముని ప్రార్థించగా లక్ష్మణని విశ్లేషించినవానిని) అని కులశేఖరులు పల్కినట్లుగా, లక్ష్మణుని విశ్లేషాన్ని సహించలేక, చాలా క్లేశాన్ని పొందిన శ్రీరాముడు రాజ్యాన్ని విడచిపెట్టి, పరమపదానికి వేంచేయడానికి ఆరంభించినపుడు అయోధ్యానగరంలోని జీవులు అన్నీ శ్రీరాముని శరణు పొంది, "నీవు ఎక్కడికి వెళ్ళనా దాసులమైన మమ్ములను కూడా నీతో పాటు తీసికొని వెళ్ళాలి'' అని ప్రార్థించగా, శ్రీరాముడు వారి భక్తిని, గొప్ప ప్రేమను చూచి "ఆవిధంగానే కానివ్వండి'' అని పల్కి, అందఱిని తనను అనుసరించి రమ్మని పల్కి, తాను ప్రయాణం చేసేటపుడు, ఆ నగరంలో ఉండే మానవులే కాక, జంతువులు, పక్షులు మొదలైన చైతన్యం కల్గినవి అన్నీ ఆనందించి, శ్రీరాముని వెంట పోగా, ఈ విధంగా పలువురితో పాటు సరయూనదిలో దిగి, తన స్వస్థానికి చేరేటపుడు తనపట్ల నిరంతర ప్రేమను కల్గి, తనను వెంబడించి వచ్చి సరయూనదిలో మునిగి దేహత్యాగాన్ని చేసిన అన్ని ప్రాణులకు బ్రహ్మలోకానికి పైన ఉన్నది, పరమపదంవలెనే పునరావృత్తి లేనిది సాంతానికమనే లోకాన్ని అనుగ్రహించాడు - అనేది ఇతిహాసం. ఈవిధంగా నయనాన్ని చేసిన రీతిని తెల్పుతున్నది **"నయః"** ఈ తిరునామం. వరాహచరమ శ్లోకంలో **"అహం స్మరామి మద్భక్తం నయామి పరమాం గతిమ్"** (నేను నా భక్తుని అతని చివరిదశలో స్మరిస్తాను. గొప్ప గతిని కల్గిస్తాను) అని పల్కినవాడుకదా భగవానుడు.

**12. అనయః -** ఈ నామానికి భాష్యంలో భట్టర్ అనుగ్రహించిన రసఘనమైన అర్థాన్ని ముందుగా వివరిస్తాను. **"అయ శ్శుభావహో విధిః, సః అస్మాత్ అన్యో జగతాం నాస్తి ఇతి అనయః"** అనేది భగవద్గుణదర్పణశ్రీసూక్తి. అమరకోశంలో **"అయశ్శుభావహో విధిః"** అని తెలుపబడింది. మంచిని కల్గించే పనికి **"అయ"**మని పేరు. శ్రీరామునికంటే మంచిని కల్గించేవారు వేఱెవ్వరు లేరు- అని దీని తాత్పర్యంగా స్ఫుటపడుతున్నది. స్తోత్రరత్నంలో **"అనుత్తమం పాత్రమిదం దయాయాః"** (నీ దయకు నేను గొప్పలక్ష్యాన్ని) అనేచోట **"అనుత్తమమ్"** అనే పదానికివలె ఇక్కడకూడా

**"అనయః"** అనే దానికికూడా పంచమీ బహువ్రీహిసమాసం తగినది. కీడును చేసే వారికికూడా మంచిని చేయడమే స్వభావంగా కల్గినవాడుకదా శ్రీరాముడు. **"న స్మరత్యపకారాణాం శతమప్యాత్మవత్తయా, కథంచిదుపకారేణ కృతేనైకేన తుష్యతి"** (ఆత్మీయభావనతో నూరు అపకారాలనుకూడా స్మరించడు. ఏదైనా కొంచెం ఉపకారం చేస్తే దానితో తృప్తిపడతాడు) అని కదా అయోధ్యావాసులైన జనులు శ్రీరామగుణకీర్తనాన్ని చేశారు. పైన ప్రస్తావించిన శ్లోకంలో **"కథంచిదుపకారేణ"** అనే దాని అర్థాన్ని లోతుగా గమనించి చూడాలి. ఇతరులు చేసేది ఏదీ నిజానికి ఉపకారం కాదు. వారు చేసినది ఉపకారంగానే ఉన్నప్పటికీ కథంచిత్ ఉపకారంగా చేసి గ్రహింపబదడుతున్నదని భావం. దీనిని శ్రీవచనభూషణంలో **(4-1) "నన్నై యెన్ను పేరిడలావదొరు తీమైయుమ్ కాణాదే తనక్కేఉ ఇడమ్ పెఱ్ఱ వళవిలే, ఎన్నూరై చ్చొన్నాయ్, ఎన్ పేరై చ్చొన్నాయ్, ఎన్నడియూరై నోక్కినాయ్, అవర్‌కళ్ విడాయై త్తీర్‌త్తాయ్, అవర్‌కళుక్కు ఒదుఙ్గ నిఱ్ఱలై క్కొడుత్తాయ్" - ఎన్టార్ పోల శిలవఱ్ఱైయే యిట్టు మడిమాఙ్గొయిట్టు"** - (మంచి అని పేరుపెట్టదగిన దానిని దేనిని చూడలేక, తాను ప్రవేశించడానికి తగిన అవకాశం లభించగానే, "నా ఊరును గూర్చి పలికావు, నా పేరును చెప్పావు. నా భక్తులను కాపాడావు, వారి దాహాన్ని తీర్చావు, వారు ఒదిగి ఉండడానికి ఆశ్రయాన్ని ఇచ్చావు- అని ఈరీతిలో ఏవో కొన్నిటిని ఆరోపించి) ఇత్యాది దివ్యసూక్తివల్ల తెలియవచ్చు. ఈవిధంగా ఆరోపించి అనుగ్రహించిన సందర్భం శ్రీరామావతారంలో ఉన్నదా ? అని అంటే, ఒక సందర్భాన్ని ప్రదర్శిస్తాను. ఆళవందార్ స్తోత్రరత్నంలో వాయస (కాకాసుర) రక్షణాన్ని గూర్చి పలికేటపుడు **"తాదృశో వాయసస్య ప్రణత ఇతి దయాళుః"** అని అన్నారు. **"ప్రణతస్య వాయసస్య దయాళుః"** అని అనకుండా, **"ప్రణత ఇతి దయాళుః"** అనే దాని తాత్పర్యాన్ని తెలిసినవేదాంతదేశికులు స్తోత్రభాష్యంలో పల్కిన సూక్తి - ఏమంటే **"దయార్ద్రబుద్ధ్యా ప్రణతత్వేన పరిగృహ్య ఇత్యర్థః"** (దయార్ద్రబుద్ధితో అతడు నమస్కరించినట్లుగా భావించి - అని అర్థం.) అని - ప్రణామాన్ని ఉద్దేశించి కాకాసురుడు రాలేదు. అంతటా తిరిగి, ఇక చేసేది ఏమీ లేక వచ్చి కిందపడ్డాడు, అంతే. ఆ వ్యర్థ క్రియనే ప్రణతిగా భావించి శ్రీరాముడు రక్షించాడని దీని భావం. విభీషణాభయప్రదాన ప్రకరణంలో **"న త్యజేయం కథంచన"** అనే సూక్తి కూడా ఇక్కడ శిఖరంగా అనుసంధేయం.

లేక, **"అనయః"** అనే దానికి **"న విద్యతే నయః యస్మిన్ సః"** అని వ్యుత్పత్తిని గ్రహించి నయం లేనివాడు - అనే అర్థాన్ని చెప్పవచ్చు. నయమంటే నీతి. శ్రీరాముని



నీతి లేనివాడని చెప్పవచ్చునా? గోపికలు శ్రీకృష్ణుని ఉద్దేశించి **"నీరిలే నిన్నయర్ క్కిన్ఱోమ్ నీదియల్లాదన శెయ్‌దాయ్"** (నీటిలో నిలచి బాధపడుతున్నాము, నీతి లేని పనులను చేస్తున్నావు) అని అన్నారు. ఆవిధంగా శ్రీరామునిగూర్చి ఎవరూ పలుకలేదు కదా! వాలివంటివారు పల్కిన దానిని పరమార్థంగా గ్రహించడం తగునా? అనే శంక కల్గుతుంది. అన్యాయమైన కార్యాలను చేసేవాడని దీని అర్థం కాదు. నీతి అంటే - నియతి. శ్రీరాముని కార్యాలు ఏ నియతిలో (వ్యవస్థలో) అణగి ఉండేవి కావు- అని తాత్పర్యం. దీని వివరణం ఏమంటే - పరమపూజ్యుడైన భరద్వాజముని ఆశ్రమంలో భుజించాడనే మాట వింటున్నట్లే శబరిద్వారా భుజించాడని కూడా వింటున్నాము. విశ్వామిత్రమునిని నాథునిగా పరిగ్రహించాడు- అని వింటున్నట్లే, **"సుగ్రీవం నాథమిచ్ఛతి"** (సుగ్రీవుని నాథునిగా కోరుతున్నాడు) అని, **"సుగ్రీవం శరణం గతః"** (సుగ్రీవుని శరణు వేడాడు) అని వింటున్నాము. ఈవిధంగా ఒకని యతిని లేనివి శ్రీరాముని కార్యాలు. సంకల్పసూర్యోదయంలో **"భగవతి భరద్వాజే భుక్తిః తథా శబరీకరే"** (భగవానుడైన భరద్వాజుని ఆశ్రమంలో భోజనం, ఆవిధంగానే, శబరిచేతుల ద్వారా భోజనం) ఇత్యాదిగా పల్కినసూక్తిని గ్రహించి రసికహృదయంగమంగా నిర్వహింపబడిన క్రమం ఇది.

**13. వీరః -** భగవానుని కల్యాణగుణాలలో వీర్యం, శౌర్యం, పరాక్రమం- అని మూడు గుణాలు కలిపి అనుసంధింపబడుతున్నాయి. ఈ మూడుగుణాలకు అర్థంలో భేదం లేనట్లుగా పైకి తోచినా, భేదం ఉన్నది (1) శత్రువుల సేన ఎంత ప్రబలమైనది అయినా దానిని చూచి భయపడకపోవడం, (2) ఆ సేనలోనికి ఒంటరిగా ప్రవేశించి శత్రువులకు అనాయాసంగా వధించగల్గిన సామర్థ్యం, (3)-ఈ విధంగా చేసేటపుడు తనకు కొంచెంకూడా భంగం కల్గని రీతిలో అన్నివిధాలైన భంగాలు శత్రువులకు కల్గించడం - అని ఈ విధంగా మూడు రీతులలోని సామర్థ్యాలు గొప్ప యుద్ధాన్ని చేసే వీరులకు ఆవ్యకాలైనవి ఉన్నాయి. ఈ మూడిటిని తెలిపే పదాలుగా వీర్యశౌర్య పరాక్రమశబ్దాలను గ్రహించవచ్చు. ఇక్కడ **"వీరః"** అని వీర్యం మాత్రమే చెప్పబడినప్పటికీ, మిగిలిన రెండు కూడా ఉపలక్షణంగా గ్రాహ్యాలు. లేక, ఉండే పదంలోనే- అంటే **"వీరః"** అనే పదంలోనే ఆ మూడు అర్థాలను చేర్చి అనుసంధించవచ్చు. శ్రీరామాయణంలోను, ఇంకా శ్రీరామునిగూర్చి పలికే పలు గ్రంథాలలోను శ్రీరాముని వీరుడని, శూరుడని, పరాక్రమశాలి అని కీర్తిస్తూ పల్కడం విశేషంగా గ్రహించదగిన అంశం. శ్రీరామునకు మహావీరుడనే ఒక తిరునామం ఉన్నది. **"జయ! జయ! మహావీర!"** అని రఘువీరగద్య

ఆరంభమవుతున్నది. ఒక దివ్యదేశం (తిరువళ్ళూర్) లోని స్వామి వీరరాఘవుడనే తిరునామాన్ని కల్గి ఉండడం ప్రసిద్ధం. భవభూతి మహాకవి మహావీరచరితమనే పేరును పెట్టి ఒక రూపకాన్ని రచించాడు. ఆళ్వార్లు శ్రీరాముని కార్యాలను గూర్చి వీరుడని అంటూ పల్కుతారు. **"ఇలజై మన్నవై నూడైన్దు పైన్దలై నిలత్తు క్కలజ్గ అన్ట శెన్ట కొన్ట వెన్టికొణ్ట వీరనే!"** (లంకకు ప్రభువైన రావణుని పది తలలను ఖండించి, అతనిని వధించి జయించిన వీరుడా!) అని, **"మాఱు శెయ్ద వాళరక్కన్ నాళులప్ప అన్టిలజ్గై నీఱు శెయ్తు శెన్ట కొన్ట వెన్టికొణ్ట వీరనార్ !"** (తన రక్షణ ప్రయత్నాలకు వ్యతిరేకంగా వర్తించిన రావణుని ఆయుస్సు తీరే విధంగా ఆనాడు లంకకు భస్మంచేసి, అతనిని వధించి జయించిన వీరుడు) ఇత్యాది పాశురాలను గమనించవచ్చు. వీటి అన్నిటికంటే శత్రవులు చేతితో తీసే దిష్టివలె రావణుడే ఆశ్చర్యపడి కీర్తించే వీర్యం శ్రీరామునకు ఉన్నది. (శ్రీరామాయణం-యుద్ధ-106-6) **"శత్రోః ప్రఖ్యాతవీర్యస్య రంజనీయస్య విక్రమైః"** (శత్రువులను కూడా తన విక్రమాలతో ఆనందాన్ని కల్గించే వాడు, ప్రసిద్ధమైన వీర్యాన్ని కలవాడు) అనేది రావణుని వచనం. శ్రీరాముని ప్రఖ్యాతవీరుడని రావణుడు స్వయంగా తననోటితో యుద్ధరంగంలో పల్కడం ఆ వీర్యాన్ని తాను స్వయంగా బాగా అనుభవించి నందువల్లనే కదా! **"విక్రమైః రంజనీయస్య"** అని తరువాత పలికాడు ఈ రీతిలో పలికేటట్లుగా శ్రీరాముడు చేసిన వీరకృత్యాలు అనేకం ఉన్నా, ఒక కృత్యాన్ని మాత్రం ఉదాహరిస్తాను. యుద్ధకాండంలో 94వ సర్గను గమనించండి. అక్కడ మూలబల యుద్ధాన్ని గూర్చి పలికేటపుడు శ్రీరాముని అతిమానుషమైన యుద్ధసామర్థ్యాన్నిగూర్చి పల్కడంలో వాల్మీకికూడా తడబడ్డాడు. **"ఛిన్నం భిన్నం శరైర్దగ్ధం ప్రభగ్నం శస్త్ర పీడితమ్, బలం రామేణ దదృశుః న రామం శీఘ్రకారిణమ్"** (బాణాలచేత ఛేదింపబడినది, భిన్నమైనది, దగ్ధమైనది. మిక్కిలిగా పొడిపొడి యైనది అయినా రాక్షససేనను రాముడు చూచాడు. కానీ, చాలా వేగంగా యుద్ధాన్ని చేసే రాముని రాక్షససేన చూడలేకపోయింది) అని వాల్మీకి వచనం. శ్రీరామునిచేత పలుమార్లు బాణాల దెబ్బలను తిన్న రాక్షసుల సేనలను చూచారే తప్ప, మహావేగంగా పరిభ్ర మించే శ్రీరాముని ఎవరూ చూడలేక పోయారు- అని వాల్మీకి అన్నాడు. తరువాత **"తే తు రామసహస్రాణి రణే పశ్యంతి రాక్షసాః"**. (ఆ రాక్షసులు వేయిమంది రాములను చూచారు.) వేల సంఖ్యలోని శ్రీరాముని రూపాలను దర్శించారు - అని అన్నాడు. ఆయుద్ధరంగంలో శ్రీరాముని ఒక్కని మాత్రమే దర్శించారని అన్నాడు. శ్రీరాముని చూడనే లేదు- అని అనడం, వేలాది సంఖ్యలో శ్రీరాముని చూచారని అనడం, ఒకే



రాముని చూచారని అనడం - ఈ విధంగా ఒక దానితో ఇంకొకటి పొసగని రీతిలో పలికే క్రమంలో కదా శ్రీరాముడు చాలా ఆశ్చర్యకరమైన యుద్ధాన్ని చేశాడు. తిరువాయ్‌మొళిలోని (8-6-3) **"ఒరువరిరువర్ మూవరెననిన్ఱు ఉరువు కరన్ద ఉళ్ళన్దోఱుమ్ తిత్తిప్పాన్"** (ఒకరుగా, ఇద్దరుగా, ముగ్గురుగా తోచి, అదృశ్యుడై మనస్సులో మధురంగా భాసించాడు) అనే పాశురానికి పూర్వాచార్యులు అర్థాన్ని నిర్వహించే రీతి ఇతరపండితుల బుద్ధికి కొంచెం కూడా అందదు. **"ఒరువరిరువర్ ఓర్ మూవర్"** అని ఉండడం, **"ఉరువు కరన్దమ్"** ఉండడం ఎపుడు అనే విషయాన్ని తెలిసికోవడం సాధ్యం కాని రీతిలో ఆళ్వార్ల పాశురం ఆవిర్భవించింది. దీనికి ముందు పాశురం- **"శెరుక్కడుత్తు తిశైత్తవర్ అరక్కరై ఉరుక్కెడ వాళిపొళిన్ద ఒరువనే"** (మదించి గర్వించిన రాక్షసుల రూపాలు నశించిపోయేటట్లు వానవర్షాన్ని కురిసిన అద్వితీయుడు) అని ముగుస్తున్నది. తరువాతి పాశురంలోని ముందు పాదాలకు, ముందు పాశురంలోని ఉత్తరార్ధంతో ఒక అన్వయాన్ని చేసి, పూర్వాచార్యులు వ్యాఖ్యానించారు. ఇక్కడ పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యాన శ్రీసూక్తి మాధుర్యాన్ని గమనించండి. **"ఒరువర్ ఇరువర్ ఓర్ మూవరెననిన్ఱ ఉరువు కరన్ద- ఉరుక్కెడ వాళి పొళిన్ద ఒరువన్ ఎన్ఱ కీళ్ళోడే అన్వితమాక క్కడవదు. మూలబలమ్ శామ్బుడి అరుళుకిఱ అన్ఱు మున్ఱుఱ ఒరువనాయ్‌త్తోన్ఱి, శారికైయిల్ వేగమ్ మికమిక ఇరువరుమ్ మూవరుమాయ్ తోన్ఱి వేగమ్ మిక్కవాఱే ఇన్ద్రియసంయోగత్తుక్కు ఇడమిల్లాదపడి యాకైయాలే రూపగ్రహణమ్ అరిదాకి ఉరుక్కెడవాళి పొళిన్ద ఒరువన్- ఎన్ఱ అన్వయమ్. వ్యాపరిత్త శడక్కాలే రూపమ్ కణ్ణుక్కుప్పిడిపడాదొళిగై"** (ఒకరు, ఇద్దరు ముగ్గురు అని మొదట తోచి, వేగం మించగానే రూపమే కనిపించకుండా పోయిన రీతిలో రాక్షస రూపాలు నశించేటట్లు బాణాలను కురిసిన అద్వితీయుడు - అని పూర్వపాశురంతో అన్వయించాలి. మూలబలం నశించేటట్లు యుద్ధం చేసే ఆ సమయంలో ముందుగా ఒకడుగా తోచి, వేగం మించగా ఇద్దరుగా, ముగ్గురుగా కన్పించి, పరిభ్రమణవేగం ఇంకా ఇంకా అధికం కాగానే చక్షురింద్రియసంయోగానికి అవకాశం లేనిరీతిలో ఉన్నందున, రూప గ్రహణం అరుదై, రాక్షసుల రూపాలు నశించేటట్లుగా బాణ వర్షాన్ని కురిసిన అద్వితీయుడు.) అనేది ఆ సూక్తి. దీనివల్ల శ్రీరాముని వీరం వాచామగోచరమని ఏర్పడింది.

**14. శక్తిమతాం శ్రేష్ఠః -** అపరిమితశక్తియుక్తుడని దీనిభావం. శ్రీరాముడు మహాశక్తిమంతుడై ఉన్నపుడు రావణుని ఒక్కక్షణకాలంలో వధించి ఉండవచ్చును

కదా! ఆ విధంగా వధించకుండా చాలా ప్రయాసలకు పడినట్లుగా తెలుస్తున్నదే! అది ఏమి? - అని కొందఱు ప్రశ్నించవచ్చు. సమాధానం వినండి. **"పాల్లా వరక్కనై క్కిళ్ళి కళైన్దానై"** (దుష్టుడైన రాక్షసుని అవలీలగా సంహరించినవాడు) అని ఆణ్డాళ్ **"శతురమామదిళ్ శూழ్ ఇలఙ్గైక్కిళైవన్ తలై పత్తుదిర వోట్టి ఓర్వెఱ్ఱనై ఉయ్త్తవన్"** (గొప్ప ప్రాకారాలచే చుట్టబడి ఉండే లంకకు ప్రభువైన రావణుని వది తలలు రాలి కిందవడేటట్టుగా ఒకేఒక్క తీవ్రమైన బాణాన్ని ప్రయోగించినవాడు) అని తిరుప్పాణ్ ఆழ్వార్లు అనుగ్రహించిన రీతిలోనే రావణసంహారాన్ని శ్రీరాముడు అవలీలగానే చేశాడు. అందులో సందేహం లేదు. "ఏవిధంగా అయినా రావణుడు సంస్కరింపబడి దారిలోకి వచ్చి ఉజ్జీవించడం, జీవించడం సంభవిస్తుందా?" అనే ఆశ శ్రీరామునకు ఉన్నందువల్లనే అతనిని సంహరించడంలో కాలయాపనను చేశాడు - అనే వాస్తవం గమనించదగినది. రావణునికంటే పలు రెట్లు బలిమిని కలవాడని ప్రసిద్ధిని పొందిన వాలినే అనాయాసంగా వధించినవాడు, శ్రీరాముడు. హనుమానుడు రావణునకు హితోపదేశాన్ని చేసేటపుడు (సుందరకాండం-51వ సర్గ-11వ శ్లోకం) **"త్వయా విజ్ఞాత పూర్వశ్చ వాలీ వానరపుంగవః, రామేణ నిహతః సంఖ్యే శరేణైకేన వానరః"** (నీకు బాగా పరిచితుడైన, గొప్పవానరుడైన వాలి రామునిచే యుద్ధంలో ఒకే ఒక్క బాణంతో సంహరింపబడ్డాడు) అని, "నాయనా! రావణా! వాలి అనే వానరేశ్వరుని ఇంతకు ముందే నీవు తెలిసినవాడవే కదా. అతడు శ్రీరామునిచే ఒకే ఒక్కబాణంతో వధింపబడ్డాడు సుమా!- అని అన్నాడు. అంతేకాక, రావణుని పలు మార్లు కార్తవీర్యార్జునుడు భంగపఱిచాడు. అంతటి వాని వేయి బాహువులను పరశురాముడు తన గొడ్డలితో ఖండించాడు. ఆ పరశురాముడు శ్రీరామునివద్ద పడిన పాట్లు తెలిసినదే. అటువంటి నిస్సామాన్యాధికమైన సామర్థ్యాన్ని కల్గిన శ్రీరాముడు రావణుని సంహరించడంలో శ్రమపడాలా? శ్రమపడినట్లుగా కథలో సత్యసంకల్పుడు, మహా వీరుడు అయిన శ్రీరాముడు ఎందుకోసం ఈవిధంగా శ్రీరాముడు శ్రమపడ్డాడు? అని గమనించాలి కదా! శూర్పణఖ అంగభంగాన్ని పొంది జనస్థానంలో ఉండే తన అన్న ఖరుని వద్దకు పోయి జరిగిన సంగతిని తెల్పి పొర్లిపొర్లి ఏడ్చి, అతనికి శ్రీరామునిపై కోపాన్ని తెప్పించగా, అతడు పదు నాల్గువేలమంది సేనలను, సేనాధిపతులను శ్రీరామునితో యుద్ధం చేయమని పంపించాడు. శ్రీరాఘవుడు వారిని అందఱిని తానొక్కడే వధించి జయించిన తరువాత, ఖరుడు స్వయంగా తానే నేరుగా వచ్చి ఎదిరించాడు. శ్రీరాముడు **"అసహాయశూర!"** అని రఘువీర



గద్యలో సంబోధింపబడేటట్లుగా లక్ష్మణునికూడా తనకు సహాయకునిగా తీసికొని వెళ్ళకుండా, అతనిని ఎదిర్చి అతని శిరస్సును ఖండించిన వృత్తాంతంకూడా ప్రసిద్ధం. **"చతుర్దశ సహస్రాణి రక్షసాం భీమకర్మణామ్, ఏకశ్చ రామో ధర్మాత్మా కథం యుద్ధం భవిష్యతి"** (భయంకరమైన కృత్యాలను చేసే రాక్షసులు పద్నాలుగు వేలమంది. ధర్మాత్ముడైన రాముడు ఒక్కడే. ఏవిధంగా యుద్ధం జరుగుతుందో కదా!) అని భీతిల్లిన మహర్షులు కూడా ఆశ్చర్యపడేటట్లు అవలీలగాకదా వారిని భస్మంచేశాడు. అటువంటి గొప్ప సామర్థ్యాన్ని కల గొప్ప వీరునకు రావణుడు ఒక పదార్థమా? ఒకేసారి అతనిని వధించలేకపోవడమనేది లేదు. ఏరీతిలో అయినా అతనిని అభిముఖుడై రాకపోతాడా? అని వేచి ఉన్నాడు; అంతే.

**15. ధర్మః -** శ్రీరాముడు సాక్షాత్తు ధర్మంగా చెప్పబడడం పలు సందర్భాలలో కన్పిస్తుంది. రావణుడు లంకలోనుండి పంచవటికి వేగంగా వచ్చి, సీతాపహారం కోసం మారీచుని సహాయంగా వేడినపుడు, అతడు రావణునకు పలు రీతులలో హితోపదేశాలను చేశాడు. ఆ ఉపదేశాల మధ్యలో (ఆరణ్యకాండ-37-13) **"రామో విగ్రహవాన్ ధర్మః"** (రాముడు మూర్తీభవించిన ధర్మం) అని అన్నాడు. "కాళ్ళు చేతులను కల్గి నడయాడే ధర్మమే శ్రీరాముడు" అని ఆసురప్రకృతిని కల్గిన మారీచుడు అన్నాడు. రావణవధానంతరం లంకలోకి వచ్చి స్తుతించే దేవవర్గంలోని బ్రహ్మ **"భవాన్ నారాయణో దేవః"** (నీవు దేవుడవు అయిన నారాయణుడవు) అని పల్కిన తరువాత, **"లోకానాం త్వం పరో ధర్మః"** (నీవు లోకంలో గొప్ప ధర్మం) అని అన్నాడు. గీతలో **"ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే"** (ధర్మ సంస్థాపనకోసం ప్రతియుగంలో అవతరిస్తాను) అని ధర్మసంస్థాపనం కోసం తాను అవతరిస్తానని పల్కిన పరమపురుషుడు **"సర్వధర్మాన్ పరిత్యజ్య"** (అన్ని ధర్మాలను విడచి ) అని సకల ధర్మాలను విడువమని పల్కడం పొసగదు. "విడచిపెట్టు" (పరిత్యజ్య) అని అనడంతో నిలువకుండా, **"మామేకం శరణం వ్రజ"** (నన్ను ఒక్కనిమాత్రమే శరణు పొందు) అని తనను ఆశ్రయించమని అన్నందువల్ల సాక్షాధర్మం తానే - అనే తత్త్వం వ్యక్తమవుతున్నది కదా" మనం శ్రమపడి సాధించవలసిన ధర్మం సాధ్యధర్మ మనబడుతున్నది. ఆ విధంగా కాకుండా ఎల్లప్పుడు సిద్ధంగా ఉండే ధర్మం భగవానుడు. సాధ్యధర్మం అపాయబహుళమని, సిద్ధధర్మం నిరపాయమని తెలియాలి. దశరథ చక్రవర్తి శ్రీరాముని కుమారునిగా పొందిన మహాభాగ్యశాలి అయినా ఒక దౌర్భాగ్యాన్ని కలవాడయ్యాడు. ఆసుర ప్రకృతిని కల మారీచునకు తెలిసిన తత్త్వం అయ్యో! దశరథునకు తెలియకుండా పోయినది

కదా! **"రామో విగ్రహవాన్ ధర్మః"** అని అతడు పల్కినట్లుగా ధర్మమే రూపొందిన సిద్ధధర్మమైన శ్రీరామునితో కూడి ఉజ్జీవించడం మాని, ఆభాసధర్మమైన సత్యవాక్యాన్ని ఆశ్రయించి, కోల్పోయాడు కదా! ఆ చక్రవర్తి ముముక్షుప్పడిలో **"సర్వధర్మాన్ పరిత్యజ్య"** అనేచోట **"చక్రవర్తిమైప్పోలే ఇళ్ళైక్కెక్కుఱుప్పు"** (దశరథుని వలే ప్రాప్యాన్ని కోల్పోవడానికి కారణం) అనేసూక్తికి మణవాళ మహాములులు శ్రీసూక్తులు అనుసంధేయాలు.

శ్రీకృష్ణావతారంలో దధిభాండుని కథను తెలియనివారు లేరు కదా! తల్లి పట్టుకొన్న చిన్న బెత్తానికి భయపడి పరుగెత్తి వచ్చిన శ్రీకృష్ణుని కుండలో దాచిపెట్టి, "నీ కుమారుడు ఇక్కడ లేడు" అని అసత్యాన్ని పల్కి, అతడు సపరివారంగా మోక్షాన్ని పొందాడు. దశరథుడు సత్యవాది అనే పేరును పొంది, నరకపర్యాయమైన స్వర్గాన్నే పొందాడు. రాముడే సాక్షాద్ధర్మమని తెలియలేనివాడు అయినందువల్లకదా ఈవిధంగా సంభవించింది. శ్రీరాముడు సీతాదేవితోకూడి ఉండేకాలంలో ఆమె చేసిన ఉపన్యాసాలలో ఒక గొప్ప ఉపన్యాసాన్ని తిరువడి (హనుమానుని)తో సీతాదేవి పల్కింది. (సుందర-39-41) **"ఆనృశంస్యం పరో ధర్మః త్వత్త ఏవ మయా శ్రుతః"** అనేదే అది. ఆనృశంస్యం అంటే - దయ. అదే పరమధర్మమని శ్రీరాముడు ఉపన్యసించడం అతనికి అలవాటు "కరుణయే మూర్తీభవించినవాడు శ్రీరాముడు" అనేది ప్రసిద్ధం. దశావతారస్తోత్రంలోని **"ఇచ్ఛామీన విహారకచ్ఛప"** ఇత్యాది శ్లోకంలో ఒక్కొక్క అవతారాన్ని ఒక్కొక్క విశేషణాన్ని ప్రయోగించి ప్రస్తావించేటపుడు దేశికులు శ్రీరాముని **"కరుణాకాకుత్థ్స"** అని అనడం గమనార్హం. వాలివధానంతరం **"సంజాతబాష్పః పరవీరహంతా రామో ముహూర్తం విమనా బభూవ"** (శత్రువులను సంహరించే శ్రీరాముడు కన్నీరును కలవాడై, క్షణకాలం మనస్సులో కలతను పొందాడు) అనే రీతిలో ఉండే శ్రీరాముని కరుణాకాకుత్థ్సుడని కదా చెప్పాలి.

**16. ధర్మవిదుత్తమః -** ధర్మజ్ఞులలో శ్రీరాముడు శ్రేష్ఠుడని దీని అర్థం. ధర్మాన్ని చక్కగా తెలిసినవాడని భావం. ఆణ్డాళ్ శ్రీకృష్ణునకు **"తరుమ మఱియాద కుఱుమ్బన్"** (ధర్మాన్ని తెలియని తుంటరి) అనే ఒక బిరుదును ఇచ్చాడు. దానికి పూర్తి విరుద్ధంగా శ్రీరాముని ధర్మజ్ఞులలో శ్రీరాముడు ఉత్తముడు. సీతాదేవి రావణునకు హితాన్ని ఉపదేశించే టపుడు **"విదిత స్సహి ధర్మజ్ఞః"** (ధర్మజ్ఞుడుగా అతడు ప్రసిద్ధుడు కదా!) అని శ్రీరాముడు ధర్మజ్ఞుడు అని పల్కిన విషయం ప్రసిద్ధం. అతని మనస్సులోని ధర్మం ఏది? అనే విషయాన్ని ఆమెయే పలుమార్లు



**"శరణాగతవత్సలః"** అని అనడం ద్వారా తెలియజేసింది. శరణాగతుల విషయంలో ప్రేమను పూర్ణంగా కల్గిఉండడమే శ్రీరాముడు దృఢంగా గ్రహించిన ధర్మమని, దానిని అతడు బాగా తెలిసినవాడని దీనివల్ల చెప్పబడింది. చక్కగా తెలిసినవాడు- అని అంటే - తెలిసినవాడని మాత్రమే అర్థం కాదు. జ్ఞానానికి ఫలం అనుష్ఠానమే కనుక, ఆ ధర్మాన్ని చక్కగా అనుష్ఠించేవాడు- అనే పర్యంతం అర్థమని ఏర్పడుతున్నది. శ్రీరామాయణంలో- శరణాగతిని చేసినవారెవరు? వారిపట్ల శ్రీరాముడు చూపిన వాత్సల్యం ఎటువంటిది? అని విమర్శించి చూడాలి. దీనికి ముందు శరణాగతి అంటే ఏమి? అనేది విమర్శించి చూడడం చాలా ముఖ్యమైనది. ఆ విషయం సారంగా ఇక్కడ తెలుపబడుతున్నది. శరణాగతి, ప్రపత్తి -అనేవి ఒకే అర్థాన్ని ఇస్తాయి. గ్రంథాలలో తెలుపబడిన విషయాలను బాగా గమనించి చూచినపుడు **"భగవత్ ప్రవృత్తి విరోధి స్వప్రవృత్తినివృత్తియే"** ప్రపత్తి అని వ్యక్తమవుతున్నది. అనే పూర్వాచార్యుల సిద్ధాంతమే గ్రాహ్యం. గజేంద్రాళ్వాన్ ప్రపన్నుడు, ద్రౌపది ప్రపన్న, అని అంటున్నాము. వీరి విషయంలో పూర్వం పల్కిన లక్షణం సమన్వయిస్తుంది. **"గజ ఆకర్షతే తీరే గ్రాహ ఆకర్షతే జలే"** అనే రీతిలో గజేంద్రాళ్వాన్ తనను తాను రక్షించుకోవాలని స్వప్రవృత్తిపరుడై ఉన్నంతవరకు అతనిపై భగవానుని కరుణ ప్రసరించలేదు. ఆ స్వరక్షణప్రవృత్తి నిరతం కాగానే **"అరై కుళైయ తళ్ళై కుళైయ"** (నడుమున గల బట్ట జారిపోయేటట్లు, జుట్టు ముడి విడిపోయేటట్లు) మహావేగంగా పరుగెత్తి వచ్చిన రీతిలోని త్వర, ఆర్తి భగవానునకు కల్గింది. ద్రౌపది విషయంలోకూడా ఇటువంటి స్వభావాన్నే గమనించవచ్చు. **"ఇరుకైయుమ్ విట్టేనో ద్రౌపదియైప్పోలే"** (ద్రౌపదివలే రెండు చేతులను జోడించానా!) అనే రీతిలోని స్థితి ఆమెకు కల్గిన తరువాతనే ఆమె రక్షణను పొందింది. తన మానాన్ని తానే కాపాడుకోవాలని ప్రయత్నించి, తన చీరను తానే బిగించి పట్టుకొని ఉండే స్థితి ఉన్నది కదా- అదే భగవత్ప్రవృత్తి విరోధి అయిన స్వప్రవృత్తి. అది విరతం కాగానే కదా చీరలు ప్రవహించే రీతిలోని భగవానుని కరుణ ఉదయించింది. ఈ మర్మాన్ని శ్రీరామాయణంలో దర్శింపజేస్తాను, గమనించండి. కాకాసురుడు శరణాగతిని చేసినట్లుగా చెప్పబడుతున్నది. ఆ శరణాగతి యొక్క స్వరూపాన్ని బాగా విమర్శించి చూచినపుడు, పూర్వం వివరించిన రీతియే కదా వ్యక్తమవుతున్నది. **"స తం నిపతితం భూమౌ"** అనేటట్లుగా ఎక్కడా రక్షణను పొందలేక వచ్చిన స్థితిలో భూమిపై పడిన స్థితి ఉన్నది కదా! అదియేకదా అతని శరణాగతిగా ఆచార్యులచే నిష్కర్షింపబడింది. కాకాసురు నకు రక్షణ కల్గింది. కాకాసురుని ఈ స్థితి రావణునకు కూడా కల్గింది. గొప్ప యుద్ధం జరిగే సమయంలో **"యో వజ్రపాతాశనిపాత.... చచాల చాపంచ ముమోచ వీరః"**

అనే రీతిలోని స్థితి రావణునకు కల్గింది. అపుడు శ్రీరాముడు **"గచ్ఛానుజానామి"**, "రావణా! బయలుదేరి తిరిగి వెళ్ళు. అనుమతిస్తున్నాను'' అని పల్కి, అతనిని పంపించాడు కదా! అది తత్కాలరక్షణంలోకి చేరినదే. ఆత్యంతిక రక్షణాన్ని చేయాలనే అభిప్రాయంకూడా శ్రీరామునకు ఉన్నది. కాని, రావణుడు విధివశంచేత తిరిగి యుద్ధానికి వచ్చి, భగవత్ ప్రవృత్తి విరోధి స్వప్రవృత్తి నిష్ఠుడయ్యాడు. అతనికి కూడా రక్షణమే చేశాడు శ్రీరాముడు- అనేది శ్రీరామాయణంలోని అంతరంగ పరమార్థం. అతనికి చరమసంస్కారాన్ని చేయనని పట్టుబట్టిన విభీషణాళ్వాన్‌ను నిర్బంధించి ఆపనిని చేసేటట్లు ఆజ్ఞాపించాడు, శ్రీరాముడు. "అతని ఆత్మకు హితాన్ని చేయాలని తలచిన తన అభిప్రాయం నెఱవేరకపోయినా, అతని దేహానికి అయినా మంచిపనిని చేయగలిగాను కదా'' అని ఆనందించాడు. **"మరణాంతాని వైరాణి నిర్వృత్తం నః ప్రయోజనమ్, క్రియతా మస్య సంస్కారః యథా హ్యేష తథా మమ"** (వైరకృత్యాలు మరణంవరకే. మన ప్రయోజనం సిద్ధించింది. ఇతనికి చరమసంస్కారాన్ని నిర్వహించు. నీకు ఎటువంటివాడో నాకు కూడా ఇతడు అటువంటివాడే!) అనే శ్రీరాముని మాటకు నంబిళ్ళై రసఘనంగా చేసిన వ్యాఖ్యానం అపూర్వ రామాయణ గ్రంథంలో విశదీకరింపబడింది.

(అపూర్వ రామాయణ గ్రంథంలోని ఈ శ్లోక వివరణం ఈక్రింద తెలుపబడుతున్నది. ఇది విభీషణుని ఉద్దేశించి శ్రీరాముడు పల్కిన శ్లోకం. రావణుడు మరణించిన తరువాత, "ఈ మహాపాపికు నేను ఉత్తర క్రియలను చేయను'' అని పట్టుదలతో ఉండే విభీషణాళ్వాన్‌ను చూచి పల్కిన మాట ఇది. సాధారణంగా సంస్కృతభాషను తెలిసిన అందఱు శ్రీరామాయణంలోని శ్లోకాలకు అర్థాన్ని చెప్పడం అలవాటు కనుక, అటువంటివారు దీనికి చెప్పే అర్థం ఏ విధమైనది? అంటే, "లోకంలో ఒకనిపట్ల ఇంకొకనికి ఉండే పగ, మరణంవరకు మాత్రమే. అందువల్ల, ఇక రావణుడు మరణించిన తరువాతకూడా, ఇతనిపట్ల మనం పగను కల్గి ఉండడం ఎందుకు? ఇతనిని వధించడం సీతాదేవిని పరిగ్రహించడమే మనకు ప్రయోజనం కనుక, అది నెఱవేఱిన తరువాత కూడా ఇక ఇతనిపై మనం పగను కల్గి ఉండవచ్చునా? పగను మఱచి ఇక ఇతనికి చేయవలసినదానిని చేయాలి'' అని శ్రీరాముడు పల్కుతున్నాడని పలువురు చెప్పే అర్థం.

ఈ అర్థం పొందికను కల్గినది కాదని, ఇది శ్రీరాముని మనస్సుకు పొసగనిది అని నమ్బిళ్ళై భావించి, చాలా రస్యమైన వ్యాఖ్యానాన్ని చేశారు. ఆ వ్యాఖ్య ఇక్కడ వివరింపబడుతున్నది.



ఇంతవరకు శ్రీరామునిపై రావణుడు పగను కల్గి ఉన్నాడే తప్ప, రావణునిపై శ్రీరాముడు కొంచెం కూడా పగను కల్గినవాడు కదా ! విభీషణుని పరిగ్రహించాలా? వద్దా ? అనే విచారం జరిగి, పరిగ్రహించాలి- అని నిశ్చయించి, **"ఆనయైనం హరిశ్రేష్ఠ! దత్తమస్యాభయం మయా"** (ఓ వానర రాజా! ఇతన్ని నాదగ్గరకు తీసుకొని రా! ఇతనికి నేను అభయాన్ని ఇచ్చాను) అని సుగ్రీవుని నియోగించి విభీషణుని తీసికొని రమ్మని ఆజ్ఞాపించినపుడు **"విభీషణో వా సుగ్రీవ! యది వా రావణస్స్వయమ్"** (సుగ్రీవా! వచ్చినవాడు విభీషణుడు అయినా, లేక, స్వయంగా రావణుడైన) అని శ్రీరాముడు పలికాడు. వచ్చినవాడు విభీషణుడైనా సరే; రావణుడే మాఱువేషం వేసికొని వచ్చినా సరే. తప్పకుండా నీ వెంట తీసికొనిరా'' అని అన్నాడు. ఆవిధంగా పల్కిన శ్రీరాముని మనస్సుకు అనుకూలంగా ఉండే అర్థాన్ని కదా చెప్పాలి.

ఈ సంగతిని గమనించండి "విభీషణా! ఈ రావణుడు జీవించి ఉండే కాలంలోనే ఇతనికి ఏమయినా కొన్ని హితాలను నేను చేయగోరాను. ఇవి ఈడేఱని రీతిలో ఇతడు పలు విధాలుగా ద్వేషకార్యాలనే చేస్తూ వచ్చాడు. మహర్షులను సుఖంగా జీవించలేకుండా చేశాడు. సీతాదేవిని విశ్లేషింపజేశాడు. నాకు ప్రాణస్థానీయుడైన శ్రీజటాయుమహారాజును వధించాడు. ఇటువంటి వైరకృత్యాలను ఇతడు తాను చనిపోయేవరకు చేసి తీరినవాడైనా, ఇక అటువంటి పనులను చేయలేడు కదా ! అనేదే **"మరణాంతాని వైరాణి"**అనే దానియొక్క అర్థం (ఇక్కడ **"వైరాణి"** అంటే వైరికృత్యాలని భావం.)

ఇక, **"నిర్వృత్తం నః ప్రయోజనమ్"** అనేది ఇక్కడ ప్రాణస్థానీయమైన వచనం. దీని అర్థాన్నే ఋజువుగా గ్రహించాలి. "ఇతనిని సంహరించడం మనకు ప్రయోజనం, అది నెఱవేరింది'' అని శ్రీరాముడు పల్కుతున్నట్లుగా అర్థాన్ని గ్రహించకూడదు. ఆ అర్థం మనస్సులో కూడా భావించదగినది కానేకాదు. ప్రస్తావించి ఖండించడానికి కూడా తగని అర్థం అది. ఈ ప్రయోగానికి నమ్బిళ్ళై అనుగ్రహించిన వ్యాఖ్యాన శ్రీసూక్తి యథాతథంగా ఉట్టంకింపబడుతున్నది.

**(నిర్వృత్తం నః ప్రయోజనమ్)- "ఇవన్ జీవిత్తిరుక్కిఱ నాళిలే నామ్ శెయ్యుమ్ నన్మైయై ఇవన్ విలక్కాదాళ్వియ వేణుమెన్ఱు ఇత్తనైయే ప్పార్త్తిరున్దోమ్. అదు అన్నాళిలే పెఱ్ఱిలోమ్. నామ్ తేడియిరున్ద అదు మున్దుఱ మున్నమ్ సిద్ధిక్క పెఱ్ఱిరోమిత్తే".** (ఇతడు జీవించియుండే కాలంలో నేను చేసే హితాన్ని ఇతడు అడ్డుపెట్టకుండా ఉండాలి - అని ఇంతమాత్రమే నేను ఎదురుచూశాను. దానిని ఆ

సమయంలో పొందలేకపోయాను. నేను ఎదురుచూసే దానిని ఇపుడు ముందుగా పొందగలిగాను కదా!)

ఈ సూక్తిని కొంచెం వివరిస్తాను. భగవానుడు చేతనులను చేయడంలో బాధ్యతను కలవాడు. తాను చేయదలచిన హితాలను నిర్హేతుకంగా తానే చేయగల్గినా, **"సర్వజ్ఞోఽ హి దేవేశ స్సదా కారుణికోఽ పి సన్, సంసారతంత్ర వాహిత్వాత్ రక్ష్యాపేక్షాం ప్రతీక్షతే"** (భగవానుడు సర్వజ్ఞుడైనా, కరుణను కలవాడైనా, సంసార తంత్రాన్ని నిర్వహించేవాడు అయినందున రక్షింపబడదగిన, జీవునినుండి అపేక్షను ఎదురుచూస్తాడు) అని శాస్త్రాలలో చెప్పబడినందువల్ల చేతనుల వద్దనుండి కొంచెం ఎదురు చూస్తాడు- అని తెలుస్తున్నది. ఆ విధంగా భగవానుడు ఎదురు చూచేది ఏది?- అని అంటే, దానిని మనం ఒక విధంగా ఇదమిత్థమని నిష్కర్షించి చెప్పలేము. కర్మయోగం, జ్ఞానయోగం, భక్తియోగం మొదలైనవానిలో ఏదైనా ఒకదానిని ఎదురుచూడవచ్చు. "మనం చేసే మంచిని ఇతడు అడ్డు పెట్టకుండా ఉండాలి" అని ఇంతమాత్రమే ఎదురుచూడడం కూడా ఉన్నది. దీనికి అప్రతిషేధం- అని పేరు. ప్రతిషేధం - అంటే అడ్డుకోవడం. అప్రతిషేధం- అడ్డుకోకుండా ఉండడం. భగవానుడు కరుణను మనపై ప్రసరించలేకుండా ఉండేటట్లు మనం మనతలనే ఖండించుకొనేవారమై తిరిగే రీతి ఉన్నది కదా. అదే ప్రతిషేధం - అంటే.

మనం చేసే ప్రవృత్తులను ((ప్రయత్నాలను) చూచి భగవానుడు - "అయ్యో! నా కరుణ ప్రసరించడానికి కూడా అవకాశం ఇవ్వకుండా ఈవిధంగా అడ్డుపెడుతున్నాడే! పాపిష్ఠివాడు!" అని కన్నీరు విడుస్తాడు. చేతనుడు అనుకూల ప్రవృత్తిని దేనినీ చేయకపోయినా, విపరీత ప్రవృత్తులను చేయకుండా ఉంటే, భగవానుని కరుణప్రవాహం అడ్డు లేకుండా ప్రవహించి తీరుతుంది. దీనిని కూరేశులు శ్రీవైకుంఠస్తవంలో అద్భుతంగా (61వ శ్లోకంలో) అనుగ్రహించారు. **"యత్ బ్రహ్మకల్ప నియతానుభవేప్యఽ నాశ్యమ్"** అనే శ్లోకంలో. ఈ శ్లోకంలో- **"క్షామ్యస్యహో! తదభిసంధివిరామమాత్రాత్"** (జీవుడు నీ రక్షణ ప్రయత్నాన్ని అడ్డుకోవడం నిలిపినంత మాత్రంలోనే అతనిని నీవు క్షమిస్తావు కదా! ఆహా! ) అనేది ప్రాణ సమానమైన ఉక్తి. చేతనుడు సుకృతవిశేషాలను ఏమీ చేయకపోయినా, దుష్కృతమైనా చేయకుండా ఉంటే, అంతమాత్రమే ఆలంబనంగా చేసికొని భగవానుడు అనుగ్రహించి తీరుతాడు- అనేదే ఈ కూరేశుల శ్రీసూక్తిలో తెలుపబడిన విషయం. మనంగా ఏ సుకృతం చేయక పోయినపుడు, దానినిగూర్చి కొంచెం కూడా బాధలేదు.



భగవానుని కరుణ ప్రవహించడానికి అడ్డుగా అతనితో ఎదురుబాణాన్ని సంధించక పోవడం (ప్రతిషేధించకపోవడం), అతడే స్వయంగా రక్షించాలని అభిప్రాయపడినా, దానిని అడ్డుకొనేటట్లే, మనం విపరీత ప్రతికూల ప్రవృత్తులలో చేయిపెట్టేటట్లు ఉంటే, దానిని చూచి అయ్యో! అని శోకించవలసి వస్తుంది.

రావణుడు సీతాదేవిని అపహరించడం, జటాయువును వధించడం, పరమభాగవతులైన మహర్షులను సుఖంగా నివసించనీయకుండా వారికి అనేక కష్టాలను కల్గించడం మొదలైనవానిని చేసినా- వీటిని ఏమీ పట్టించుకోకుండా కరుణాసముద్రుడైన కాకుత్థ్సుడు **"ఇస్టు పోయ్ నాళై వా"** ఇత్యాది వచనాలతో దయ చూపాలనే తన అభిప్రాయాన్ని సూచించినా, అయ్యో ! అతడు శ్రీరాముని మనోగతాన్ని తెలియలేకపోయాడు. **"గచ్ఛానుజానామి"** అని పల్కిన శ్రీరాముని నియమనాన్ని పొంది, ఇంటికి పోయినవాడు తిరిగి యుద్ధానికి రాకుండా ఉండి ఉంటే శ్రీరాముడు అతనినే లంకకు ప్రభువుగా చేసి ఉండేవాడే. ఈప్రాప్తికి అతడు అవకాశం ఇవ్వలేదు. అందువల్లనే అతని విషయంలో శ్రీరాముడు చేయగోరిన హితం అతని ప్రాతికూల్యంవల్ల అడ్డగింపబడి పోయింది. అతడే ఇపుడు మరణించినందువల్ల దానిని పరప్రయోజనంగా తలచి, **"నిర్వృత్తం నః ప్రయోజనమ్"** అని అన్నాడు. "నేను చేయదలచిన మంచికి ఏ అడ్డు చేయకపోవడమనే ఈ స్థితిలో నేను ఇతనికి చేయగల్గిన మంచి ఏమి? అంటే, ఇతని శరీరాన్ని కాకులు, గద్దలు తినకుండా పెద్దలకు చేసే క్రమంలో సంస్కారం చేయడమే. విభీషణా! నీవు దానిని చేయాలి. నీవు చేయకపోతే, ఇదిగో నేనే చేసి తీరుతాను - అని శ్రీరాముడు పల్కడమే **"మరణాంతాని వైరాణి"** అని ప్రస్తావించిన ఈ శ్లోకంవల్ల తేలిన విషయం. ఇటువంటి శ్రీరాముడు రావణుని ఒకే బాణంతో వధించకుండా చాలా ఆలస్యం చేయడం తన శౌర్యవీర్య పరాక్రమాలలోని కొఱత వల్లకాదు- అని చక్కగా గ్రహించాలి-

**సహస్రనామస్తవనే చ విష్ణోః నామాని రామస్తుతితత్పరాణి ।**
**అణ్ణంగరార్యై ర్విశదీకృతాని ప్రకాశితాన్యత్ర ముదే బుధానామ్ ॥**

# శ్రీరామాయణ సుధానిధి

**శ్రీశైలపూర్ణగురువర్య పదాబ్జభృంగ -**
**శ్రీభాష్యకారపదపద్మయుగం ప్రపద్య ।**
**రామాయణస్థబహుపద్యసదర్థసారం**
**శ్రీమత్ సుధానిధిముఖేన సమర్పయామి ॥**

(శ్రీశైలపూర్ణులనే ఆచార్యవర్యుల పదపద్మాలలో తుమ్మెదవంటివారైన శ్రీరామానుజుల పాదపద్మాలను ఆశ్రయించి, రామాయణంలోని పలు శ్లోకాలలోని గొప్ప అర్థాలసారాన్ని **"శ్రీరామాయణ సుధానిధి"** - అనే పేరుతో సమర్పిస్తున్నాను.)

**కాంచీవాదిభయంకర వంశీయాణ్ణంగరార్యకృతిరేషా ।**
**సహృదయరసికబుధానాం సతతం హృదయే సమేధతాం సుష్ఠు ॥**

(కాంచీ శ్రీ ప్రతివాదిభయంకరమ్ అణ్ణంగరాచార్యస్వామి రచించిన ఈ కృతి సహృదయులైన రసిక పండితుల హృదయంలో నిత్యం చక్కగా ప్రకాశించాలి.)

మన పూర్వాచార్యులు అనుభవించిన ఇతిహాసపురాణాలలో శ్రీరామాయణం ఒకటే ప్రాధాన్యాన్ని పొందింది. దీనినే వారు ఇతిహాసశ్రేష్ఠమని వ్యవహరించారు. భగవద్విషయాదులలోకూడా చాలా ఎక్కువగా ప్రస్తావించినది, వ్యాఖ్యానించినది- శ్రీరామాయణమే. దీనికి పిమ్మట శ్రీవిష్ణుపురాణం, దానికి పిమ్మట భగవద్గీత. ఆ రెండింటికంటే శ్రీరామాయణానికే ప్రాబల్యమనే విషయం పునరుక్తం. శ్రీరామాయణంనుండి మన పూర్వాచార్యులు, నాలాయిరదివ్యప్రబంధ వ్యాఖ్యానాలలో పెరియవాచ్చాన్ పిళ్ళై, అక్కడక్కడ ఆ యా సందర్భాలలో వ్యాఖ్యానించినవానిని సంగ్రహించి, శ్రీరామాయణసారభమనే పేరుతో పలు ఏండ్లకు ముందు ప్రకటించాను. ఇపుడు ఈ గ్రంథ ప్రమేయ మేమి? అని అంటే, మాధుర్యమే మూర్తీభవించిన శ్రీరామాయణాన్ని అక్కడక్కడ ఉపన్యసించేవారికి, ఉపన్యసించగోరేవారికి ఉపకారంగా శ్రీరామాయణ శ్లోకరత్నాలకు పెక్కింటికి మధురమైన అర్థాలను ఉపహారంగా సమర్పించడమే. ఈ అర్థాలు ఆచార్య శ్రీసూక్తులనే రత్నసమూహాలే తప్ప స్వకల్పితాలు కావు.



## గ్రంథారంభం

శ్రీరామాయణోపక్రమం వాల్మీకి - నారద సంవాదరూపంగా జరిగింది. అంటే- వాల్మీకిమహర్షి నారదమహర్షిని ప్రశ్నించినట్లు, ఆ నారదుడు సమాధానం పల్కినట్లుగా ఆవిర్భవించింది. శ్రీవిష్ణుపురాణం మైత్రేయ- పరాశరసంవాదంగా అవతరించింది. అయితే, దాని అవతారక్రమంలోను, దీని అవతారక్రమంలోని తేడా ఉన్నది. పరాశరభగవానుడు అనుష్ఠానాన్ని పూర్తి చేసికొని, తమ ఆశ్రమంలో వేంచేసి ఉండగా, అక్కడకు మైత్రేయమహర్షి పోయి, స్వరూపానురూపంగా నమస్కరించి, ప్రశ్నించినట్లుగా విష్ణుపురాణంలో ఉన్నది. వాల్మీకిముని ఆశ్రమానికి దేవలోకమహర్షి అయిన నారదభగవానుడు వచ్చినట్లు, అతనిని ఉద్దేశించి వాల్మీకి పదహారు ప్రశ్నలను అడిగినట్లు, వాటికి నారదుడు సమాధానం పలికే రీతిలో శ్రీరామకథలను సంగ్రహంగా పల్కి పూర్తిచేసినట్లు శ్రీరామాయణ గ్రంథంలో ఉన్నది. అనవరతం **"రామ రామ"** అని కూజనాన్ని (కోకిలధ్వనిని) చేసి, కాలక్షేపం చేసే వాల్మీకికోకిలకు శ్రీరామకథనే వినాలనే కోరిక ఉన్నా, తమ వద్దకు వచ్చిన నారదమహర్షిని ఉద్దేశించి "శ్రీరామకథను చెవులకు ఇంపుగా వినాలని ఆశపడే నాకు దానిని చెప్పండి'' అని అంటు అడుగవలసి ఉండగా, ఆ విధంగా ప్రశ్నించకుండా, కొన్ని గుణవిశేషాలను ప్రస్తావించి, వాటిని కలవాడు ఎవడో అతనినిగూర్చి పల్కండి- అని అడగడం ఎందుకు? అని అంటే, ఇటువంటి కల్యాణగుణాలను కలవాడు శ్రీరాముడు ఒక్కడే; ఇంకొకరు కారు- అనే నిశ్చయం వాల్మీకి ఉన్నది. అది బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడైన నారదమహర్షి సూక్తిద్వారా దృఢపరచాలనే అభినివేశం వల్లనే ఆ విధంగా అడిగాడు; అంతే. శ్రీరాముని మహిమను చెప్పమని అడిగి, దానిని తాను ఆలకించడంకంటే, సామాన్యంగా ప్రశ్నించి, విశేషంగా సమాధానం పలుకగా వినడం రసవత్తరంకదా ! శ్రీరామానుజుల శ్రీచరణాలను ఆశ్రయించిన వారిలో ఎవరు గొప్ప కీర్తిమంతులో, వారినిగూర్చి పల్కండి- అని అడిగిన వెంటనే, ప్రశ్నింపబడినవారు "కూరేశులొక్కరే అటువంటి కీర్తిని కలవారు'' అని పల్కితే ఆ మాట రసవత్తరమే అవుతుంది తప్ప, కూరేశుల గొప్పతనాన్ని గూర్చి పల్కండి అని కోరి, దానిని ఒకరు చెప్పగా వినడంలో గొప్ప లేదు కదా ! అందువల్ల శ్రీరామకథను వినాలనే కుతూహలాన్ని కల్గిన వాల్మీకిముని, ఆ కోరికను మఱుగు పరచి ప్రశ్నించడం ఆర్జవ గుణలోపంవల్ల - అని భావించడం తగదు. తమ అభిప్రాయాన్ని స్థిరపరచుకోవడం కోసమేనని గ్రహించాలి.

**1. తపఃస్వాధ్యాయనిరతం తపస్వీ వాగ్విదాం వరమ్ ।**
**నారదం పరిపప్రచ్ఛ వాల్మీకి ర్మునిపుంగవమ్ ॥**

ఈ శ్లోకాన్ని రచించినవారు వాల్మీకి కాదు; వేఱెవ్వరో రచించి ఉంటారని పైకి తోచినా, ఈ శ్లోకాన్ని రచించినవారు వాల్మీకి భగవానుడే. **"నారదం ముని పుంగవం వాల్మీకి రహం పర్యపృచ్ఛమ్"** అని వాల్మీకి వ్రాసి ఉండవచ్చును కదా! - అని అంటే, అది లౌకికగోష్ఠిలో అనుసరించే క్రమం. ఇది మహర్షుల గోష్ఠిలో ఆదరించే క్రమం. - అని తెలియాలి. ఇక్కడ వాల్మీకి తమకు **"తపస్వీ"** అనే విశేషణాన్ని ప్రయోగించడం, తమను తపోనిష్ఠాతునిగా కీర్తించుకోవాలనే కోరికవల్ల కాదు. **"తపస్వీ తాపసః శోచ్యః"** అనే నిఘంటువచనాన్ని బట్టి "నిర్వేదాన్ని కల్గినవాడు" అనే అర్థాన్ని వ్యక్తం చేయడంకోసమే. వైషధకావ్యంలో నలమహారాజుచే బంధింపబడిన హంస తనను విడువమని వేడేటపుడు ఆ ప్రభువు మనస్సులో దయ కలిగేటట్లుగా పలికే క్రమంలో **"మదేకపుత్రా జననీ జరాతురా నవప్రసూతిర్వరటా తపస్వినీ"** అనే వచనం ఉన్నది. ఇక్కడ గల **"తపస్వినీ"** అనే పదం **"తపస్వీ"** అనే పదంయొక్క స్త్రీలింగరూపం. దీనివల్ల శోచనీయార్థంలో ఈ పదం ప్రయోగింపబడినదని తెలుస్తున్నది. ఆ విషయం ఉండనివ్వండి. ఆచార్యశుశ్రూషను (ఉపసత్తిని) చేయగోరినవానికి ఉండదగినది నిర్వేదమే- అనే విషయాన్ని **"పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాత్"** (కర్మలకు లోబడిన లోకాలను చూసి బ్రాహ్మణుడు నిర్వేదాన్ని పొందాలి) అనే శ్రుతికూడా పల్కింది. **"శుగస్య తదనాదరశ్రవణాత్ తదాద్రవణాత్ సూచ్యతే హి"** అనే బ్రహ్మసూత్రం కూడా తెలిసింది. ప్రకృతంలో, వాల్మీకికి ఏవిధమైన నిర్వేదం కల్గింది? అంటే, ఆచార్యుని ముఖంగా వింటే తప్ప విద్య సుప్రతిష్ఠితం కాదు- అనే శాస్త్రార్థాన్ని తాను తెలిసినవాడు కనుక, ఆ విధంగా ఉపదేశించి గల్గిన ఆచార్యులొకరు లభించలేదే!- అనే నిర్వేదమే ఇక్కడ వాల్మీకి కల్గి ఉండే నిర్వేదం. పలికే ఆచార్యుడు తన వాక్ సామర్థ్యంతో చటుక్కున పల్కడంలోకూడా స్వారస్యం లేదు. వివక్షితమైన విషయాన్ని మననం చేసి, చేసి, తాము అనుభవించి, మనస్సులో కఱుగిపోయే స్వభావాన్ని కూడా కల్గి ఉండాలనే విషయాన్ని తెలుపడంకోసం నారద మహర్షికి **"వాగ్విదాం వరమ్"** అని, **"మునిపుంగవమ్"** అని రెండు విశేషణాలు ప్రయోగింపబడ్డాయి. వాల్మీకి ముని నారదమహర్షిని అడిగిన అంశం ఏది? అని అంటే, అది అనంతరశ్లోకాలలో గమనించవచ్చు.



**2. కోన్వస్మిన్ సాంప్రతం లోకే గుణవాన్ కశ్చ వీర్యవాన్ ।**
**ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ సత్యవాక్యో దృఢవ్రతః ॥**

ఈ శ్లోకంనుండి ఆరంభించి వరుసగా మూడు శ్లోకాలలో పదహాఱు కల్యాణగుణాలను ప్రస్తావించి, వాటిని కలవాడు ఎవరు ?- అని ప్రశ్నింపబడింది. ఇందులో మూడు నిర్బంధాలు విధింపబడ్డాయి. అవి ఏవి ? అంటే, **1. "అస్మిన్ లోకే"** అని అన్నందువల్ల, దేవలోకంలో ఉండే ఎవరినిగూర్చి పలుక కూడదు- అనేది మొదటి నిర్బంధం. **(2) "సాంప్రతమ్"** అని అన్నందువల్ల, ఎపుడో జీవించి, మరణించినవానినిగూర్చి పలుకరాదు- అనేది రెండవ నిర్బంధం. **(3) "మహర్షే ! త్వం సమర్థోసి జ్ఞాతుమేవంవిధం నరమ్"** అని అన్నందువల్ల దేవయోనిలో పుట్టిన వానినిగూర్చియే పలకాలి-అనేది మూడవ నిర్బంధం. ప్రశ్నించిన కల్యాణగుణాల వివరణాన్ని నా అపూర్వరామాయణంలో గమనించవచ్చు.

ఇక్కడ ముఖ్యంగా గమనించదగిన విషయం ఒకటి ఉన్నది. శ్రీరామాయణం కేవలం కథాగ్రంథం కాదు. **"వేదోపబృంహణార్థాయ తావగ్రాహయత ప్రభుః"** (వేదార్థాలను విశదీకరించడం కోసం ఆ వాల్మీకి ముని ఆకుశలవులను ఇద్దరిని పరిగ్రహించాడు) అని పల్కినందున వేదార్థాలను వ్యాఖ్యానించడంకోసమే ప్రవృత్తమైనది, ఇటువంటి మహాగ్రంథంలో కల్యాణగుణాలను గూర్చిన ప్రశ్నయే ముఖ్యంగా ప్రస్తావింపబడితే, నిర్గుణబ్రహ్మవాదం సమూలంగా ఛేదింపబడుతుంది- అని, అది **(నిర్గుణ బ్రహ్మవాదం)** వేదపురుషునకు అనభిమతమని ముఖ్యంగా గమనించాలి. పరమపదంలో భగవానుడు తన పరత్వాన్ని మాత్రమే ప్రదర్శించడానికి వీలున్నది. సౌలభ్యసౌశీల్యదయాక్షాంతివాత్సల్యాది గుణాలను అక్కడ వ్యక్తం చేయడానికి వీలుకాదు. ఎందుకు? అంటే, వాటికి లక్ష్యభూతులు అక్కడ ఎవరూ లేనందువల్ల, ఆ కల్యాణగుణాలు ప్రకాశించడంకోసమే భగవానుడు ఈ లోకంలోకి వచ్చి అవతరించాడు. **"గుణపరీవాహాత్మనాం జన్మనామ్"** (కల్యాణ గుణాల ప్రవాహాలవంటి అవతారాలయొక్క) అని భట్టర్ పల్కిన సూక్తి దీనిని బట్టియే. అందువల్ల, నిర్గుణ బ్రహ్మవాదులకు శ్రీరామాయణం అనుకూలమైనది కాదు. నిర్గుణబ్రహ్మవాదాన్ని మనస్సులోకూడా భావించనివారే శ్రీరామాయణాధికారులు- అనేది వాల్మీకి -నారదమహర్షులిరువురి అభిప్రాయం.

**2. ఏతదిచ్ఛామ్యహం శ్రోతుం పరం కౌతూహలం హి మే ।**
**మహర్షే! త్వం సమర్థోసి జ్ఞాతు మేవంవిధం నరమ్ ॥**

ఇటువంటి కల్యాణగుణాలను కల్గినవానినిగూర్చి పల్కు- అని అనకుండా **"శ్రోతుమిచ్ఛామి"** (వినగోరుతున్నాను) అని అనడంవల్ల ఇంతకుముందే తమకు తెలిసినా, **"పురుషార్థోయం మేవైకో యత్కథాశ్రవణం హరేః"**(హరికథాశ్రవణం అనేది ఒక్కటే పురుషార్థం) అనే క్రమంలో చెవులను కల్గి ఉన్నందులకు సాఫల్యాన్ని పొందే రీతిలో వినడంలో కుతూహలం కల్గిందని తెల్పినట్లయింది. ఇక్కడ **"శ్రోతుమ్"** అనే పదం మధ్యమదీపన్యాయంలో (కాకాక్షిన్యాయంలో) ముందు వెనుకలలో అన్వయిస్తుంది. **"శ్రోతుమిచ్ఛామి"** అనేది ముందు అన్వయం. **"శ్రోతుం మే కూతూహలమ్"** అనేది రెండవ అన్వయం. వినడంలోనే తనకు ఆశ; చెప్పడంకంటే వినడమే గొప్పది- అని తెలుపబడినట్లయింది. అందఱు వినాలని ఆశపడితే, ఇక చెప్పేవాడొకడు ఉండాలి కదా! వక్త ఎవరూ లేకపోతే, ఇక వినడం ఏవిధంగా? వక్త కావడానికి తగినవాడు నారదమహర్షియే- అనేది ఉత్తరార్ధం ద్వారా తెలుపబడుతున్నది. **"ఏవంవిధం నరం జ్ఞాతుం త్వం సమర్థోసి"** (ఇటువంటి మానవుని గూర్చి తెలియడానికి నీవు సమర్థుడవై ఉన్నావు) ఒక వ్యక్తి ఒక విషయాన్ని తెలిసికోవడం ఎందుకు? అంటే- **"స్వాధ్యాయప్రవచనే"** అనే రీతిలో ఇతరులకు తెలియజెప్పడంకోసమే కనుక, ఇక్కడ **"జ్ఞాతుమ్"** అనేది **"జ్ఞాపయితుమ్"** అనే అర్థాన్ని ఇస్తుంది. ణిచ్ ప్రత్యయం లోపించిన రూపమని వ్యాకరణ శాస్త్రజ్ఞులంటారు. ణిచ్ ఉన్నచోట దానికి అర్థం లేకుండా గ్రహించడం, ణిచ్ లేని చోట దాని అర్థాన్ని గ్రహించడం శాస్త్రజ్ఞులకు అలవాటే. అందువల్ల ఓ నారదమహర్షీ ! జ్ఞాత, జ్ఞాపయిత- అయిన దేవరవారు చెప్పగా, నేను వినాలని ఆశపడుతున్నాను- అని తాత్పర్యం.

**3. మునే వక్ష్యామ్యహం బుద్ధ్వా తైర్యుక్తః శ్రూయతాం నరః ॥**

ఇక్కడ **"అహం బుద్ధ్వా వక్ష్యామి"** అనేది భగవద్గుణరసికులకే అస్వాద్యమైన సూక్తి. **"బుద్ధ్వా"** తెలిసికొని, **"వక్ష్యామి"** - పలుకగలను- అనే అర్థం వీటికి స్ఫురిస్తుంది. ఇకపై ఎవరివద్ద విని తెలిసికొనబోతున్నారు, వీరు? (నారదుడు) చతుర్ముఖబ్రహ్మవద్ద పలుమార్లు శ్రీరామగుణాలను విని, మనస్సులో తేటపఱచుకొన్నవారు, నారదమహర్షి, ఈ కథను తెలుపడంకోసమే ఇచటకు వచ్చినవారు. అటువంటివారు "ఇదిగో చెబుతున్నాను వినండి" అని కథను చెప్పడం ఆరంభించవలసి ఉండగా, **"బుద్ధ్వా వక్ష్యామి"** (తెలిసికొని పలుకగలను) అనే మాట ఏ అభిప్రాయంతో - అని గమనించాలి. **"బుద్ధ్వా"** అనే పదానికి తెలిసికొని అని అర్థం కాదు. "మోహం తీరి తెలివి పొందిన తరువాత" అనేదే అర్థం. "వాల్మీకి మహర్షీ ! మీరు ఏవో కొన్ని కల్యాణగుణాలను గూర్చి అడిగే వ్యాజంతో శ్రీరాముని



సకలకల్యాణగుణాలను నాకు స్మరింపజేశారు. ఆ గుణసముద్రంలో మునిగి తీరాన్ని చూడలేక, మోహించి పడి ఉండే నాకు బుద్ధి నా స్వాధీనమైనపుడు కదా పల్కడం వీలు. ప్రకృతిని పొందినవాడనుకాకుండా **"కాలాగ్లుమ్ నెఞ్జగ్లియుమ్ కణ్ శుగ్లలుమ్"** (కాళ్ళు తడబడతాయి, మనస్సు శిథిలమౌతుంది, కళ్ళు సుడులు తిరుగుతాయి) అనే రీతిలో ఉండే నేను ప్రకృతిని పొందిన తరువాత యథాశక్తి పలుకడానికి ప్రయత్నిస్తాను- అని భావం.

ఇక్కడ శ్లోకాలు వరుసగా కన్పించినప్పటికీ, **"మునే ! వక్ష్యామ్యహం బుద్ధ్వా"** అని పల్కిన తరువాత కొన్ని గడియలో, కొన్నిదినాలో నారదుడు పలుక కుండా ఉండి ఉండాలి. తిరువాయ్‌మొగ్లిలో నమ్మాగ్వార్లు ఆఱునెలల కాలం మోహించి పడి ఉన్నారని ప్రసిద్ధం కదా ! ఆ విధంగానే నారదుడు కూడా.

**(తైర్యుక్తః శ్రూయతాం నరః)**- ఇక్కడ **"నరః"** అనేది అనపేక్షితం, పూర్వం వాల్మీకి ప్రశ్నలో **"జ్ఞాతుమేవంవిధం నరమ్"** అని ఉన్నందున మనుష్యజాతిలో పుట్టినవానినిగూర్చియే తెలుపవలసి ఉన్నందున **"నరః శ్రూయతామ్"** అని పలుకనక్కరలేదు కదా ! అయినా, ఈవిధంగా పల్కిన మాటలోని మర్మం వినండి. దశరథాత్మజునిగా అవతరించినవాడు శ్రీమహావిష్ణువే- అనే విషయం శ్రీరామాయణంలో అపలాపం చేయబడలేదు. **"ఏతస్మిన్నంతరే విష్ణు రుపయాతో మహాద్యుతిః, శంఖ చక్రగదాపాణిః పీతవాసా జగత్పతిః.... తతః పద్మపలాశాక్షః కృత్వాత్మానం చతుర్విధమ్; పితరం రోచయామాస తదా దశరథం నృపమ్"** (ఇంతలో, గొప్పకాంతిని కలవాడు, శంఖాన్ని, చక్రాన్ని, గదను చేతిలో కలవాడు, పీతాంబరుడు, జగత్తుకు ప్రభువు అయిన విష్ణువు అక్కడకు వచ్చాడు... తరువాత తామర రేకులవంటి కన్నులను కలిగిన అతడు తనను నాల్గువిధాలుగా చేసికొని, దశరథుని తండ్రిగా కోరాడు.) (బాలకాండ) ఇత్యాది శ్లోకాలవల్ల, తరువాత (అయోధ్యాకాండలోని 1వ సర్గలోని) **"స హి దేవైరుదీర్ణస్య రావణస్య వధార్థిభిః, అర్థితో మానుషే లోకే జజ్ఞే విష్ణుః సనాతనః"** (సనాతనుడైన ఆ విష్ణువు, మిక్కిలి గర్వించిన రావణుని వధను కోరే దేవతల చేత ప్రార్థింపబడినవాడై మానవ లోకంలో అవతరించాడు) ఇత్యాది శ్లోకాలవల్ల స్పష్టంగానే ఆ విషయం తెలియబడుతున్నది. అయినా, శ్రీరాముని అభిప్రాయంలో విష్ణుత్వంలో వైముఖ్యం, మనుష్యత్వంలో ఆభిముఖ్యం కన్పిస్తుంది. రావణవధానంతరం దేవతావర్గాలు వచ్చి కలసి, **"భవాన్ నారాయణో దేవః"** (నీవు దేవుడవైన నారాయణుడవు) - అనే మాట సముద్ర ఘోషయై, **"ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజమ్"** - (నన్ను

మానవునిగా, దశరథుని కుమారునిగా భావిస్తున్నాను) అనే మాటయే దృఢమైనది కదా! ఇక్కడ **"మన్యే"** అనే పదానికి **"బహుమన్యే"** (గొప్పగా తలుస్తున్నాను) అనే అర్థాన్ని మన పూర్వాచార్యులకు అభిమతం. భగవద్గీతలో **"అపి చేత్ సుదురాచారో భజతే మామనన్యభాక్, సాధురేవ స మంతవ్యః"** (మిక్కిలి దురాచారాన్ని కలిగినవాడైనా, అతడు నన్ను అనన్యభక్తితో భజిస్తే, సాధువుగానే భావించదగిన వాడు) అనే చోట **"మంతవ్యః"** అనే పదానికి **"జ్ఞాతవ్యః"** అని శ్రీశంకరాచార్యుల వారు తెల్పిన అర్థాన్ని కాదని, **"బహుమంతవ్యః"** (గొప్పగా భావింపదగినవాడు) అని పల్కినట్లుగా ఇక్కడ **"బహుమన్యే"** అనే అర్థం తెలుపడం దోషం కాకపోవడమే కాదు, రసవత్తరం కూడా. "నేను వాస్తవానికి నారాయణుడనే అయినా, మనుష్యత్వం లోనే నాకు ఆదరం అధికం'' అని శ్రీరాముడేకదా చూపించాడు. నడచిన వృత్తాంతాలు కూడా మనుష్యత్వానికే చాలా అనుకూలమైనది. అందువల్లనే కదా, విశ్వామిత్రమహర్షి మహాసభలో **"వేదాహ మేతమ్ పురుషం మహాంతమ్"** (ఇతనిని మహాపురుషునిగా నేను తెలుసుకుంటున్నాను) అనే శ్రుతివాక్యచ్ఛాయలో **"అహం వేద్మి మహాత్మానమ్"** (నేను ఇతనిని మహాత్మునిగా తెలిసికొంటున్నాను) అని పల్కి, ఏకాంతంలో మేల్కొలుపు పలికేటపుడు **"ఉత్తిష్ఠ నరశార్దూల"** (నరులలో గొప్పవాడా! నిద్రలే) అనే సంబోధనను చేశాడు. వాల్మీకిమహర్షికూడా పట్టాభిషేకాన్ని గూర్చి పలికేటపుడు **"అభ్యషించన్నరవ్యాఘ్రమ్"** (నరులలో గొప్పవాడైన రాముని అభిషేకించారు) అని కదా అన్నాడు. **"అభ్యషించన్ మహావిష్ణుమ్"** అని అంటే శ్లోకం కూడదా! శ్రీరామాయణాన్ని కుశలవులు పాడగా శ్రీరాముని ముఖం వాడకుండా వినడంకోసం **"నరవ్యాఘ్రమ్"** అనేదే యుక్తమైనది- అని తెలిసికదా ఆవిధంగా పలికాడు. అందువల్ల **"తైర్యుక్తః శ్రూయతాం నరః"** అనే చోట నారదమహర్షికి వివక్షితం. వాల్మీకీ! **"జ్ఞాతు మేవంవిధం నరమ్"** అని మీరు పల్కిన రీతిలోనే వాస్తవానికి మానవుని గూర్చియే పల్కుతున్నాను''- అనే అర్థమే.

**"ఇక్ష్వాకువంశప్రభవః"** (ఇక్ష్వాకు వంశంలో పుట్టినవాడు) అని ఆరంభించి, **"సత్యే ధర్మ ఇవాపరః"** (సత్యగుణం, ధర్మం మూర్తీభవించినవాడు) అనే పర్యంతం గల పన్నెండు శ్లోకాలలో శ్రీరాముని కల్యాణగుణాలను విశదంగా పల్కి, **"తమేవం గుణసంపన్నం రామం సత్యపరాక్రమమ్, యౌవరాజ్యేన సంయోక్తు మైచ్ఛత్ ప్రీత్యా మహీపతిః"** (ఈవిధంగా గొప్ప గుణాలను కలవాడు, సత్యమైన పరాక్రమాన్ని కలవాడు అయిన ఆ రామునకు పట్టాభిషేకాన్ని చేయాలని ప్రభువైన దశరథుడు కోరాడు) అని ఆరంభించి, **"రామస్సీతామనుప్రాప్య రాజ్యం పునరవాప్తవాన్"**



(రాముడు సీతను తిరిగి పొంది, రాజ్యాన్ని మళ్ళీ పొందాడు) అనే పర్యంతం పట్టాభిషేకప్రయత్నం మొదలుగా, పట్టాభిషేకం పర్యంతం శ్రీరామాయణ కథను సంక్షేపంగా పల్కి పూర్తిచేసి, వాల్మీకిమునివద్ద అనుమతిని పొంది దేవలోకానికి నారదుడు చేరాడు. ఇపుడు ఈ సంక్షేపరామాయణంలోని కొన్ని శ్లోకాలలో మాత్రం అర్థస్వారస్యాన్ని ఆనందిద్దాం.

**23. స సత్యవచనాద్రాజా ధర్మపాశేన సంయతః ।**
**వివాసయామాస సుతం రామం దశరథః ప్రియమ్ ॥**

దశరథుడు తన ప్రియపుత్రుని అరణ్యాలకు పంపించాడు- అని పలికే ఈ శ్లోకంలో **"సత్యవచనాత్"** అనే హేతునిర్దేశం ఒక్కటే చాలు కదా ! **"ధర్మపాశేన సంయతః"** అనే హేతు గర్భవిశేషాణాన్ని ప్రయోగించడం ఎందుకు? అంటే, ఒక శాస్త్రార్థాన్ని తెలుపడంకోసమే. అది ఏమంటే- వ్యాకరణంలో **"యాభ్యో పాశప్"** అనే ఒక సూత్రం ఉన్నది. **"కుత్సితభిషక్ భిషక్పాశః"** అనేది ఈ సూత్రానికి ఉదాహరణం. అదే రీతిలో, "ధర్మపాశ" మనే దానికి కుత్సితమైన పాశమని అర్థం. ధర్మాభాసమని తాత్పర్యం. కైకేయికి తాను ఇచ్చిన వరానికి కట్టుబడి రాజు తన కుమారుని అరణ్యాలకు పంపినట్లుగా కథ. కైకేయికి అతడు వరాన్ని ఇచ్చినది ఏ యుగాంతంలోనో తెలియదు. ఇటువంటి వరం ఇచ్చాడని కూడా నిర్దేశింపబడలేదు. ఆ విధంగా ఉండగా, దశరదుడు శ్రీరాముని స్వయంగా పిలచి "రేపు నీకు మకుటాభిషేం'' అని పలుమార్లు పల్కడం పల్లెలలో, నగరాలలో (ఊరునాడు) అంతటా తెలిసింది. ఈ విధంగా పల్కిన మాటను మీఱినవాడు సత్యవాది ఏవిధంగా కాగలడు? ఇక్కడ ముఖ్యమైన విషయం ఒక్కటే. **"రామో విగ్రహవాన్ ధర్మః"** (రాముడు మూర్తీభవించిన ధర్మం) అనే రీతిలో మూర్తీభవించిన సిద్ధధర్మంగా చెప్పబడే శ్రీరామునితో కూడి ఉజ్జీవించడం మాని, ఆభాసధర్మమైన సత్యవచాన్ని దశరథుడు ఆశ్రయించడం అతనికి దోషంగానే చెప్పబడింది. ముముక్షుప్పడిలోని చరమశ్లోకప్రకరణంలో **"సర్వధర్మాన్ పరిత్యజ్య"** (అన్ని ధర్మాలను విడచిపెట్టి) అనే చోట శ్రీపిళ్ళెలోకాచార్యులవారు అనుగ్రహించిన శ్రీసూక్తి **"చక్రవర్తియైపోలే ఇళ్ళైక్కొక్కుఱుప్పు"** (దశరథునివలె పురుషార్థాన్ని కోల్పోవడానికి పనికివస్తుంది) అనేది. దీనికి శ్రీమణవాళమహామునుల వ్యాఖ్యాన శ్రీసూక్తి ఈవిధంగా ఉన్నది. **"మున్నే వరప్రదానత్తై ప్పణ్ణివైత్తు, ఇప్పోదాక మఱుక్కవొణ్ణాదెన్ఱు ఆభాసమాన సత్యధర్మత్తై ప్పణ్ణినిన్ఱి** నిన్ఱు, **"రామో విగ్రహవాన్ ధర్మః" ఎన్గిఱ పెరుమాళ్దే కూడి వాళ్వివిరున్ద పేరినై యిళన్ద చక్రవర్తియైపోలే"**

(ఇంతకు ముందే వరాన్ని ఇచ్చి, ఇపుడు కాదనకూడదు - అనే ఆభాసమైన సత్యధర్మాన్ని ఆశ్రయించి, రాముడు సాక్షాత్తు ధర్మస్వరూపుడు - అని కీర్తింపబడే శ్రీరామునితో కలసి ఉజ్జీవించవలసిన ఫలాన్ని కోల్పోయిన చక్రవర్తివలె) అనేది ఆ వ్యాఖ్యానసూక్తి. ఈ రీతిలో పూర్వాచార్యులు నిర్వహించడానికి మూలంగానే **"ధర్మపాశేన సంయతః"** అని ప్రయోగింపబడింది.

**24. స జగామ వనం వీరః ప్రతిజ్ఞా మనుపాలయన్ ।**
**పితుర్వచననిర్దేశాత్ కైకేయ్యాః ప్రియకారణాత్ ॥**

శ్రీరాముడు అరణ్యాలకు వెళ్ళినందులకు రెండు కారణాలు ఇక్కడ ప్రస్తావింపబడ్డాయి. ఈ రెండు ముఖ్య కారణాలని భావించరాదు. మొదట పల్కిన - **"పితుర్వచననిర్దేశాత్"** అనే కారణమే ప్రబలమైనది. శ్రీరామలక్ష్మణ భరతశత్రుఘ్నులనే నల్గురు మూర్తులుగా అవతరించడానికి గల కారణాన్ని తెలిపే మన పూర్వాచార్యులు- (1) పెద్దలు చెప్పినదానిని చిన్నవారు ఆచరించడమనే సామాన్య ధర్మాన్ని శ్రీరాముడు ఆచరించాడు. (2) శేషి విషయంలో శేషత్వమే స్వరూపమనే విశేష ధర్మాన్ని లక్ష్మణుడు ఆదరించి ఆచరించి చూపినవాడు. (3)అందులోను, చాలా గొప్పదైన పారతంత్ర్యాన్ని భరతుడు అనుష్ఠించి చూపించాడు. (4) భాగవతశేషత్వమే పరమధర్మమనే విషయాన్ని శత్రుఘ్నుడు తన అనుష్ఠానంలో చూపించాడు- అని పల్కి, శ్రీరాముడు ఆచరించిన సామాన్యధర్మాన్ని వివరించేటపుడు- **"పితుర్వచననిర్దేశాత్, విశ్వామిత్రస్య శాసనాత్, అగస్త్యవచనాచ్చైవ, భరద్వాజస్య శాసనాత్"** (తండ్రిమాటవల్ల, విశ్వామిత్రుని ఆజ్ఞవల్ల, అగస్త్యుని మాటవల్ల, భరద్వాజుని శాసనం వల్ల) ఇత్యాది ప్రమాణాలను ప్రదర్శించారు. శ్రీరాముడు చేసిన కార్యాలు అన్నీ పెద్దల నియమనాన్ని శిరసా వహించి చేసినవిగా గోచరిస్తాయి. మొదటి కార్యమైన తాటకవధను గమనిద్దాం. స్త్రీవధ మహాపాతకమని లోకంలో పలికే మాట శ్రీరాముడు తెలియనిది కాదుకదా! తెలిసినా, దీనిని చేయడం **"విశ్వామిత్రస్య శాసనాత్"**. కొందఱు ఒక మాట అంటారు - "శూర్పణఖకు చేసిన అంగభంగాన్ని తాటకకు చేసి, శూర్పణఖను వధించి ఉండవచ్చు కదా! ఆమెను ప్రాణంతో విడిచినందువల్ల కదా ఆమె లంకకు పోయి, రావణుని ప్రేరేపించి సీతాపహరణాది క్లేశాలను కల్గించింది. ఆమె ప్రాణాలను తీసి ఉంటే, ఏక్లేశం కల్గి ఉండేది కాదుకదా"- అని. ఇది వాస్తవమే. తాటకను వధించమని నియమించడానికి అక్కడ ఒక విశ్వామిత్రముని ఉన్నట్లుగా, పంచవటిలో శూర్పణఖను వధించమని అనడానికి ఏముని లేడుకదా! ఇక, చివరలో



గమనిస్తే, రావణుని సంహరించిన తరువాత, విభీషణాళ్వాన్, శ్రీరాముని అక్కడ లంకలో కొన్ని దినాలు ఉండి విశ్రమించమని వేడగా, **"న మే స్నానం బహుమతం వస్త్రాణ్యాభరణాని చ, తం వినా కైకయీ పుత్రం భరతం ధర్మచారిణమ్"** (ధర్మాన్ని అనుష్ఠించేవాడు, కైకేయి కుమారుడు అయిన ఆ భరతుడు లేకుండా నాకు స్నానం గాని, వస్త్రాలు గాని, ఆభరణాలు గాని అభిమతాలు కావు) అని పల్కి వెంటనే పుష్పకవిమానాన్ని ఎక్కి అయోధ్యకు బయలుదేరాడు. భరతాళ్వాన్ ఆర్తిని కూడ మఱచి భరద్వాజా శ్రమంలో భోజనాన్ని చేశాడు. ఇది ఎందువల్ల? అంటే, **"భరద్వాజస్య శాసనాత్"** అందువల్ల ప్రకృతంలో **"కైకేయ్యాః ప్రియకారణాత్"** అనేది అముఖ్యహేతువు; **"పితుర్వచననిర్దేశాత్"** అనేదే ప్రధానహేతువు.

**25. తం వ్రజంతం ప్రియో భ్రాతా లక్ష్మణోనుజగామ హ ।**

**28. సీతాప్యనుగతా రామం శశినం రోహిణీ యథా ।**

ఇక్కడ శ్రీరామునితో పాటుగా లక్ష్మణుడు ముందు బయలుదేరినట్లు, సీతాదేవి తరువాత బయలుదేరినట్లు తెలుపబడింది. తరువాత, అయోధ్యాకాండలో ఈ సంఘటన విరివిగా తెలుపబడింది. అక్కడ ముందు సీతాదేవి, తరువాత లక్ష్మణుడు శ్రీరాముని వెంట రావడానికి ప్రార్థించినట్లుగా చెప్పబడబోతున్నది. ఇందులో విరోధం ఉన్నది కదా ? అనే శంక అక్కఱలేదు. ఈ ఇద్దఱు శ్రీరామునకు అనుచరులయ్యారు- అనేదే ఇక్కడ వివక్షితార్థంగా గ్రహించాలి. దీనికి వేఱు విధమైన సమాధానం కూడా ఉన్నది. అది తరువాత తెలుపబడుతుంది.

**29. గుహ మాసాద్య ధర్మాత్మా నిషాదాధిపతిం ప్రియమ్ ।**
**గుహేన సహితో రామో లక్ష్మణేన చ సీతయా ॥**

అవాప్త సమస్త కాముడైన భగవానుడు ఈ **"ఇరుళ్ తరు మాఞాలమ్"** (అజ్ఞానాన్ని కలిగించే విశాలమైన భూలోకం) లోకి వచ్చి అవతరించడానికి గల కారణాన్ని గీతలోని **"పరిత్రాణాయ సాధూనామ్"** (మంచివారిని రక్షించడం కోసం) ఇత్యాది శ్లోకం తెల్పింది. దానిని పైపై గమనించకుండా, లోతుగా విమర్శించి చూచి మర్మాన్ని గ్రహించిన దివ్యసూరుల హృదయాన్ని తెలిసిన ఆచార్యులలో ప్రముఖులైన కూరేశులు **"ఆశ్రితజనాన్ సంశ్లేష్టుమ్ అవతరసి"** (భక్తులతో కలవడం కోసం అవతరిస్తావు) అని అద్భుతంగా పలికారు. అతనిని చూడాలని, చూచి తాకాలని, సంభాషించాలని ఆశపడే సంసారుల ఆర్తిని తీర్చడం అనేది ఒక వైపు ఉండగా, వీరితో కలసి మెలసి వర్తించి, తన ఆర్తిని తీర్చుకోవడంకోసమే భగవానుడు

ఇక్కడకు వచ్చి అవతరిస్తాడు- అనేది పైపైన స్ఫురించే ఆళ్వార్ల సూక్తిలోని భావం. ఇందులో కొందరికిగాని, పలువురికి గాని మనస్సు విప్రతిపత్తి కలుగవచ్చు. ఆ విప్రతిపత్తిని తీర్చే సందర్భాలు శ్రీరామాయణంలో చాలా ఉన్నాయి. వాటిలో ప్రధానమైనది ఈ సందర్భమని గ్రహించాలి. ఇక్కడ **"గుహేన సహితో రామః"** (గుహునితో కూడిన రాముడు) అనే ప్రయోగం ద్వారా శ్రీరాముడు గుహునితో కలిసాడు- అని తెలుపబడింది. ఇంతమాత్రమే ఇక్కడ చెప్పవలసినది. అయితే, ఇంతటితో నిలువలేదు. **(లక్ష్మణేన చ సీతయా)** అని కూడా చెప్పబడింది. గుహునితో కలవడం మాత్రమేకాదు, లక్ష్మణునితో కూడా కలిశాడు, సీతాదేవితో కూడా కలిశాడు- అని తెలుపబడింది. శ్రీరామునితోపాటు ఈ ఇద్దఱు (లక్ష్మణుడు, సీతాదేవి) అనుసరించి వచ్చారు- అనే విషయం పూర్వమే తెలుపబడింది. మళ్ళీ మళ్ళీ దానినే పల్కడం చర్వితచర్వణమే కాగలదు. కవిసార్వభౌముల కవితకు ఈ దోషం తగదు. ఇక్కడ నమ్బ్లిళ్ళె అనుగ్రహించే అర్థం ఏమంటే- శ్రీరాముడు గుహునితో కలసిన తరువాతనే, తన తమ్మునితో, సీతతో కలసి ఉన్నట్లుగా భావించాడు- అని. దీనిని (ఈ అర్థాన్ని) సుస్థాపించే ఒక సందర్భాన్ని చూపిస్తాను. **"గుహేన సహితో రామః"** అనేది మహర్షివాక్యమే తప్ప శ్రీరాముని వాక్యం కాదు. ఇపుడు శ్రీరాముని వాక్యం గమనించండి.

తరువాత అరణ్యకాండలో (18వ సర్గలోని 40వ శ్లోకంలో) **"కదాస్వహం సమేష్యామి భరతేన మహాత్మనా, శత్రుఘ్నేన చ వీరేణ త్వయా చ రఘునందన!"** (లక్ష్మణా! మహాత్ముడైన భరతునితో, వీరుడైన శత్రుఘ్నునితో, నీతోను నేనెపుడు కలువగలను) అనేది శ్రీరాముని సూక్తి. చిత్రకూటపర్వత చరియలకు వచ్చి, అక్కడ **"అముదమన్నమెన్ మొళి"** (అమృతంవంటి మృదువచనాలను) పల్కి, మనస్సును ఆనందింపజేసి తిరిగి వెళ్ళిన భరతుని గూర్చి భావించి, మనస్సులో బాధపడి కఱుగిన శ్రీరాముడు లక్ష్మణుని చూచి పల్కిన పైన ప్రస్తావించిన సూక్తియే "భరతునితో, శత్రుఘ్నునితో నేను తిరిగి ఎపుడు కలిసికోగలను?" అనేది. విశ్లేషించిన వారిని గూర్చి "వారిని ఎపుడు కలువగలను" అనేది సంభావితం. తనతో కలసి ఉండే వారిని "ఎపుడు కలువగలను?" అని అనడం సంభావితమేనా. మతికలత చెంది పల్కిన మాటగా కదా తోస్తుంది. **"త్వయా చ రఘునందన"** అనే చోట ఉండే చకారాన్ని అనుక్తసముచ్చాయకంగా గ్రహించి, "నీతో, సీతాదేవితో ఎపుడు కలువగలను?" అని వివరించి, **"భరతాళ్వానోడు కూడి యిరామైయాలే కూడి యిరుక్కిఱ సీతాలక్ష్మణర్కళిన్ సాహిత్యముమ్ అసత్కల్పమాక తోన్ఱుకైయాలే**



**ఇఱనే శొల్లలాయ్ న్ఱు"** (భరతాళ్వాన్‌తో కలసి ఉండలేనందువల్ల, తనతో కలసి ఉండే సీతాలక్ష్మణుల సాహచర్యం కూడా అసత్కల్పంగా (లేనిదానివలె) తోచడం చేత ఈ విధంగా చెప్పబడింది.) అనే వ్యాఖ్యానాన్ని చేశారు. ఇందువల్ల భక్తులతో కలసి వర్తించి ఆనందించడంలో భగవానునకు కల ఆర్తి అపరిమితమనేది తెలుస్తున్నది. ఈ ఆర్తిని తీర్చుకోవడంకోసమే అవతారాలను భగవానుడు ఎత్తుతాడని ఆళ్వార్లు పల్కడంలో అతిశయోక్తి కొంచెంకూడా లేదు.

### 30. తే వనేన వనం గత్వా

ఇక్కడ **"తే"** అని, **"వనేన"** అని రెండు పదాలుగా విభజించి, మధ్యలో గ్రామమో, నగరమో ఏదీ లేకుండా అడవి తర్వాత అడవిగా వన పరంపరలే ఉన్నవి అని చెప్పడం ఒక అర్థం. ఆ రీతిలో కాకుండా **"తేవనేన"** అనే దానిని ఒకే పదంగా గ్రహించి, **"తేవనమ్"** అనే పదానికి పాదసంచారమని అర్థం కనుక, పాదచారులై నడచి వెళ్ళారని కూడా వ్యాఖ్యానింపబడింది.

### 31. రమ్య మావసథం కృత్వా రమమాణా వనే త్రయః

ఇక్కడ **"త్రయః"** అనే పదం శ్రీరామలక్ష్మణ సీతాదేవులను తెల్పుతుంది. **"త్రయః రమమాణాః"** అని ముగ్గురు ఆనందాన్ని పొందినట్లు చెప్పబడే ఈ సూక్తిలో ఒక సందేహం కల్గుతుంది. శ్రీరామునకు, సీతాదేవికి పరస్పరసంశ్లేషం వల్ల ఆనందం కల్గడం సంభవం. లక్ష్మణుడు ద్వారపాలకుడై ఉండడమేకదా జరిగింది. **"సేవా శ్వవృత్తిః"** (సేవ అనేది కుక్కబ్రతుకు) అని నిందింపబడ్డ సేవావృత్తిలో ఉండే లక్ష్మణునకు ఆనందం కలిగే ప్రసక్తి ఏమున్నది ? **"త్రయః రమమాణాః"** (ముగ్గురు ఆనందిస్తున్నవారై) అని అనడం ఏవిధంగా? అనే సందేహానికి సమాధానం వినండి. ఆనందమనేది ఒక విధమైనదిగా ఉండదు. ఆనందం కాని, దుఃఖం కాని - వారి వారి బుద్ధిభేదాన్ని బట్టి వేఱ్ఱేరుగా ఉంటుంది. దివ్యదంపతులు ఇద్దరు కలసి ఉండే సన్నివేశంలో వారికి సేవను చేయడంవల్ల లక్ష్మణుడు పొందే ఆనందం దివ్యదంపతులు పొందే ఆనందంకంటే తక్కువ కాదు. ఇందుకు లోకంలోని ఒక దృష్టాంతాన్ని గమనించండి. కొన్ని పాయసభక్ష్యాదులను తిని పొందే ఆనందాన్ని కొందఱు చారు, మోరు భుజించి పొందడం చూస్తున్నాము. వేయి రూపాయలు, పదివేల రూపాయలు పొంది మహాధనికులు పొందే ఆనందాన్ని పది, ఇరవై రూపాయలను పొంది అకించనుడైన దరిద్రుడు పొందడం చూస్తున్నాము. అందువల్ల కైంకర్యాన్ని చేయడంకోసం వచ్చిన

లక్ష్మణునకు ఏమి ఆనందం? అని అడుగరాదు. **"ఎన్నెళ్జినాల్ నోక్కి క్కాణిర్"** (నా మనస్సుతో గమనించి చూడండి) అనే రీతిలో వారి వారి మనస్సుతో చూచి కదా వారి వారి ఆనందాలలోని వ్యత్యాసాలను తెలియాలి అందువల్ల **"రమమాణాः వనే త్రయः"** అనే మాటలో ఏ కొఱత లేదు. ఆనందతారతమ్యవాదులు అని కొందఱు అన్యమతవాదులున్నారు. భగవద్రామానుజదర్శనానికి చెందిన మనం ఆ వాదాన్ని అంగీకరించము. దానికి ఈ శ్లోకం ఒక ప్రమాణం.

**38. స కామ మనవాప్యైవ రామపాదా వుపస్పృశన్ ।**
**నందిగ్రామేకరోద్రాజ్యం రామాగమనకాంక్షయా ॥**

భరతాళ్వాన్ తన మనోరథం నెఱవేరనందున తిరిగి వెళ్ళిపోయాడు- అని ఈ శ్లోకంలో తెలుపబడుతున్నది. తరువాత, అయోధ్యాకాండ 113వ సర్గలోని 1వ శ్లోకంలో **"ఆరురోహ రథం హృష్టः శత్రుఘ్నేన సమన్వితः"** (ఆనందించిన భరతుడు శత్రుఘ్ననితో కలసినవాడై రథాన్ని అధిరోహించాడు) అని సంతుష్టుడై తిరిగి వెళ్ళినట్లు చెప్పబడుతున్నది. మనోరథం నెఱవేరనివానికి సంతోషం ఏవిధంగా కల్గుతుంది? అనే శంక కలుగవచ్చు. భరతుని మనోరథం సిద్ధించకపోవడం వాస్తవం. సంతోషం కల్గడంకూడా వాస్తవమే. ఏవిధంగా? అంటే, శ్రీరాముని తిరిగి అయోధ్యా నగరానికి తీసికొనివచ్చి, పట్టాభిషేకం జరపాలనే తన మనోరథం నెఱవేరలేదు. లక్ష్మణునివలె తానుకూడా అనుచరకింకరుడై వెళ్ళాలనే మనోరథం కూడా సిద్ధించలేదు. అందువల్ల **"స కామ మనవాప్యైవ"** (అతడు కోరికను పొందకుండానే) అనే సూక్తి పొసగుతుంది. ఇక, **"ఆరురోహ రథం హృష్టः"** (సంతోషించినవాడై రథాన్ని అధిరోహించాడు) అని పలికే రీతిలోని హర్షం ఏవిధంగా కల్గింది? - అని అంటే, లక్ష్మణునివద్ద శేషత్వం మాత్రం ఉన్నది తప్ప, దానికంటే మిక్కిలి గొప్పదైన పారతంత్ర్యం లేదు. అయోధ్యలో ఉండి తల్లిదండ్రులకు సేవచేస్తూ ఉండమని పలుమార్లు నియమించినా, ఆ మాటకు అంగీకరించలేదు- అనే మాట సుప్రసిద్ధం. కైంకర్యాన్ని చేయాలి- అనే ఆశమాత్రం ఉన్నది తప్ప, శేషి మెచ్చిన కైంకర్యాన్ని చేయాలి- అనే స్వరూప జ్ఞానపూర్తి లక్ష్మణునివద్ద లేదు. **"శేషత్వ- భోక్తృత్వజ్ఞళ్ పోలట్టే పారతంత్ర్య- భోగ్యతైకళ్"** (శేషత్వ, భోక్తృత్వాలవంటివి కాదు కదా, పారతంత్ర్య, భోగ్యతలు) అనే ఆచార్యహృదయచూర్ణికవల్ల పారతంత్ర్యం యొక్క వైలక్షణ్యం తెలియాలి. తిరుప్పాణ్ ఆళ్వార్లకు మునివాహనులని తిరునామం. లోకసారంగమహాముని తమ భుజాలపై ఎక్కి కూర్చొనవలసినదిగా తిరుప్పాణ్ ఆళ్వార్లను ప్రార్థించినపుడు, వారు దానికి అంగీకరించవచ్చునా? వారిని చూస్తే,



(లోకసారంగమును) సన్యాసి. వీరిని చూస్తే, వైచ్యం భావించనక్కరలేకుండా సహజమైన నైచ్యాన్ని కలవారు. ఇటువంటివారు లోకసారంగముని మాటను కాదని, దూరంగా పోవలసి ఉండగా, వారి భుజాలపైకి ఎక్కి కూర్చుని ఉండడం - అచిత్తుతో సమానమైన పారతంత్ర్యాన్ని అనుసంధించినందువల్లనే కదా! దీనిని ఈ ఆళ్వార్లే స్వయంగా **'అడియార్క్కెన్నై ఆళ్పడుత్త విమలన్"** (తన దాసులకు నన్ను దాసునిగా చేసిన విమలుడు) అనే పాశుర ప్రయోగంలో అందంగా పొదిగారుకదా! భరతాళ్వాన్ ఈ పారతంత్ర్యాన్ని అరుదైన ఫలంగా భావించి హృష్టులయ్యారు అనేది చాలా పొసగుతుంది. తమకు రాజ్యాధిపత్యం లభించినందున హృష్టులయ్యారు - అని కొందరు అర్థం పల్కడం భరతాళ్వాన్ ప్రకృతికి కొంచెం కూడా పొసగదు. **'అరశమర్న్దానడి శూడు మరశైయల్లాల్ అరశాక ఎణ్ణేన్ మన్నరశుదానే'** అనే కులశేఖరాళ్వార్లు పల్కిన రీతిలో స్వరూపానురూపమైన రాజ్యం లభించినందున హృష్టులయ్యారు-అనేదే చాలా ఉచితం.

**41. ప్రవిశ్యతు మహారణ్యం రామో రాజీవలోచనः ।**
**విరాధం రాక్షసం హత్వా శరభంగం దదర్శ హ ॥**

శ్రీరాముడు చిత్రకూటంనుండి బయలుదేరి దండకారణ్యాన్ని చేరాడని ఇంతకుముందు తెలుపబడింది. ఇక్కడ **"ప్రవిశ్య స మహారణ్యమ్"** అని చెప్పవచ్చు. **"తు"** అనే పదాన్ని ప్రయోగించడం శాస్త్రరీతిలో అర్థపుష్కలం. పూర్వం ఉన్న ఆశకంటే వ్యావృత్తిని **"తు"** అనే పదం సూచిస్తుంది. ఆ వ్యావృత్తిని **"రాజీవలోచనः"** అనే విశేషణపదం చాలా విశదం చేస్తున్నది. **"రాజీవలోచనः"** అని శ్రీరామునకు విశేషణంగా ప్రయోగించడం శ్రీరామాయణంలో పలు సందర్భాలలో కన్పిస్తుంది. ఇది స్వభావోక్తి అని భావించరాదు. ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క విధమైన భావాన్ని వ్యక్తం చేసి, అర్థస్వారస్యాన్ని ఇస్తుంది. పూర్వం **"ఊనషోడశవర్షో మే రామో రాజీవలోచనः"** (తామరపూలవంటి నేత్రాలను కల్గిన నా రాముడు పదహారు సంవత్సరాలు నిండనివాడు) అనే చోట అద్భుతమైన అర్థాన్ని కల్గినది, ఈ పదం. నిశాచరులను సంహరించి యాగాన్ని రక్షించడంకోసం శ్రీరాముని తనతో పంపమని వేడిన విశ్వామిత్రమహర్షికి దశరథచక్రవర్తి సమాధానం పలికే ఈ శ్లోకంలో **"రాజీవలోచనः"** అనే పదం "ఓ మునివర్యా! మీ యాగానికి ఆటంకాన్ని కల్గించే వారు నిశాచరులు, వారు రాత్రిలో వచ్చి, బాధిస్తారు నా రాముడు సూర్యుడు అస్తమిస్తే నిద్రపోతాడు. అతడు కళ్ళను తెఱచినవాడై ఈ నిశాచరులతో ఏవిధంగా యుద్ధాన్ని చేయగలడు?'' అనే భావాన్ని కల్గినది, ఈ పదం. రాజీవమంటే

తామరపూవు. అది, సూర్యుడు అస్తమించగానే ఏవిధంగా ముడుచుకొని పోతుందో, ఆ విధంగా నిద్రించే బాల్యాన్ని కలవాడు, శ్రీరాముడు- అని ఈ పదంద్వారా తెలుపబడింది. **"ప్రవిశ్య తు మహారణ్యం రామో రాజీవలోచనః"** (తామరపూలవంటి నేత్రాలను కల్గిన రాముడు మహారణ్యాన్ని ప్రవేశించి) అనే ప్రకృత సందర్భంలో అయితే, ఇపుడు ఇరవై అయిదేండ్ల వయస్సులో ఉండే శ్రీరామునకు ఈ అర్థాన్ని చెప్పరాదు. మఱి ఏమి అర్థం? అంటే, అయోధ్యాకాండలో వనవాస నియమం ఏర్పడిన తరువాత లక్ష్మణుని చూచి శ్రీరాముడు పలికేటపుడు **"మా చ లక్ష్మణ! సంతాపం కార్షీః లక్ష్మ్యా విపర్యయాత్, రాజ్యం వా వనవాసో వా వనవాసో మహోదయః"** (లక్ష్మణా! రాజ్యలక్ష్మిని కోల్పోయాము - అని దుఃఖపడకు. రాజ్యమైతే ఏమి? వనవాసమైతే ఏది? నిజానికి వనవాసమే గొప్పది.) అని అన్నాడు. "తమ్ముడూ! రాజ్యలక్ష్మిని కోల్పోవలసి వచ్చిందే! అని బాధపడకు. రాజ్యం లభిస్తే ఏమి ? వనవాసం లభిస్తే ఏమి? రెండు మనకు సమానమే'' అని మొదట పల్కి, వెంటనే కొంచెం విమర్శించి చూస్తే, "రెండిటిని సమానంగా భావించడం తగనే తగదు. వనవాసం మనకు అరుదైన ఫలం సుమా!'' అని అన్నాడు. అది మనసార పల్కిన మాటయేనా? అనే సందేహాన్ని తీర్చేటట్లుగా మహారణ్య ప్రవేశం సంభవించగానే శ్రీరాముని మనస్సు లోపల పొంగే సంతోషం కంటిలో దర్శించేటట్లుగా అయినది- అనే విషయాన్ని **"రాజీవలోచనః"** అనే పదం తెల్పుతున్నది. మహర్షుల పాదసేవ, వారి విరోధుల నిరసనం -అనే మహాభాగ్యం లభిస్తున్నదే- అని శ్రీరాముని నేత్రాలు వికసించాయి.

**(విరాధం రాక్షసం హత్వా శరభంగం దదర్శ హ)-** ఇది **"పాణిపాదౌ ప్రక్షాళ్య ఆచమ్య"** (చేతులను కాళ్ళను కడిగికొని, ఆచమనం చేసి) అనే నియమంవలె అమరింది. ఆచమనానికి కాళ్ళను చేతులను కడిగిపోవడం అంగమైనట్లు (పూర్వకృత్యం అయినట్లు) శరభంగమహర్షి దర్శనానికి విరాధవధ అంగానుష్ఠానం వంటిది. **"రిక్తహస్తస్తు నోపేయాత్ రాజానం దైవతం గురుమ్"** (రిక్తహస్తాలతో - ఏ బహుమానాన్ని తీసికొనిపోకుండా - రాజుదగ్గరకు, దైవంవద్దకు, గురువువద్దకు పోకూడదు) కనుక, శరభంగమహర్షిని దర్శించడానికి విరాధప్రేతాన్ని కానుకగా చేసి వెళ్ళాడు శ్రీరాముడు- అని ప్రకృతంలో తాత్పర్యం.

**43. వసతస్తస్య రామస్య వనే వనచరైస్సహ ।**
**ఋషయోభ్యాగమన్ సర్వే వధాయాసుర రక్షసామ్ ॥**



**45. ప్రతిజ్ఞాతశ్చ రామేణ వధ స్సంయతి రక్షసామ్ ।**

శ్రీరాముడు దండకారణ్యంలో నివసించేటపుడు అతని దగ్గరకు మహర్షులు వచ్చి రాక్షసుల వధను చేయాలని శరణాగతి చేశారని, శ్రీరాముడు ఆ విధంగానే వధించడానికి ప్రతిజ్ఞను చేసినట్లు ఇక్కడ తెలుపబడింది. ఇంతకుముందే చేశాడని దేవతలు రావణుని వధను చేయమని ప్రార్థించినట్లుగా **"స హి దేవైరుదీర్ణస్య రావణస్య వధార్థిభిః అర్థితో మానుషే లోకే జజ్ఞే విష్ణు స్సనాతనః"** (మిక్కిలి మధించిన రావణుని వధను కోరే దేవతలచేత ప్రార్థింపబడినవాడై సనాతనుడైన విష్ణువు మానవలోకంలో అవతరించాడు) (అయోధ్యా-1-7) అనే శ్లోకం తెల్పుతున్నది. దేవతలు గాని, మహర్షులు గాని తమను కాపాడమని ప్రార్థించడం యుక్తమే కాని, ఇతరును వధించమని నోరు తెఱచి పల్కవచ్చునా ? ఇతరువల్ల తమకు కల్గని రీతిలో చేయమని ప్రార్థించడం కదా తగినది. తరువాత, అరణ్యకాండలో **'తే వయం భవతా రక్ష్యా"** (అటువంటి మేము నీచే రక్షింపబడవలసినవారము) అని, **"రక్షితవ్యాః త్వయా శశ్వత్ గర్భభూతా స్తపోధనాః"** (తపోధనులు తల్లి కడుపులో బిడ్డవంటివారు, వారు నీచేఎల్లప్పుడు రక్షింపబడదగినవారు) అని పల్కినట్లే, ఇతరుల వధను ప్రస్తావించకుడా, తమను రక్షణనుగూర్చి మాత్రం ప్రార్థిస్తే చాలదా ? శ్రీరాముడు కూడా ఆరీతిలోనే "మిమ్ములను నేను రక్షిస్తాను''అని వాగ్దానం చేస్తే చాలు కదా ! **"ప్రతిజ్ఞాతం చ రామేణ వధ స్సంయతి రక్షసామ్"** అనే విధంగా రాక్షసవధను చేస్తాను అని పల్కనక్కరలేదు కదా ! ఇతరులను వధించకుండా దేవతలను, మహర్షులను రక్షించాలని భావిస్తే సర్వశక్తి అయిన భగవానునకు ఇది చేయరాని పని కాదు కదా !- అని ఈ రీతిలో కొందఱు ప్రశ్నలు అడుగవచ్చు. **"దేవానాం దానవానాం చ సామాన్యమధిదైవతమ్"** (దేవతలకు, రాక్షసులకు కూడా సమానమైన దైవం) అని, **"సుహృదం సర్వభూతానామ్"** (ప్రాణులన్నిటియొక్క మంచినికోరే స్నేహితుడు) అని, **"సమోహం సర్వభూతేషు"** (అన్ని ప్రాణుల పట్ల నేను సమానుడను) అని ప్రసిద్ధిపొందిన భగవానుడు రాక్షసవధను చేస్తానని ప్రతిజ్ఞ చేయడంలోని తాత్పర్యం ఏమంటే- సాధ్యమైనంతవరకు వేచి చూచి, చివరకు వధించవలసి వస్తే చేస్తానని అనడం మాత్రమే. దేవతలు, ఋషులు రాక్షస వధ కోసం ప్రార్థనను చేయడం - రాక్షసులవల్ల తమకు సంభవించిన, సహించలేని క్లేశాతిశయాన్ని చూపడం మాత్రమే, అంతే. **"హన్యా మహ మిమాం పాపాం కైకేయీం దుష్టచారిణీమ్"** (పాపాత్మురాలు, దుష్టచరిత్రను కల్గినది అయిన ఈకైకేయీని నేను వధిస్తాను) అని భరతాళ్వాన్ తల్లిని వధిస్తానని అనడం తన సహించలేని

వేదనను తెలుపడం కోసం మాత్రమే, అంతే తప్ప, వేఱేమీ భావం లేదు కదా ! **"భరతో వధ్య ఏవ మే"** (నా అభిప్రాయంలో భరతుడు వధించదగినవాడే), **"భరతస్య వధే దోషం నాహం పశ్యామి రాఘవ"** (శ్రీరామా భరతుని వధించడంలో నాకు ఏ దోషం కన్పించడంలేదు) అని చిత్రకూటంలో శ్రీరాముని చూచి లక్ష్మణుడు కోపంతో పల్కడంకూడా ఇదే రీతిలో అర్థాన్నే కదా ఇస్తుంది. **"హనిష్యామి సబాంధవమ్"** (బంధువులతోసహా వధిస్తాను) అని సుగ్రీవ మహారాజుకు శ్రీరాముడు పంపిన మాటకూడా ఇదే భావాన్ని కల్గినది కదా ! **"వధ్యతా మేష తీవ్రేణ దండేన సచివై స్సహ"** (మంత్రులతో పాటుగా ఇతడు తీవ్రమైన దండనతో వధింపబడుగాక) అని శరణాగతుడైన విభీషణుని విషయంలో సుగ్రీవమహారాజు పల్కిన మాటకూడా సంరంభాతిశయాన్ని ప్రదర్శించడంలోని తాత్పర్యాన్ని తెల్పుతుందికదా ! **"మయైవైతే నిహతాः పూర్వమేవ"** (నాచేత ఇంతకుముందే వీరు వధింపబడ్డారు) అని గీతాచార్యుడు పల్కడంకూడా ఇక్కడ గమనించదగినది.

**56. స చాస్య కథయామాస శబరీం ధర్మచారిణీమ్ ।**
**శ్రమణీం ధర్మనిపుణా మభిగచ్ఛేతి రాఘవమ్ ॥**

ఇది కబంధుని మాట. ఇందులో శబరి ధర్మచారిణి- అని, ధర్మనిపుణ- అని విశేషింపబడింది. ఇక్కడ వివక్షితమైన ధర్మం ఏది? - అని పరిశీలించి చూచినపుడు, ఆచార్యశుశ్రూష, ఆచార్యాభిమానం -అనబడే ఉత్తమోత్తమ ధర్మమేనని తెలుస్తుంది. తరువాత, ఆరణ్యకాండ చివరలో శ్రీరాముడు శబరి ఆశ్రమంలో ప్రవేశించి, ఆమెను కుశలప్రశ్నలను అడిగేటపుడు, **"కచ్చిత్తే గురుశుశ్రూషా సఫలా చారుభాషిణి!"** (చక్కగా మాట్లాడే ఓ శబరీ ! నీగురు శుశ్రూష సఫలమైనది కదా !) అని ప్రశ్నించాడు. ఇక్కడ **"చారుభాషిణి"** అనే సంబోధన ఆమె మాట మాధుర్యంలో శ్రీరాముడు చాలా చాలా అభినివేశాన్ని పొందిన విషయాన్ని తెల్పుతుంది. ఆ వాఙ్మాధుర్యాన్నిబట్టే ఆమె ఆచార్యశుశ్రూషలో బాగా పండినది- అనే విషయాన్ని శ్రీరాముడు తెలిసికొన్నాడు. ఆమె సమాధానాన్ని పలికేటపుడు కూడా **"చక్షుషా తవ సౌమ్యేన పూతాస్మి రఘునందన!, పాదమూలం గమిష్యామి యానహం పర్యచారిషమ్"** (ఓ శ్రీరామా ! నీ చల్లని చూపుతో నేను పవిత్రురాలను అయ్యాను. ఇక నేను శుశ్రూష చేసిన నా ఆచార్యుల శ్రీచరణ సన్నిధిని చేరగలను) అని అంటూ తాను ఆచార్యసేవను చేసిన విషయాన్ని పల్కడంవల్లకూడా శబరి ఆచరించిన ధర్మం ఇదే- అని అనడంలో అడ్డు లేదు.



ప్రాసంగికమైన ఒక సంతోషసూచనను గమనించండి. పూర్వం ప్రస్తావించిన **"చక్షుషా తవ సౌమ్యేన పూతాస్మి రఘునందన!"** అనే శ్లోకంలోని ఉత్తరార్ధం **"గమిష్యామ్యక్షయాన్ లోకాన్ త్వత్ప్రసాదాదరిందమ"** (శత్రువులను నిర్జించే శ్రీరామా ! నేను నీ అనుగ్రహంవల్ల నశించని లోకాలైన పరమపదానికి వెళ్ళగలను) అనే మాటిన పాఠం పలు ప్రతులలో కన్పిస్తున్నది. గోవిందరాజస్వామి వారు కూడా ఈ మాటిన పాఠాన్నే వ్యాఖ్యానించారు- అనే విషయాన్ని గమనించి బాధ కల్గింది. ఆ గోవిందరాజులే **"ధర్మచారిణీమ్"** అనే ప్రకృతస్థలంలో **"పాదమూలం గమిష్యామి. ఇతి లక్ష్మణత్వాత్"** అని వివరించినందున చాలా సంతోషించాను.

**57. సోభ్యగచ్ఛన్మహాతేజా శ్శబరీం శత్రుసూదనః ।**
**శబర్యా పూజిత స్సమ్యక్ రామో దశరథాత్మజః ॥**

**(సః శబరీమ్ అభ్యగచ్ఛత్)-** శబరిని గూర్చి ఇతఃపూర్వమే పల్కిన కబంధుని వాక్యంలో **"అభిగచ్ఛ"** అని ఉండడం, ఇక్కడ **"అభ్యగచ్ఛత్"** అని మహర్షివాక్యంలో ఉండడం నిశితంగా గమనించదగినది **"శ్రమణీం ధర్మనిపుణాం అవేక్షస్వ"** అని కాని, **"కటాక్షయ"** అని కాని కబంధుడు పల్కి ఉండవచ్చు. ఇక్కడ కూడా **"స ప్రాప శబరీం రామः"** అని కాని, **"స శబర్యాశ్రమం ప్రాప"** అని కాని పల్కి ఉండవచ్చు. ఈ రీతిలో కాకుండా, **"అభిగచ్ఛ"** అని అతడు పల్కడం, **"అభ్యగచ్ఛత్"** అని మహర్షి పల్కడం సామాన్యమైనది. ఒక దేవతావిశేషంలో చేసే సేవను అభిగమనం- అని అనడం సంప్రదాయం. అంతరంగప్రతిపత్తితో దరిచేరడం అభిగమన మనబడుతుంది. అటువంటి అభిగమనానికి తగిన విలక్షణ వ్యక్తి శబరి- అని దీనివల్ల తెలుస్తున్నది. ఇక్కడ **"మహాతేజాः"** అని, **"శత్రుసూదనః"** అని శ్రీరామునకు రెండు విశేషణాలను ప్రయోగించడం పాదపూరణంకోసం కాదు. సాభిప్రాయకం. శబరి ఆశ్రమ సమీపానికి వచ్చేటపుడే శ్రీరాముని ముఖం చాలా తేజస్సును కల్గినది- అనేది **"మహాతేజాः"** అనే పదంద్వారా స్ఫురిస్తున్నది. "చరమపర్వనిష్ఠను చూడబోతున్నాను" అనే ఆనందముఖంలో తెలిసేటట్లుగా ఉన్నది. ప్రథమపర్వ నిష్ఠలైన భగవద్భక్తులను చూడడం అరుదు కాదు. చరమపర్వనిష్ఠలబడే ఆచార్యశుశ్రూషానిరతులను, ఆచార్యాభిమాన పాత్రభూతులను దర్శించగల్గడం గొప్ప తపఃఫలమని అంటారు. దీనికి పిమ్మట **"శత్రుసూదనః"** అనే పదం ప్రయోగింపబడింది. ఆ శబరికి ప్రాప్తి ప్రతిబంధకాలైనవి కొన్ని ఉన్నాయని, ఆమె పల్కినమాటలను బట్టి తెలుస్తున్నది. కనుక, ఆ విరోధి నిరసనాన్ని తన కటాక్షవీక్షణంతో చేయాలని శ్రీరాముడు సంకల్పించాడు- అని దీని తాత్పర్యం.

దీనికి తరువాత **"శబర్యా పూజితః సమ్యక్ రామః"** (శ్రీరాముడు శబరిచే చక్కగా ఆరాధింపబడ్డాడు) అనే ప్రయోగాన్ని కొంత విచారణ చేయవలసి ఉన్నది. శ్రీరామాయణంలోను, కంబరామాయణంలోను శ్రీరాముడు శబరివద్దకు వచ్చి ప్రవర్తించిన వృత్తాంతం విశేషంగా తెలుపబడకపోయినా, ఇతర రామాయణాలలో ఉండేదానినిబట్టిగాని, ఇక్కడ **"శబర్యా సమ్యక్ పూజితః"** అనే ప్రయోగాన్ని లోతుగా పరిశీలించి గాని మన పూర్వాచార్యులు పల్కిన విషయం ఏమంటే- శ్రీవచన భూషణం 233వ సూత్రంలో **"పెరుమాళ్ శబరి కైయాలే అముదు శెయ్దరుళినార్"** (శ్రీరాముడు శబరిచేతితో ఆరగించాడు) అనే చోట వ్యాఖ్యానంలో శ్రీవరవర మునులు **"రఘుకులతిలకరాయ్, ఆచార ప్రధానరాన పెరుమాళ్", "శబర్యా పూజితః సమ్యగ్రామో దశరథాత్మజః"** ఎన్నుమ్బడి వేడువిచ్చియాయ్వైత్తే **గురుశుశ్రూషైయిలే పళ్గుత్త జ్ఞానాధికైయాయ్, త్తన్ నావుక్కు ఇనిదాయిరున్ద ఫలమూలాదికళెల్లామ్ ఇజ్ఞుత్తైక్కెన్ట్టు సంచయిత్తుక్కొణ్డు వరవు పార్త్తిరున్ద శ్రీశబరి, తన్ ఆదరానుగుణరూపమాక త్తన్ కైయాలే అముదుశెయ్యప్పణ్ణ, అతిసంతుష్ట రాయ్ అముదుశెయ్దార్"** (రఘుకులశ్రేష్ఠుడై, ఆచారాన్ని ప్రధానంగా కల్గిన శ్రీరాముడు, ''దశరథుని కుమారుడైన రాముడు శబరిచేత చక్కగా పూజింపబడ్డాడు'' అనేరీతిలో, కోయవనిత అయిన, గురుసేవలో బాగా పరిణతిని పొందిన జ్ఞానాధికురాలై, తన నోటికి తియ్యగా ఉండే ఫలమూలాదులను అన్నిటిని ''శ్రీరామునికోసం'' అని సేకరించుకొని, అతని రాకకోసం వేచియుండే శ్రీశబరి, తన అదరానికి అనుగుణంగా తనచేతితో తినిపించగా, మిక్కిలి సంతోషించిన వాడై ఆరగించాడు) అని పల్కిన శ్రీసూక్తులు విశేషించి అనుసంధేయాలు. ఇందులో **"తన్ నావుక్కు ఇనిదాయిరున్ద"** (తన నోటికి తియ్యగా ఉండే) అనే మాటను శ్రీవరవరమునులు మూల ప్రమాణం ఏమీ లేకుండా పలికారు. **"పూర్వే పూర్వేభ్యో వచ ఏతదూచుః"** (పూర్వులవల్ల పరంపరగా లభించిన ఈ మాటను పెద్దలు పల్కుతారు) అనే వేదం పల్కిన ప్రబలప్రమాణం ఉండే ఉంటుంది. దీనిని బట్టే గోవిందరాజీయ వ్యాఖ్యానకారులు కూడా **"రామ స్సమాగమిష్యతీతి స్వాదూని ఆస్వాద్యాస్వాద్య పరీక్ష్య నిక్షిప్తవతీ- ఇతి ప్రసిద్ధిః"** (శ్రీరాముడు రాబోతున్నాడని రుచికరాలైన ఫలమూలాదులను ఆస్వాదించి, ఆస్వాదించి పరీక్షించి, దాచి ఉంచింది - అని ప్రసిద్ధి) అని వ్రాశారు. ఈ అర్థాలు అన్నీ **"సమ్యక్"** అనే ప్రయోగంలో అణగి ఉన్నాయి. పూర్వం, శరభంగముని, అగస్త్యముని మొదలైనవారు చేసినది సామాన్యమైనపూజ. ఇదే శ్రీరాముని అభిప్రాయానుసారం సమ్యక్ పూజ- అనేటట్లున్నది.



వేదాంతదేశికులు దయాశతకంలో **"నిషాదానాం నేతా కపికులపతిః కాపి శబరీ"** (నిషాదులకు అధిపతి అయిన గుహుడు, వానర రాజైన సుగ్రీవుడు, అద్వితీయ వైభవాన్ని కల్గిన శబరి) అని అంటూ శ్రీరామావతారంలో విశేషాను గ్రహానికి పాత్రులైన వ్యక్తులు ముగ్గురిని ప్రస్తావించేటపుడు గుహుని, శబరిని ప్రస్తుతించారు. ఈ ఇరువురికి గల భేదాన్ని కొంచెం గమనిద్దాం. శబరితో శ్రీరాముడు ఇంతగా కలసివర్తించడానికి గల కారణమేమి? అని ఆలోచించినపుడు, గుహునిపట్ల శ్రీరాముడు ప్రవర్తించిన రీతిని గమనించాలి. గుహుడు కొన్ని భోజ్యపదార్థాలను తీసికొనివచ్చి ఇచ్చి, వీటిని ఆరగించాలి- అని శ్రీరాముని ప్రార్థించాడు. దానికి శ్రీరాముడు పల్కిన సమాధానం **"యత్పిదం భవతా కించిత్ ప్రీత్యా సముపకల్పితమ్, స్వయం తదనుజానామి న హి వర్తే ప్రతిగ్రహే, అశ్వానాం భూతనే నాహ మర్థీ నాన్యేన కేనచిత్, ఏతావదత్ర భవతా భవిష్యామి సుపూజితః"** (నేను ఈ వనవాసంలో ఎవరివద్ద దేనినీ పరిగ్రహించకూడదు. అనే వ్రతాన్ని స్వీకరించాను. నేను ఏ రథంలో వచ్చానో, ఆ రథం ఇంకా అయోధ్యకు తిరిగి పోనందువల్ల గుఱ్ఱాలు చాలా దాహంతో ఉన్నాయి. వాటికి కావలసిన ఆహారాన్ని నేను కోరుతున్నాను) అని పల్కి వాటిని తాను పరిగ్రహించకుండానే వదలివేశాడు. శ్రీరాముడు. ఇక్కడ శ్రీరాముడు **"న హి వర్తే ప్రతిగ్రహే"** (నేను దానాన్ని గ్రహించకూడదనే వ్రతాన్ని స్వీకరించాను) అనేది అవశ్యం చెప్పవలసిన వాక్యమా! గుహుడు మధుపర్కం మొదలైన కొన్ని భోజ్యవస్తువులను తీసికొని వచ్చాడే తప్ప, ధనధాన్యవస్త్రాదులను దేనినీ ఇవ్వడం కోసం రాలేదు. వాటిని తీసికొనివస్తే అపుడు ''నేను పరిగ్రహించడం లేదు'' అని పల్కి, తిరస్కరించడంలో న్యాయమున్నది. తేనె మొదలైన అరణ్యక భోజ్యవస్తువులనే ఇవ్వాలని వచ్చినపుడు **"న హి వర్తే ప్రతిగ్రహే"** అని పల్కి తిరస్కరించడం తప్పక గమనించదగినది కదా ! గుహుని వద్ద ఈ పల్కిన ఇతడే శబరి వద్ద కాదనకుండా **"అర్చితోస్మి భవతా"** అని పల్కి, ఆమె సమర్పణను ఆదరించి స్వీకరించాడు.

పూర్వం ప్రస్తావింపబడిన శ్రీవచనభూషణవ్యాఖ్యానసూక్తిలో **"గురు శుశ్రూషైయిల్ పళ్గుత్తు జ్ఞానాధికైయాయ్"** (ఆచార్య సేవలో పండి, జ్ఞానాధికురాలై) అని శ్రీవరవరమునులు మర్మంగా అనుగ్రహించడం మర్మమైన విషయం. శబరివద్ద చాలా గొప్పదైన ఒక ధర్మం గురుశుశ్రూష అనేది ఉన్నది. దానిని కబంధుడు శ్రీరామునకు తెలియజేశాడు. **"శ్రమణీ శబరీ నామ కాకుత్స్థ! చిరజీవినీ, త్వాం తు ధర్మే స్థితా నిత్యమ్"** (సన్యాసిని, చిరంజీవిని, ధర్మాన్ని నిత్యం స్థిరంగా ఆచరించేది

అయిన శబరి నిను చూడగోరుచున్నది) అనే కబంధుని మాటలలో ధర్మశబ్దంద్వారా వివక్షితం గురుశుశ్రూషయే. శ్రీరాములుకూడా శబరిని చూడగానే క్షేమాన్ని గూర్చి అడిగేటపుడు **"కచ్చిత్తే గురుశుశ్రూషా సఫలా చారుభాషిణి!"** అని అంటూ "నీ గురుశుశ్రూష నెఱవేరిందా?'' అని అడిగాడు. ఆమెకూడా తాను చేసిన గురుశుశ్రూషనుగూర్చి ఆనందంగా సమాధానం పల్కింది. "ఇక్కడ నా సపర్యలను గ్రహించిన ఆచార్యులు పరమపదాన్ని చేరారు. వారి పాదసమీపానికి వెళ్ళడానికి నాకు నీవు అనుమతిని ఇవ్వాలి.'' అని కోరింది. ఇటువంటి ధర్మం గుహునివద్ద లేనందువల్లనే అతడు ఇచ్చిన భోజ్యవస్తువులను అంగీకరించలేదు- అని అంటారు, పూర్వాచార్యులు. ఆర్జవగుణం మూర్తీభవించిన శ్రీరాముడు గుహుని వద్ద **"న హి వర్తే ప్రతిగ్రహే"** అని అనడం కపటంకదా ! ఇది తగునా ? అనే సందేహం మిగిలి ఉన్నది. దీనికి సమాధానాన్ని వినండి. ఈ మాటకు "నేను ఎవరివద్ద దేనిని పరిగ్రహించను'' అనే అర్థాన్నే చెప్పాలనే నిర్బంధం లేదు. నీవద్ద పరిగ్రహించడంలో నాకు ఉద్దేశ్యం లేదు- అని పల్కినట్లుగా కూడా ఆ మాటలకు అర్థం స్ఫురిస్తుంది. ఆ విధంగా ఉద్దేశ్యం లేకపోవడానికి కారణం పూర్వం వివరింపబడినదే.

శ్రీవేదాంతదేశికులు సంకల్పసూర్యోదంలోని ఆఱవ అంకంలో, వివేకుడు ఆనందంగా పాడుతూ వచ్చి, అద్భుతమైన ఒక శ్లోకాన్ని రచించాడు. **"భగవతి భరద్వాజే భుక్తి స్తథా శబరీకరే"** (భగవానుడైన భరద్వాజుని ఆశ్రమంలోను, అదేవిధంగా శబరిచేతితోను భుజించాడు) అనేది అందులోని మొదటి పాదం. **"జయతి లలితోత్తుంగా వృత్తిర్దశాస్యరిపో రితి"** (రావణుని వధించిన శ్రీరాముని మనోహరమై, ఉన్నతమైన శీలం సర్వోత్కర్షతో ప్రకాశిస్తున్నది) అనేది చివరి పాదం. శ్రీరాముని నడవడికలను విమర్శించి చూస్తే గొప్పదైన చరిత్రలు ఒక వైపు, దానికి ప్రతికోటి అయినచాలా తక్కువ చరిత్రలు ఇంకొక వైపు కానవస్తున్నాయే! అని అన్నాడు. విశ్వామిత్రమునికి కైంకర్యం చేశారు- అనేది ఒక వైపు; వానరప్రభువైన సుగ్రీవునకు సేవ చేశాడు అనేది వేఱొక వైపు; పరశురాముని తపస్సును భగ్నం చేశాడు- అనేది ఒక వైపు. ఒక క్షుద్రజంతువైన కాకాసురుని కంటిని పోగొట్టాడు- అనేది ఇంకొక వైపు. మహర్షి అయిన భరద్వాజుని ఆశ్రమంలో ఆరగించాడు- అనేది ఒక వైపు. వేటగత్తె అయిన శబరిచేతితో ఆరగించాడు- అనేది ఇంకొక వైపు. ఆహా! ఇవి ఏమి పరస్పరం పొసగని చరిత్రలు? అని ఆశ్చర్యపడి పల్కిన మాట అది. దీనివల్ల శబరిచేతితో ఆరగించడం, భరద్వాజాశ్రమంలో ఆరగించడంతో సమానంగా గౌరవించదగినదని తెలుపబడింది.



**58. పంపాతీరే హనుమతా సంగతో వానరేణ హ ।**

సీతాదేవిని కోల్పోయి, జటాయువుకు బ్రహ్మమేధసంస్కారాన్ని చేసి, **"రాజ్యాత్ భ్రంశో వనే వాసో నష్టా సీతా హతో ద్విజః, ఈదృశీయం మమాలక్ష్మీః నిర్దహేదపి పావకమ్"** (రాజ్యాన్ని కోల్పోవడం, వనవాసం, సీతను కోల్పోవడం, జటాయువు మరణం - ఇటువంటి ఈ నా దురదృష్టం అగ్నిని కూడా పూర్తిగా దహిస్తుంది) అని పరితపిస్తూ పంపాతీరానికి చేరిన శ్రీరాముడు ఆ పంపానదీ సన్నివేశాలను చూచి, తట్టుకోలేని ఆర్తిలో మునిగిపోయాడు. ఈ స్థితిలో ఉండే ఇతడు ఏవిధంగా తేరుకొంటాడు? అని అందరు భీతి చెందవలసిన పరిస్థితి కల్గింది. అపుడు విధివశంచేత మారుతాత్మజుడైన హనుమానుడు అక్కడకు వచ్చాడు- అని పలికే మహర్షి **"హనుమతా సంగతో వానరేణ సః"** అని అనకుండా, **"వానరేణ హ"** అని అన్నాడు.

**(హ)-** అనేది సంతోషసూచకం. "దైవాధీనంగా శ్రీరాముని ప్రాణాలు నిలిచాయి'' అనే సంతోషం పొంగి పలికేమాట. "అరణ్యంలో సొత్తు కొల్లగొట్టబడిన వారు తల్లిని చూచినట్లుగా'' **("కాట్చిలే వழிపడియుణ్డవర్ తాయ్ ముకత్తిలే విళిక్కుమాపోలే")** అనేది ఆచార్యులు అనుగ్రహించిన సూక్తి. అంటే- ఒకడు అరణ్యంలో ప్రయాణం చేసేటపుడు చోరుల చేతికి చిక్కి, సర్వస్వాన్ని కోల్పోయి దుఃఖిస్తూ ఉండగా, తల్లి వచ్చి తనను చేరితే, ఆశ్వాసాన్ని పొందేటట్లే, సీతను రావణునిచే కొల్లబట్టబడిన శ్రీరాముడు ఊఱటను పొందడానికి వీలుగా హనుమానుడు వచ్చి, కలిశాడు - అని భావం. పూర్వం ఉదాహరించిన ఆచార్య శ్రీసూక్తిని సంస్కృతీకరించిన గోవిందరాజాచార్యులవారు **"చోరైः వనే అపహృత సర్వస్వస్య స్వజనముఖావలోకనవత్ అతీవ ఆశ్వాస మితి మునేర్హర్షः"** అని ముద్రింపబడింది. ఈ మార్పులో అర్థవిరోధం ఏమీ లేదని తోచినా, **"స్వజననీ ముఖ"** అనేదే ఆచార్యులు (వ్యాఖ్యాత) వ్రాసిన పాఠమని గ్రహించాలి.

**59. హనుమద్వచనాచ్చైవ సుగ్రీవేణ సమాగతः ।**
**సుగ్రీవాయ చ తత్ సర్వం శంసత్ రామో మహాబలः ॥**

తరువాత శ్లోకంలో శ్రీరామునకు, సుగ్రీవమహారాజునకు అగ్నిసాక్షికంగా స్నేహం జరిగిందని తెలుపబడుతున్నది. శ్రీరాముడు సుగ్రీవుని శరణాగతి చేసినట్లు చెప్పబడుతున్నది. దీనిని చూచి కొందఱు శ్రీరాముని విషయంలో కొఱతను సంభావిస్తారు. సుగ్రీవునితో సఖ్యం చేసి, వాలిని వధించాడు కదా! అది అంత తగిన కార్యం కాదు. రావణ సంహారానికి సహాయంకోసం వెదికే శ్రీరాముడు, ఆ

రావణుని తోకతో చుట్టి విదల్చిన మహావీరుడు వాలిని సహాయంగా చేసికొని, అనాయాసంగా తానుకోరిన ప్రయోజనాన్ని పొంది కలిగి ఉండగా, దుర్బలుడైన సుగ్రీవుని సహాయంగా చేసికోవడం ఔచిత్యాన్ని తెలిసినవాని కార్యంగా లేదే! అని శంకించనక్కరలేని రీతిలో ఇక్కడ **"శంసత్ రామో మహాబలః"** (మహాబలుడైన రాముడు తెలియజేశాడు) అని ప్రయోగింపబడింది. **"శంసత్"** అనే పదానికి **"అశంసత్"** (చెప్పాడు) అని అర్థం ఇది లఙ్ రూపం. ఆర్షప్రయోగం.

**(మహాబలః)** - శ్రీరాముడు రావణసంహారాన్ని గూర్చి మనస్సులో భావించినవాడే కాడు. దానిని చేయగోరినా సహాయం ఏమీ లేకుండా దానిని నిర్వహించడంలో ఏ కొఱత లేనివాడు. చరిత్రలను గమనించినపుడు, రావణుడు వేయి బాహువులను కలవీరుడైన కార్తవీర్యార్జునుని చేతిలో భంగపడ్డాడు. ఆ కార్తవీర్యార్జునుడు **"కోక్కులమున్నై మూవెఴుకాల్ ఒరు కూర్మఴువాల్ పోక్కియ దేవన్"** (భూమిపై ఉండే క్షత్రియులను ఇరవైఒక్కమార్లు తన అద్వితీయమైన, పదునైన గొడ్డలితో వధించిన దేవుడు) అయిన పరశురాముని చేతిలో భంగపడ్డాడు. ఆ పరశురాముడు కూడా, "నా వింటిబలాన్ని చూచి పో"- అని ఎదిరించి, తన వింటితో పాటు తపస్సును కూడా కోల్పోయి శ్రీరాముని చేతిలో భంగపడ్డాడు- అనే దానిని బాగా తెలిసికొంటున్నాము. ఇటువంటి మహావీరసార్వభౌముడైన శ్రీరాముడు **"పాల్ల అరక్కనై కిళ్ళిక్కళైన్దాన్"** (దుష్టుడైన రక్కసుని గిల్లి పారవేశాడు) అని గోదాదేవి పల్కిన రీతిలో, రావణుని అవలీలగా సంహరించగల్గినవాడు - అనేది నిస్సందేహం, నిర్వివాదమైన విషయం. అందువల్ల సుగ్రీవుని సహాయంగా గ్రహించాడు - అనేది అసంభావితం. దీనబంధువు అని, దీనదయాళువు - అని ఘోషింపబడే తన మహాగుణాన్ని లోకంలో ప్రకాశింపజేయగోరి శ్రీరాముడు సుగ్రీవుని పరిగ్రహించాడు. **"కలైయుమ్ కరియుమ్ పరిమావుమ్ తిరియుమ్ కానమ్ కడన్దుపోయ్, చ్చిలైయుమ్ కణైయుమ్ తుణైయాక చ్చెన్ఱాన్ వెన్ఱి చ్చెరుక్కళత్తు"** అని తిరుమంగైమన్నన్ పల్కిన రీతిలో శ్రీరామునకు తన విల్లు, బాణాలే సహాయం తప్ప వేఱేమీ సహాయం కాదు. బాగా లోతుగా చూస్తే, ఆ విల్లు, బాణాలుకూడా సహాయం కాదు. విభీషణ పరిగ్రహప్రకరణంలో **"అంగుళ్యగ్రేణ తాన్ హన్యాం ఇచ్ఛన్ హరిగణేశ్వర!"** (సుగ్రీవా! నా కాలివేళ్ళ చివరిభాగంతోనే, వారిని నేను వధించాలని అనుకుంటే, వధించగలను) అని సుగ్రీవునితో శ్రీరాముడు పల్కిన మాటను గమనిస్తే, ఇది బాగా వ్యక్తమవుతున్నది. కదా! **"ఇచ్ఛన్"** అనే దానికి అర్థం "సంకల్పమాత్రంచేతనే" అనేదే కదా. ఈ విషయాలను అన్నిటిని హృదయంలో ఉంచుకొనియే ఇక్కడ **"రామో మహాబలః"** అని అనబడింది.



**86. అభిషిచ్య చ లంకాయాం రాక్షసేంద్రం విభీషణమ్ ।**
**కృతకృత్య స్తదా రామో విజ్వరః ప్రముమోద హ ॥**

ఈ శ్లోకంలో విభీషణాళ్వాన్ పట్టాభిషేకం, దానివల్ల శ్రీరాముడు మనస్సులో పొందిన ఆనందాతిశయం అద్భుతంగా తెలుపబడుతున్నది. తరువాత, యుద్ధకాండంలో విభీషణునకు పట్టాభిషేకం చేసిన వృత్తాంతం వాల్మీకి మహర్షిచే రెండు చోట్ల చెప్పబడింది. విభీషణుడు రాక్షసులు నల్గురితో శ్రీరాముని సన్నిధానానికి వచ్చి చేరి, సుగ్రీవాదులతో జరిగిన వాదవివాదాలు పూర్తి అయిన తరువాత, శ్రీరాముడతనిని స్వీకరించిన వివరాలన్నీ యుద్ధకాండంలోని 18వ సర్గలో తెలుపబడ్డాయి. తరువాత పందొమ్మిదవ సర్గలో విభీషణాళ్వాన్‌ను శ్రీరాముడు గట్టిగా కౌగలించుకొని ఆనందించి, "సముద్రంనుండి తీర్థాన్ని తీసికొనివచ్చి, ఈ విభీషణాళ్వాన్‌ను రాక్షసప్రభువుగా నా అభీష్టానుసారం అభిషేకించు" అని లక్ష్మణుని నియమించి, పట్టాభిషేకాన్ని నిర్వర్తించినట్లుగా చెప్పబడింది. తరువాత, రావణవధానంతరం, అతనికి దహనసంస్కారాదులు చేయబడిన పిమ్మట, నూట పదిహేనవ సర్గలో విభీషణుని లక్ష్మణుడు రాజసింహాసనంలో కూర్చుండబెట్టి మళ్ళీ పట్టాభిషేకం చేసినట్లు చెప్పబడింది. సుగ్రీవమహారాజుకు వాలివధానంతరం కిష్కింధారాజ్యాభిషేకం, విభీషణునకు (రావణవధకు) ముందు, వెనుకలలో రెండుమార్లు రాజ్యాభిషేకం. దీనినిగూర్చి తరువాత వివరింపబడుతుంది.

ఇపుడు **"అభిషిచ్య చ లంకాయామ్"** అనే శ్లోకం ద్వారా చెప్పబడే అభిషేకం చివరవరకు జరిగినది మాత్రం తెలుపబడుతున్నది. అందులో కూడా కొంచెం వ్యత్యాసం ఉన్నది. అది ఏమంటే- సీతాదేవి అగ్నిప్రవేశాన్ని చేసి, తన పవిత్రతను దృఢీకరించుకొని శ్రీరామునివద్దకు రావడానికి ముందే విభీషణపట్టాభిషేకం జరిగినట్లుగా తరువాత కథాసందర్భమున్నది. ఇక్కడ సీతా సమాగమమైన తరువాత అది జరిగినట్లుగా చెప్పబడింది. ఈ పౌర్వాపర్యం లెక్కించదగినది కాదని గ్రహించాలి. రెండు మార్లు జరిగిన పట్టాభిషేకాన్ని ఒకమారు కలిపి పల్కి పూర్తిచేశారని తెలియాలి.

విభీషణాళ్వాన్‌మొదట రాగానే జరిగిన పట్టాభిషేకాన్నిగూర్చి కూరేశులు అతిమానుషస్తవంలో- కొన్ని శ్లోకాలను సరసంగా ప్రశ్నించే రీతిలో వ్యక్తం చేసిన ఒక తత్త్వార్థం ఇపుడు వివరింపబడుతున్నది. ఆ స్తుతిలోని 24వ శ్లోకంలో **"అభిం న తేరి ధన జిగ్యిథ రాక్షసేంద్రం, నైవాస్య జజ్ఞిథ యదా చ బలాబలం త్వమ్, నిస్సంశయః సపది తస్య పదేభ్యషించఃతస్యానుజం కథమిదం హి విభీషణం**

**చ"** (నీవు, సముద్రాన్ని దాటలేదు; రావణుని జయించలేదు; అతని బలాబలాలను కూడా తెలియనే లేదు. అయినా, ఏ సందేహం లేకుండా, ఆ రావణుని తమ్ముడైన విభీషణునకు ఏవిధంగా పట్టాభిషేకాన్ని చేశావు?) మనుష్య భావన ఒకవైపు ఉన్నప్పటికీ, పరత్వోంకాతికమైన సత్యసంకల్పత్వాన్ని మధ్యమధ్యలో వ్యక్తం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి - అని చూపడం ఇక్కడ ప్రధాన వివక్షితం. "శ్రీరామా! సముద్రాన్ని దాటవలసిన కార్యం బలీయంగా ఉన్నది. దానిని దాటి లంకకు వెళ్ళినా, వరబలభుజబలాలతో అప్రధృష్యుడైన రావణుని జయించవలసిన పని దానికి మించి ప్రబలంగా ఉన్నది. ఇవి ఉన్నప్పటికీ, సముద్రాన్ని దాటకుండా, లంకాధీశుని జయించకుండా, అతనిని జయించడానికి సాధ్యమా? అని అతని బలాబలాలను విచారించి తెలిసికోకుండా, అతని స్థానంలో అతని తమ్ముడైన విభీషణాళ్వాన్‌ను అభిషేకించడం ఏ ధైర్యంతో?'' అనేది ఇచటి ప్రశ్న. ఇది శ్రీరాముని ఉద్దేశించి ప్రశ్నించినందున, అతడే స్వయంగా సమాధానం చెప్పాలని కూరేశుల అభిప్రాయం కాబోలు. ఇది జ్ఞాతప్రశ్నయే తప్ప, అజ్ఞాతప్రశ్న కానందున, కూరేశుల హృదయగతమైన అభిప్రాయాన్ని వివరిస్తాను.

శ్రీరాముడు సముద్రసమీపానికి వచ్చి చేరగానే, ఈ సముద్రాన్ని దాటి వెళ్ళడం ఏవిధంగా? అని చాలా విచారాన్ని పొందినట్లుగా చెప్పబడడం ఒకవైపు ఉన్నా, **"తపసా సేతుబంధేన సాగరోచ్ఛోషణేన వా, సర్వథా సుసమర్థోస్మి సాగర స్యాస్య లంఘనే"** (తపస్సుతో, సేతువును కట్టడం ద్వారా గాని, సాగరాన్ని ఇంకింప చేయడం ద్వారా గాని ఈ సముద్రాన్ని దాటడంలో నేను బాగా సమర్థుడను) అని అంటూ తనకు సముద్రాన్ని దాటడం చాలా సులభమే అనే విషయాన్ని తెలిపినందున, రావణుని కూడా జయించిన కార్తవీర్యార్జుని సైతం జయించిన పరశురామునిసైతం ఓడించిన తమకు రావణుని జయించడం ఒక విషయమా? అని భావించినందున, సముద్రతరణం, రావణ వధ చేసినట్లుగానే భావించాడు- అని అనడంలో కొఱత లేదు. విభీషణునకు మొదట పట్టాభిషేకం జరిపించే సమయంలో అతనిని చూచి **"ఆఖ్యాహి మమ తత్త్వేన రాక్షసానాం బలాబలమ్"** (రాక్షసుల బలాబలాలను నాకు యథాతథంగా తెలియజేయి) అని రాక్షసుల బలాబలాలను యథాతథంగా తెలుపమని శ్రీరాముడు అడిగాడు. ఇందువల్ల తమకు మనస్సులో ఒకవైపు విచారం ఉన్నట్లుగా స్ఫురించినా, ఈ ప్రశ్న అన్యార్థం (ఇతరులు తెలియడం కోసం) అనేది మన పూర్వాచార్యులు మర్మాన్ని తెలిసి వివరించారు.



ఏవిధంగా అంటే - శ్రీవచనభూషణంలో (228వ సూత్రంలో) **"విభీషణనై రావణన్ "కులపాంసనమ్" ఎన్జాన్. పెరుమాళ్ ఇక్ష్వాకుకులవంశ్యరాక నినైన్దు వార్త్తై యరుళిచ్చెయ్దార్"** (రావణుడు విభీషణుని కులపాంసనుడు - అని అన్నాడు. శ్రీరాముడు, ఇక్ష్వాకు కులానికి చెందినవానినిగా అతనిని భావించి, అతనితో సంభాషించాడు) అనేది పిళ్ళైలోకాచార్యులవారి శ్రీసూక్తి. ఇందులో రావణుడు కులపాంసనుడని అనడంలోని అర్థం అందఱికి సునాయాసంగా తెలుస్తుంది. శ్రీరాముడు ఇక్ష్వాకువంశానికి చెందినవానినిగా భావించి పల్కడం ఏవిధంగా? అనేది శ్రీవరవరమునుల వ్యాఖ్యానాన్నిబట్టి తెలియాలి. శ్రీవరవరమునుల వ్యాఖ్యాన శ్రీసూక్తి ఈ రీతిలో ఉన్నది. **"ఇక్ష్వాకు కులనాథరాన పెరుమాళ్ ఇవనై ఆదరపూర్వకమాక అంగీకరిత్త అనంతరమ్ "ఆఖ్యాహి మమ తత్త్వేన రాక్షసానాం బలాబలమ్" ఎన్ఱ రాక్షసరుడైయ బలాబలమిరుక్కుమ్బడియై తమక్కు శొల్లుమెన్ఱైయాలే, ఇవనై రాక్షసజాతీయనాక నినైయాదే తిరుత్తమ్బిమారోపాదియాక అభిమానిత్తు వార్త్తై యరుళిచ్చెయ్దారెన్ఱై"** (ఇక్ష్వాకువంశప్రభువైన శ్రీరాముడు విభీషణుని ఆదరంగా అంగీకరించిన తర్వాత, "రాక్షసుల బలాబలాలను గూర్చి నాకు యథాతథంగా చెప్పు'' అని అంటూ రాక్షసుల బలాబలాలు ఉండేరీతిని తనకు తెలుపుమని పల్కినందువల్ల, ఇతనిని రాక్షసజాతీయుడని భావించకుండా తన తమ్మునిగానే భావించి మాట్లాడాడు - అని భావం. ) అని. నిజానికి శ్రీరాముడు రాక్షసజాతికి చెందిన విభీషణుని నేరుగా ఉద్దేశించి పలికే మాటలో **"యూష్మాకాణామ్"** అనిగాని, **"త్వదీయానామ్"** అని గాని పల్కి ఉండాలి తప్ప, ఈవిధంగా పల్కడం పొసగదుకదా ! పంచవటిలోకి వచ్చిన శూర్పణఖ **"విభీషణస్తు ధర్మాత్మాన తు రాక్షసచేష్టితః"** (విభీషణుడైతే, ధర్మాత్ముడు. రాక్షస ప్రవృత్తిని కలవాడు కాదు) అని పల్కినది. రాక్షస జాతీయత్వాన్ని విభీషణునకు అంగీకరించి, అతనికి రాక్షసచేష్టితాలు లేవని అన్నది. శ్రీరాముడు రాక్షసజాతినే తొలగదోసి పలికాడు. ఈవిధంగా **"ఆఖ్యాహి"** ఇత్యాదిప్రకృతశ్లోకం బలాబలజిజ్ఞాసతో పల్కినది కాదు. విభీషణునకు ఇక్ష్వాకువంశత్వాన్ని స్థాపించడంకోసం అవతరించింది. అంతే- అని తెలిసింది.

ప్రస్తావించిన అతిమానుషస్తవశ్లోకాన్ని ఇక ముగిస్తాను. **(నిస్సంశయ స్సపది తస్య పదేభ్యషించుః)** అనే ప్రశ్నతో శ్లోకాన్ని ముగించారు, కూరేశులు. సత్యకామత్వ- "సత్యసంకల్పత్వాలను దేవరవారు మఱుగుపరచుకొని అవతరించినట్లుగా చూపినా, గీతలోనే **"ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామి"** (నా అసాధారణ స్వభావంతో

అవతరిస్తాను.) అని పల్కిన రీతిలో అజహత్ స్వభావుడుగానే అవతరించావు కనుక, "నేను తలచినది తలచినట్లే పదికి పదింతలుగా చేసి ముగించగల్గినవాడననే నిశ్చయంతో మునుముందుగా విభీషణునకు పట్టాభిషేకాన్ని చేశావు"- అనేది కూరేశుల మనస్సులోని సమాధానం. ఇక్కడ కొందఱు చెప్పే విషయం ఒకటి ఉన్నది. విభీషణుకు అభయాన్ని ఇచ్చి అతనిని తనవద్దకు పిలుచుకొని రమ్మని సుగ్రీవుని నియమించినపుడు, **"విభీషణో వా సుగ్రీవ యది వా రావణః స్వయమ్"** అని, "నా కంటికి కన్పడకుండా దూరంగా ఉండి అభయాన్ని కోరినవాడు విభీషణుడు కాకుండా, మాఱు వేషం వేసికొనివచ్చిన రావణుడేనని తెలిసినా, అతనిని కూడా విడువకుండా ధారాళంగా తీసికొని రా" అని నియమించినవాడు కనుక, లంకేశ్వరుడైన రావణుని పరిగ్రహించడంకూడా శ్రీరామునకు అభిమతమే నని తెలియడంవల్ల, ఏదో ఒక వ్యాజాన్ని పురస్కరించుకొని అంగీకరించిన తమ స్వభావ విశేషం చేతనే ఒకవేళ అతనిని అనుగ్రహించవలసివస్తే, విభీషణుడు అతనికి దాసుడై ఉండడం సంభవిస్తుందేమో- అని శంకించి, దానికి అడ్డు తీరేటట్లుగా ముందుగానే విభీషణునకు పట్టాభిషేకం చేశాడు- అని కొందఱి మాట). ఈవిధంగా పల్కడంలో ఏవిధమైన అఔచిత్యం లేదు. **"శెల్వ విబీడనుక్కు వేఱొక నల్లాన్"** అని తిరుమంగై ఆళ్వార్లు అనుగ్రహించిన రీతిలో విభీషణాళ్వాన్ పట్ల శ్రీరామునకు ప్రత్యేకమైన ఒకప్రీతి ఎవరూ కాదనలేని రీతిలో ఉన్నందున, అతనిచే శ్రీరంగ శ్రీసమృద్ధి చెందాలని, **"మిన్నిలఙ్గు పూణ్ విబీడణనమ్బిక్కు ఎన్నిలఙ్గు నామత్తళవుమర శెన్ఱు"** అని పెరియాళ్వార్లు అనుగ్రహించిన రీతిలోనే అతనికి చిరంజీవి పదవిని ఇచ్చి, **"మన్నుయిర్ విబీడణఱ్కు మదిళిలఙ్గై త్తిశై నోక్కి మలర్కణ్ వైత్తు"** ఆనందించాలని శ్రీరామునకు అభిప్రాయం ఉన్నదని అనడంలో అడ్డు లేదు. అందువల్ల, సత్రాత్రసార్వభౌముడైన విభీషణాళ్వాన్ పట్ల చూపించిన విశేషాభిమానం చాలా తగినదని తెలిసింది.

ఇక, **"అభిషిచ్య చ లంకాయామ్"** అనే ప్రకృతశ్లోకంలో ప్రవేశించి, కొన్ని రస్యవిశేషార్థాలను అనుభవిద్దాం. ఇందులో, ఉత్తరార్ధంలో ఒక్కొక్క పదం విలువకట్టడానికి సాధ్యం కాని మాణిక్యంవంటిది.

**(కృత్యకృత్య స్తదా రామో విజ్వరః ప్రముమోద హ)- "రామః తదా కృతకృత్యః, తదా రామో (బభూవ), తదా విజ్వరః, తదా ప్రముమోద"-** వీటి అన్నిటికి మించి **"హ"** అనేది ఒకటి ఉన్నది. ఇంతటికి పొసగేటట్లుగా పూర్వార్ధం ఏవిధంగా ఉండాలి? అంటే, **"వినిహత్య చ లంకాయాం రావణం రాక్షసేశ్వరమ్"** (రాక్షస ప్రభువైన



రావణుని లంకలో వధించి) అని ఉంటే మంచిది. ఖండించినా, ఖండించినా మళ్ళీ మళ్ళీ మొలిచే శిరస్సులను నఱికి పడదోసి, అతని ప్రాణాలను తీసి, శ్రీరాముడు కృతకృత్యుడయ్యాడు. మనస్సులో సంతోషించాడు - అని అంటే, ఆ మాట పొసగుతుంది. విభీషణుని శిరస్సుపై కిరీటాన్ని పెట్టి, కృత్యకృత్యుడయ్యాడు అనేది ఏమి? **"కృత్యకృత్యః"** అనే పదం ఎవరిని తెలుపుతున్నది? **"కృతాని కృత్యాన్ సకలాని యేన సః- కృతకృత్యః"-** చేయవలసిన కార్యాలను అన్నిటిని చేసి పూర్తిచేసినవాడెవడో, అతడు కృతకృత్యుడన బడుతున్నాడు. అరణ్యాలకు పోయిన శ్రీరాముడు తిరిగి అయోధ్యకు వచ్చి తాను పట్టాభిషేకాన్ని చేసికొంటేకదా కృతకృత్యుడు కావడం. దానికి ముందే కృతకృత్యుడయ్యాడు, విజ్వరుడయ్యాడు, ప్రముదితుడయ్యాడు- అని అనడం తగునా ? అని శంకించవచ్చు. ఈ సందర్భంలో నమ్బిళ్ళై అనుగ్రహించిన రస్యమైన అర్థం ఒకటి ఉన్నది. అది ఏమంటే- భరతాళ్వాన్ పట్టాభిషేకాన్ని చేసికోను- అని తిరస్కరించినట్లే, ఇతడుకూడా తిరస్కరిస్తే ఏం చేయాలి ? కిరీటధారణకు తిరస్కరించడం ఇక్ష్వాకువంశంలోనివారికి అందఱికి అలవాటైన పని అయినదే. ఇతడుకూడా, ఇక్ష్వాకువంశ్యుడై నందున ఈ అనంగీకారం ఇతనిని కూడా అనువర్తిస్తుందా?- అని శ్రీరాముడు భయపడ్డాడు. ఇతడు కాదనకుండా సులభంగా అంగీకరించి నందువల్ల మనస్సులో చాలా ఆనందించి, **"ఇదానీం కృతకృత్యోస్మి"** అని శ్రీరాముడు అన్నాడు. దానిని మహర్షి **"కృతకృత్య స్తదా రామః"** అని అనుభాషించాడు- అని. ఇది రసోక్తి అనదగినది. ఇక, శాస్త్రార్థమున్న రీతిని వినండి. విభీషణాళ్వాన్ విషయం ఒకటే కాదు. **"యః కశ్చిదేవ యది కించన హంత! జంతుః భవ్యో భజేత భగవంత మనన్యచేతాః, తం సోయ మీదృశ ఇయానితి వాఽప్యజానన్ హై వైనతేయసమ మప్యురరీకరోషి"** (ఆహా! ఎవడైనా ఒకడు నిన్ను అనన్యమైన భక్తితో ఆరాధిస్తే, అతడు ఎటువంటి వాడు? ఎవడు? అని గమనించకుండా, అతనిని గరుడునితో సమానంగా ఆదరిస్తావు.) అని కూరేశులు అనుగ్రహించిన రీతిలో, ఈనాడే ఒకడు వచ్చి శరణాగతి చేసినప్పటికీ, అతనిపట్ల భగవానుడు చూపించే ప్రీతి అప్రమేయమై, అతని కార్యాన్ని తన కార్యంగా భావించి ఆనందించడం భగవానుని స్వభావ మైనందున, అది ఈ సందర్భంలో ప్రకాశించింది. తన కార్యం పూర్తిచేసి, దానివల్ల తనను కృతకృత్యునిగా భావించేవాడు కాపురుషుడు కదా! తన కంటే అన్యుని కార్యాన్ని తన కార్యంగా గ్రహించి, అది పూర్తికాగానే తనను కృతకృత్యునిగా భావించేవాడేకదా నిజమైనకృతకృత్యుడు. **"ప్రాయో హ్యకృతకృత్యత్వాత్ మృత్యో**

**రుద్విజతే జనః, కృతకృత్యా ప్రతీక్షంతే మృత్యుం ప్రియమివాతిథిమ్"** (సాధారణంగా, లోకంలోని మానవుడు, తాను చేయవలసిన కృత్యాన్ని చేయనందు వల్ల, మృత్యువుకు భయపడతాడు. కృతకృత్యులు మృత్యువును ప్రియమైన అతిథిని వలె ఎదురుచూస్తారు) అనే ప్రసిద్ధమైన మనుమహర్షి వచనంలోని అకృతకృత్య-కృతకృత్యశబ్దాలను ఇక్కడ స్మరించరాదు. **"విదుః కృష్ణం బ్రాహ్మణా స్తత్త్వతో యే, తేషాం రాజన్! సర్వయజ్ఞాః సమాప్తాః"** (ఓరాజా! భగవానుడైన కృష్ణుని యథాతథంగా తెలిసిన బ్రాహ్మణులు ఎవరో, వారి యజ్ఞాలన్ని పూర్తి అయినట్లే) ఇత్యాదిగా కృతకృత్యులుగా గౌరవింపబడే పరమైకాంతుల స్వభావం మనవంటి వారికి అనుకరణీయ మవుతుంది. అంతే, నమ్మాళ్వార్లు తిరువాయ్‌మొళిలోని వానమామలై దశకంలో **"శెయ్‌ద వేళ్వియర్ వైయత్తేవర్"** (యజ్ఞాలను నిర్వహించి పూర్తిచేసిన భూసురులు) అని ప్రశంసించిన అధికారులు భగవద్విషయంలో చేయవలసినవానిని అన్నిటిని పూర్తి చేసి, గుండెలపై చేయి వేసికొని నిద్రపోతారు. స్తోత్రరత్నంలోని (18వ శ్లోకంలో) **"వశీ వదాన్యో గుణవాన్ ఋజుశ్శుచి"** ఇత్యాది శ్లోకంలో **"కృతీ"** అనే పదానికి వ్యాఖ్యానాన్ని అనుగ్రహించే వేదాంతదేశికులు **"కృతీ- ఆశ్రితరక్షణేన కృతకృత్యః. తదుక్తం - 'అభిషిచ్య' ఇత్యారభ్య, 'కృతకృత్యస్తదా'- ఇతి"** (కృతీ - ఆశ్రిత రక్షణం చేయడంవల్ల కృతకృత్యుడయ్యాడు. ఆవిధంగా చెప్పబడింది - **'అభిషిచ్య'** అని ఆరంభించి, **'కృతకృత్యస్తదా'** అనే పర్యంతం గల భాగంలో) అని పల్కిన సూక్తి ప్రకృతంలో గమనించాలి. ఈ విధంగా, ఆశ్రిత రక్షణను స్వప్రయోజనంగా భావించి, దానిని పూర్తిచేసి, ఆనందించేవాడు కృత్య కృత్యుడని భావం. భగవద్గీతలోని తొమ్మిదవ అధ్యాయంలో చివరలోని **"మన్మనా భవ మద్భక్తః"** అనే శ్లోకభాష్యం తాత్పర్యచంద్రికలో **"ఆశ్రితసంరక్షణం స్వలాభం మత్వా ప్రవర్తతే"** (ఆశ్రితులను సంరక్షించడం తనలాభంగా తలచి ప్రవర్తిస్తాడు) అని పల్కడం కూడా దీనిని దృష్టిలో పెట్టుకొనియే.

**(తదా రామః)** - అనేదానిని విశేష్యవాచకపదంగా గ్రహించడం మాత్రమే కాక, **"తదా రామో బభూవ"** (అపుడు రాముడు అయ్యాడు) అని ప్రత్యేక వాక్యంగా చేసి, దీనినికూడా ఒక లాభంగా చేసి వివరిస్తారు రసికులు. **"రమయతీతి రామః"** (ఆనందింపజేస్తాడు కనుక రాముడు) అని, **"రమతే ఇతి రామః"** (ఆనందిస్తాడు కనుక రాముడు) అని రెండు పదాలుగా వ్యుత్పత్తి రామశబ్దానికి ఉన్నదికదా! రెండవ వ్యుత్పత్తి ఇక్కడ చాలా పొసగుతుంది. **"గుహేన సహితో రామః"** (గుహునితో కూడిన రాముడు) అనే సందర్భంలో **"గుహేన సహితస్సన్ రామో బభూవ"** (గుహునితో కలసినవాడై రాముడయ్యాడు) అనే యోజన ఉన్నది కదా! అదే



రీతిలో, విభీషణునకు అభిషేకం అయిన పిమ్మటనే తనను రామునిగా భావించాడు, శ్రీరాముడు.

**(తదా విజ్వరః)- "కార్యే కారణోపచార"** మనే క్రమంలో జ్వరకార్యమైన దుఃఖంలో జ్వరశబ్దం ఔపచారికంగా ప్రయోగింపబడింది. సహస్రనామాలలో **"అనిర్విణ్ణః"** అనే ఒకనామం ఉన్నది. ఇక్కడ నిర్వేదంయొక్క అత్యంతాభావాన్ని గ్రహించడంకంటే ప్రధ్వంసాభావాన్ని గ్రహించడం రస్యమని రసికులు అంటారు. మనకు సంభవించే శోకాలు కర్మాధీనాలు. అతనికి (భగవానునకు) సంభవించే శోకం కృపాధీనం. భక్తులకు దుఃఖం కల్గినపుడు తాను దుఃఖం లేకుండా ఉన్నాడు- అనేది ఒక విషయం కాదుకదా ! తిరువాయ్‌మొళిలోని **"తుయరఱు శుడరడి"** అనే సందర్భంలో **"తుయర్ అఱుక్కుమ్ శుడరడి"** (దుఃఖాన్ని తీర్చే ప్రకాశవంత మైన శ్రీచరణాలు) అనే అర్థాన్ని పూర్వాచార్యులు గ్రహించారు. **"తుయరఱుమ్ శుడరడి"** (దుఃఖం తీరే ప్రకాశవంతమైన శ్రీచరణాలు) అని భగవద్రామానుజులు అర్థాన్ని గ్రహించారు. అంటే- భక్తుల దుఃఖం తీరగా తాను దుఃఖం తీరినవాడై ఉంటాడు- అనేదానికి నిదానమిదియే. విభీషణాళ్వాన్ పట్టాభిషేకాన్ని తనకొక పురుషార్థంగా భావించక పోయినా, ఇతఃపూర్వమే ఒకసారి సముద్రతీరంలో ఇది నిర్వహింపబడినా, నాగపాశబంధసమయంలో **"యన్మయా న కృతో రాజా రాక్షసానాం విభీషణః, తచ్చ మిథ్యా ప్రలప్తం మాం ప్రధక్ష్యతి న సంశయః"** (విభీషణుని రాక్షసప్రభువుగా నేను చేయలేకపోయానందువల్ల, నామాట అసత్య మైనదనే విషయం నన్ను తప్పక దహిస్తుంది; సందేహం లేదు) అనే రీతిలో తన మనస్సు తపించడం అనేది ఉన్నది. కనుక, ఆ తాపం తీరింది- అని చెప్పబడింది. తాపం తీరడమే కాదు;

**(ప్రముమోద)** - సంతాపం ప్రవర్తించిన చోట్లలో అంతటా సంతోషం సుస్థిరమైనది అని భావం. **"ప్రాప్తావుమ్, ప్రాపకనుమ్, ప్రాప్తిక్కు ఉకప్పాను మవనే"** (ఫలాన్ని పొందేవాడు, పొందించేవాడు, ఫలప్రాప్తికి ఆనందించేవాడు అతడే) అనే శ్రీవచనభూషణదివ్యసూక్తి ఇక్కడ అనుసంధేయం. సహస్రనామ స్తోత్రంలో **"పరర్ధిః, పరమస్పష్టః, తుష్టః, పుష్టః, శుభేక్షణః, రామః"** అనేచోట **"తుష్టః"** సంతోషించినవాడు- దశరథాత్మజుడు కావడమనే లాభంచేత సంతోషించినవాడు - అని భట్టర్ తమ భాష్యాన్ని అనుగ్రహించారు. దీనిని బట్టి అవతరించినపుడే సంతుష్టుడైనా, **"తదా ప్రముమోద"** అది సామాన్యసంతోషం. ఇది విశేషసంతోషమని తెలుపబడుతున్నది. **(హ)** **"ప్రముమోద"** అని అనడంద్వారా తెల్పిన సంతోషం భగవానునకు చెందినది.

**"హ"** అని అనడం ద్వారా తెలుపబడే సంతోషం మహర్షికి చెందినది. కేవలం కథను తెలుపబడమేకాక, అనుభవంలో అవగాహిస్తున్నాడు, మహర్షి.

తరువాత యుద్ధకాండంలో నూట ఇరవైయవ సర్గలో ఒక చిన్న వృత్తాంతం కన్పిస్తున్నది. అది ఏమంటే -శ్రీరాముడు దేవేంద్రునకు చేతులను జోడించి అంజలి చేసి నిలుపగా, ఇంద్రుడు శ్రీరాముని చూచి, ఏదయినా ఒక వరాన్ని వేడమని అన్నాడు. అపుడు శ్రీరాముడు **"యది ప్రీతి స్సముత్పన్నా మయి తే విబుధేశ్వర!, వక్ష్యామి కురు మే సత్యం వచనం వదతాం వర!, మమ హేతోః పరాక్రాంతాః తే గతా యమసాదనమ్, తే సర్వే జీవితం ప్రాప్య సముత్తిష్ఠంతు వానరాః"** (దేవతలకు ప్రభువైన ఓ ఇంద్రా! నీకు నాపట్ల ప్రీతి ఉన్నట్లైతే, ఒకమాట పల్కుతాను. నేను చెప్పే ఈ మాటను నీవు నిజం చేయాలి. నాకోసం వానరులంతా శత్రువులచే సంహరింపబడి యమలోకాన్ని చేరారు. వారందరూ మళ్ళీ తిరిగి ప్రాణాలను పొంది పైకి లేవాలి.) అనే వరాన్ని కోరినట్లు, యుద్ధరంగంలో మరణించిన వానరవీరులందఱు బ్రతికి లేచి తమ భార్యాపుత్రులతో కూడి సంతోషించేటట్లు వరాన్ని ఇవ్వాలి- అని శ్రీరాముడు వరాన్ని కోరగా, ఆవిధంగానే ఇంద్రుడు వరమిచ్చాడని, సకలవానరవీరులు నిద్రపోయి మేల్కొన్నట్లుగా లేచి వానర సమూహంలో చేరినట్లు ఆ వృత్తాంతంలో తెలుపబడుతున్నది. దానికి తగినట్లుగా ఇక్కడ సంక్షేపరామాయణంలో **"దేవతాభ్యో వరం ప్రాప్య సముత్థాప్య చ వానరాన్, అయోధ్యాం ప్రస్థితో రామః"** (దేవతలవల్ల వరాన్ని పొంది, వానరులను తిరిగి బతికింపజేసి, రాముడు అయోధ్యకు బయలుదేరాడు) అని తెలుపబడింది. ఈ రీతిలోనే వేఱొక వరంకూడా పొందినట్లు తరువాత ఒక వృత్తాంతం ఉన్నది. దానినిగూర్చి మళ్ళీ వివరిస్తాను. యుద్ధరంగంలో మరణించిన వానరవీరులందఱికి శ్రీరాముడు వరాన్ని వేడి బ్రతికించినట్లు చెప్పబడిన కథలో కొన్ని, చెప్పవలసిన అర్థాలున్నాయి. **"తత్ సర్వం ధర్మవీర్యేణ యథావత్ సంప్రపశ్యతి"** (జరిగిన విషయమంతా ధర్మవీర్యంవల్ల యథాతథంగా దర్శించగలవు) అని దేవతాను గ్రహాన్ని పొంది అవతరించినది, **"న తే వాగనృతా కావ్యే కాచిదత్ర భవిష్యతి"** (ఈ కావ్యంలో నీమాట ఏదికూడా అసత్యం కాదు) అనే ప్రఖ్యాతిని పొందినదైన శ్రీరామాయణంలో విప్లవం గాని, ఉపప్లవం గాని శంకించలేము. **"ఆత్మానం మానుషం మన్యే"** (నన్ను మానవునిగా భావిస్తున్నాను) అనే మనుష్యభావనకు అనుగుణంగా శ్రీరాముడు అనుష్ఠించినవానిలో మనం అవగాహించి యథార్థాన్ని తెలియవలసి ఉన్నది. అంతటా శ్రీరామాయణం పఠించేవారు తనియన్‌లలో చేర్చి



ఒక పెద్ద శ్లోకాన్ని అనుసంధించడాన్ని గమనించవచ్చు. అది ఏమంటే- **"వైదేహీ సహితం సురద్రుమతలే హైమే మహామంటపే మధ్యే పుష్పక మాసనేమణిమయే వీరాసనే సుస్థితమ్, అగ్రే వాచయతి ప్రభంజనసుతే తత్త్వం మునిభ్యః పరం వ్యాఖ్యాంతం భరతాదిభిః పరివృతం రామం భజే శ్యామలమ్"** (సీతతో కలసి ఉన్నవాడు, కల్పవృక్షం క్రింద బంగారు మహామండపం మధ్యలో, మణులు పొదిగిన ఆసనంలో వీరాసనంలో వేంచేసి ఉన్నవాడు, తనముందు ఉండే హనుమానుడు శ్రీరామాయణాన్ని పఠించగా, దానిలోని తత్వాన్ని మునులకు వ్యాఖ్యానించేవాడు, భరతుడు మొదలైనవారితో కూడియుండేవాడు, నల్లనివాడైన శ్రీరాముని భజిస్తున్నాను) అనేదే ఆ శ్లోకం. భరతుడు మొదలైనవారు అందఱు చుట్టూ చేరి ఉండగా, హనుమానుడు ఎదురుగా ఉండి శ్రీరామాయణాన్ని పఠిస్తూ ఉండగా, అక్కడ గుమిగూడి ఉండే మహర్షులకు శ్రీరాముడు స్వయంగా **"తత్త్వం మునిభ్యః పరం వ్యాఖ్యాంతమ్"** -గొప్ప తత్త్వార్థాలను ప్రస్తావించి వివరిస్తున్నాడని ఈ శ్లోకంలో తెలుపబడింది.

ఇందువల్ల, శ్రీరామాయణంలో పైపైన కన్పించే అర్థాలకంటే, గొప్పవైన లోతైన అర్థాలున్నాయని, వాటిని శ్రీరాముడు తానే స్వయంగా ప్రవచిస్తున్నాడని తెలుస్తున్నది. వానినే మన పూర్వాచార్యులు పరంపరగా విని గ్రహించి గ్రంథాలలో పొదిగి నిక్షిప్తం చేశారు. ప్రకృతంలో, దేవతల దుఃఖాన్ని తీర్చడంకోసం ఈ లోకానికి వచ్చి అవతరించి, **"మరవడియై తమ్బిక్కు వాన్ పణైయుమ్ వైత్తు పోయ్ వానోర్ వాழ్ చ్చెరువుడైయ తిశై క్కురుమమ్ తిరుత్తు వన్దలకాణ్డ తిరుమాల్"** (తన తమ్ముడైన భరతునకు పాదుకలను గొప్పజామీనుగా ఇచ్చి, వెళ్ళి, దేవతలు ఉజ్జీవించేటట్లుగా తన అవతార కార్యాన్ని నిర్వహించి, తిరిగి వచ్చి లోకాలను పాలించిన శ్రీపతి) అనే రీతిలో వారి కోరికలను తీర్చి ఉజ్జీవింపజేసిన శ్రీరాముడు ఆ దేవతల వద్ద వరాన్ని వేడి, వానరవీరులను పునరుజ్జీవింపచేశాడనే కథ క్రమంలో ప్రసక్తమైనా, తత్వార్థాన్ని అనుగ్రహించిన కూరేశుల ఒక శ్రీసూక్తి ఇక్కడ మనం స్మరించడం అవశ్యకర్తవ్యం. సుందరబాహుస్తవం చివరలో **"లంకాయుద్ధహతాన్ హరీన్ ద్విజసుతం శంబూక దోషాన్మృతం సాందీపస్య సుతం మృతం ద్విజసుతాన్ బాలాంశ్చ వైకుంఠగాన్, గర్భం చార్జునిసంభవం వ్యుదదధాః స్వేనైవ రూపేణ"** (లంకాయుద్ధంలో వధింపబడ్డ వానరులను, శంబూకుని దోషంవల్ల మరణించిన బ్రాహ్మణ కుమారుని, సాందీపని మరణించిన కుమారుని, కారణ వైకుంఠంలోని బ్రాహ్మణ పుత్రులైన బాలులను, ఉత్తరాగర్భంలో అభిమన్యుని వల్ల కల్గిన శిశువును

